# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 5-10-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 60 | పేజీలు 8 | వెల: రూ.1/-


## సల్మాన్‌ని బెదిరించిన వ్యక్తులు అరెస్ట్

హైదరాబాద్, అక్టోబర్ 4:గత వారం ప్రారంభంలో ఇద్దరు వ్యక్తులు బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌ని సోషల్ మీడియాలో బెదిరించిన సంగతి తెలిసిందే. పబ్లిసిటీ కోసం సెప్టెంబర్ 6న వారు సల్మాన్‌ని బెదిరించారు. తాజాగా వారిద్దరు దొంగతనం, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసులో పోలీసులకి దొరికారు. వారి పేర్లు జాకీ బిష్ణోయ్ అలియాస్ లారెన్స్ బాబల్, జగదీష్. అయితే జోధ్‌పూర్‌లోని లారెన్స్ ముఠాతో తనకి సంబంధం ఉన్నట్టు అందరు నమ్మాలని జాకీ తన పేరుకి ముందు లారెన్స్ తగిలించి లారెన్స్ జాకీ అని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. విలాసవంతమైన కారులో వెళుతున్న సమయంలో పోలీసులు వారిని పట్టుకొని విచారించగా దొంగతనం మరియు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడినట్లు పోలీసులు కనుగొన్నారు.

# నామినేషన్ వేసిన ఫడ్నవీస్

## మళ్లీ గెలుపు తమదే అని ధీమా




హైదరాబాద్,అక్టోబర్ 5(ఆంఎన్‌ఎ): మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ రోజు మంచి రోజు కావడంతో ఆయన నామినే షన్ దాఖలు చేశారు. ఈనెల 21వ తేదీన జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన నాగపూర్ (సౌత్ వెస్ట్) స్థానం నుంచి పోటీ చేయనున్నారు. నామినేషన్ వేయడానికి ముందు ఫడ్నవీస్.. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆశీస్సులు తీసుకున్నారు. నామినేషన్‌కు ముందు ఫడ్నవీస్ భారీ ర్యాలీ తీశారు. ఆచన కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడ్కరీ మాట్లాడుతూమహాలో మరోమారు బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నదని అన్నారు. తమకు ప్రజల మద్దతు ఉందన్నారు. గత ఐదేళ్ల ప్రగే తమను ముందు నిలుపుతుందన్నారు.

## మన హెలికాప్టర్‌ను మన మిస్సైలే కూల్చింది: ఎయిర్ చీఫ్

హైదరాబాద్,అక్టోబర్ 4: పాకిస్థాన్‌తో డాగ్‌ఫైట్ జరుగుతున్న సమ యంలో భారత వైమానిక దళానికి చెందిన ఎంఐ 17 హెలికాప్టర్‌ను మనం ప్రయోగించిన క్షిపణే కూల్చిందని ఎయిర్ చీఫ్ మార్షల్ రాకేశ్ కుమార్ భదౌరియా తెలిపారు. మన చాపర్‌ను మనం కూల్చివేయడం అతి పెద్ద తప్పిదమని ఆయన అన్నారు. ఇవాళ మీడియాతో మాట్లాడుతూ ఫిబ్రవరి 27వ తేదీన జరిగిన సంఘటన గురించి ఆయన కొన్ని విషయాలను వెల్లడించారు. ఆ రోజున జమ్మూ కశ్మీర్‌లోని బుద్గామ్‌లో ఎంఐ 17 హెలికాప్టర్ కూలిపోయింది. బాలాకోట్‌పై భారత వైమానిక దళాలు దాడికి వెళ్లిన మరుసటి రోజు ఈ ప్రమాదం జరిగింది. అయితే మనం వదిలిన మిస్సైళ్ల వల్లే ఆ హెలికాప్టర్ కూలినట్లు తేలింది. దీనిపై ఏర్పాటు చేసిన సైనిక కోర్టు విచారణ ముగిసిందని భదౌరియా తెలిపారు.

ఈ ఘటనకు కారణమైన ఇద్దరు ఆఫీసర్లపై చర్యలు తీసుకోనున్నట్లు ఆయన చెప్పారు. ఇలా జరగడం పెద్ద పొరపాటే అని, మరలా ఇలాంటి సంఘటన జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రమాదం పట్ల ఐఏఎఫ్ కొన్ని నెలల క్రితమే సైనిక విచారణ చేపట్టింది. అయితే కనీసం నలుగురు ఆఫీసర్ల పొరపాటు వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. ఆ హెలికాప్టర్ ప్రమాదంలో మొత్తం ఆరుగురు సైనికులు, ఓ పౌరుడు చనిపోయారు. హెలికాప్టర్‌లో ఉన్న ఐడెంటిఫికేషన్ ఆఫ్ ఫ్రెండ్ ఆర్ ఫో సిస్టమ్ స్విచాఫ్ చేసి ఉందని, దీంతో సమాచార సరఫరా నిలిచిపోయిందని, గ్రౌండ్ స్టాఫ్, సిబ్బంది మధ్య సంబంధాలు తెగిపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు కమిటీ గుర్తించింది.

# అమిత్ షాతో ముగిసిన సీఎం కేసీఆర్ భేటీ





న్యూఢిల్లీ, అక్టోబర్ 4: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సమావేశం అయ్యారు. ఈ సమావేశం పార్లమెంట్‌లోని నార్త్ బ్లాక్‌లో సుమారు 40 నిమిషాల పాటు కొనసాగింది. అమిత్ షాతో రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై సీఎం కేసీఆర్ చర్చించారు. మరికాసేపట్లో ప్రధాని నరేంద్ర మోదీతో సీఎం కేసీఆర్ సమావేశం కానున్నారు. గోదావరి-కృష్ణా నదుల అను సంధానంపై ఈ సమావేశంలో చర్చిస్తారు. రెండు జీవనదుల అనుసంధానం జరిగితే తెలంగాణ, ఏపీల్లోని బీడుభూములన్నింటికీ సాగునీరు అందించే అవకాశం ఉన్నందున.. అతి కీలకమైన ఈ ప్రాజెక్టుకు ఆర్థిక సహాయం అందించాలని సీఎం కేసీఆర్ ప్రధానిని కోరే అవకాశం ఉన్నది. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని సీఎం కేసీఆర్ స్వయంగా ప్రధానిని పలుమార్లు కోరినప్పటికీ ఇవ్వలేదు. తాజాగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కూడా ఉండటంతో ఈ రెండింటిలో ఒకదానికి జాతీ య హోదా ఇవ్వాలని కోరనున్నారు.

రాష్ట్రంలో హైవేల విస్తరణపై కూడా చర్చిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం రీజినల్ రింగ్‌రోడ్‌పై ఇప్పటికే డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించిన విషయం తెలిసిందే. కంటోన్మెంట్ ప్రాంతాల్లో రోడ్ల విస్తరణకు రక్షణశాఖకు చెందిన భూములను ఇవ్వాలని ప్రధానిని సీఎం కోరనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికి మంచినీటి కోసం మిషన్ భగీరథ పథకాన్ని తీసుకువచ్చిన తర్వాతే.. కేంద్రం ఘర్‌ఘర్ జల్ అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. కేంద్ర పథకానికి మిషన్ భగీరథను అనుసంధానంచేయాలని సీఎం ప్రధానిని కోరనున్నట్టు సమాచారం. వెనుకబడిన జిల్లాలకు ఆర్థిక సహాయం అందించే అంశంపైనా ప్రధానితో సీఎం మాట్లాడుతారని తెలిసింది.

# నెత్తురోడిన రహదార్లు : ఏడుగురు మృతి

జనగామ/వరంగల్, అక్టోబర్ 4: జనగామ, వరంగల్ రూరల్ జిల్లాల్లో రహదారులు నెత్తురోడాయి. ఈ రెండు జిల్లాల్లో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందారు. జనగామ జిల్లాలోని దేవరుప్పుల మండలం బంజార వద్ద రోడ్డుప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదస్థలికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వరంగల్ రూరల్ జిల్లా ఆత్మకూరు మండలం మహ్మద్‌గౌస్‌పల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పసికందు సహా నలుగురు మృతి చెందారు. అంబులెన్స్‌ను కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

# అద్దె బస్సులను నడుపుతాం : సోమేశ్ కుమార్

హైదరాబాద్, అక్టోబర్ 4: తెలంగాణ దసరా చాలా పెద్ద పండుగ. పండుగ వేళ ప్రజలు ఇబ్బంది పడకూడదనేది ప్రభుత్వ ఉద్దేశమని త్రిసభ్య కమిటీ సభ్యులు సోమేశ్ కుమార్ స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మిక సంఘాలతో ఇప్పటికే మూడు దఫాలుగా చర్చలు జరిపిన త్రిసభ్య కమిటీ ఇవాళ కూడా చర్చలు జరిపింది. చర్చలు ముగిసిన అనంతరం కమిటీ సభ్యులు మీడియాతో మాట్లాడారు.

ఆర్టీసీ కార్మిక సంఘాలతో సుదీర్ఘంగా చర్చించామని తెలిపారు. సమ్మె నివారణకు జరపాల్సిన చర్చలన్నీ జరిపాం. ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగితే అద్దె బస్సులు, ప్రైవేటు బస్సులతో పాటు అవసరమైతే స్కూల్ బస్సులను కూడా నడుపుతామని చెప్పారు. అవసరమైన రక్షణ ఏర్పాటు చేసి ప్రయివేటు బస్సులు నడిపిస్తామన్నారు.

ఆర్టీసీ కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మె చట్టవిరుద్ధమని ప్రభుత్వం భావిస్తోంది. చట్ట విరుద్ధంగా సమ్మెకు దిగితే చర్యలు తీసుకోవడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రభుత్వ ఆదేశాలు ధిక్కరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదేశాలు ధిక్కరించిన వారిని డిస్మిస్ చేసి కొత్త వారిని నియమిస్తామని స్పష్టం చేశారు.

తెలంగాణ ఏర్పడ్డాక ప్రభుత్వం నుంచి ఆర్టీసీకి రూ. 3,303 కోట్ల ఆర్థిక సాయం అందింది. మూడేళ్లుగా బడ్జెట్‌లో పెట్టిన దాని కంటే ఎక్కువ నిధులు ఆర్టీసీకి ఇచ్చాం. సమస్యలను లోతుగా పరిశీలించి పరిష్కరించేందుకు కమిటీ అధ్యయనం చేసింది. సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు తాము ప్రయత్నిస్తున్నాం. పండుగ వేళ ప్రజలను ఇబ్బంది పెట్టి సంస్థపై చెడు అభిప్రాయం కలిగేలా చేయొద్దు. ప్రజలను ఇబ్బంది పెట్టి ప్రభుత్వాన్ని సహాయం అడగడం సరికాదు. ఎక్కువ ఛార్జీలు వసూలు చేయొద్దని ప్రైవేటు వాహనాలకు కూడా చెప్పామని సభ్యులు తెలిపారు.

## లెక్చరర్స్ ఫోరం అధ్యక్షుడి ఇంట్లో ఏసిబి సోదాలు

హైదరాబాద్,అక్టోబర్4 (ఆర్‌ఎన్‌ఎ): తెలంగాణ లెక్చరర్స్ ఫోరం అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి ఇంట్లో ఏసీబీ అధికారులు సోదా లు చేపట్టారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు ఆరోపణలు రావడంతో ఈ దాడు లుచేపట్టారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని వైష్ణవి అపార్ట్ మెంట్స్‌లోని ప్లాట్ నెంబర్ 302లో మధుసూదన్ రెడ్డి నివాసముంటున్నారు. ఉదయం 6 గంటల నుంచి మధుసూదన్ సొంత నివాసంతో పాటు బంధువులు, స్నేహితుల నివాసాల్లో ఏకకాలంలో 11 చోట్ల అధికారులు సోదాలు చేస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణల కేసులో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు.

# పండుగ సమయంలో సమ్మెకు దిగితే ఎవరూ హర్షించరు!

హైదరాబాద్, అక్టోబర్ 4: ఆర్టీసీ కార్మిక జేఏసీ నేతలతో త్రిసభ్య కమిటీ సభ్యులు సోమేశ్ కుమార్, కె.రామకృష్ణారావు, సునీల్‌శర్మలు శుక్రవారం కూడా చర్చలు జరిపారు. అనంతరం కమిటీ సభ్యుడు రామకృష్ణారావు మాట్లాడుతూ.. 'ఉమ్మడి ఏపీలో ఆర్టీసీకి ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సాయం కేవలం రూ.1695కోట్లు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఆర్టీసీకి ప్రభుత్వం రూ.3303 కోట్లు ఇచ్చింది. జీతాలు, ఖర్చులు పెరిగాయి కాబట్టి, సంస్థను ఆర్థికంగా ఆదుకున్నాం. సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా కార్మికులు వినకపోవడం సరైంది కాదు. గత మూడేళ్ల నుంచి బడ్జెట్‌లో పేర్కొన్న దాని కంటే రెట్టింపు నిధులే ఇచ్చాం. 2016-17 బడ్జెట్‌లో ఆర్టీసికి కేటాయించింది రూ.23 7కోట్లు అయితే ఇచ్చింది రూ.53 6కోట్లు. 2015-16 బడ్జెట్‌లో ఆర్టీసీకి రూ.357 కోట్లు కేటాయిస్తే ప్రభుత్వం రూ.490కోట్లు ఇచ్చింది. 2014-15 బడ్జెట్‌లో ఆర్టీసికి రూ.347 కోట్లు కేటాయిస్తే రూ.599కోట్లు ఇవ్వడం జరిగింది. ఆర్టీసీ ఎంత అడిగినా ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. జేఏసీ ప్రతిపాదించిన 26 డిమాండ్లలో అన్నీ ఆర్థిక పరమైన డిమాండ్లే. పండుగ సమయంలో సమ్మెకు దిగితే ఎవరూ హర్షించరు. ప్రజలకు ఆర్టీసీ మీద దురభిప్రాయం ఏర్పడుతుంది. ఆర్టీసీ మీద ఏర్పడ్డ చెడు అభిప్రాయం ప్రభుత్వానికి మంచిది కాదు. సమ్మెకు వ్యతిరేకంగా ఉన్నవారిని నిరభ్యంతరంగా విధుల్లోకి తీసుకుంటామని' ఆయన పేర్కొన్నారు.

## మంత్రి సింగిరెడ్డికి కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు

హైదరాబాద్, అక్టోబర్ 4 : రాష్ట్ర వ్యవ సాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డికి మంత్రి కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపా రు. ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలి.. మరింత కాలం ప్రజాసేవలో ఉండాలని కోరుకుంటున్నట్లు కేటీఆర్ ట్వీట్ చేశారు. ఇక మంత్రి నిరంజన్ రెడ్డికి పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, టీఆర్ఎస్ కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు

## చరిత్రలో నేటినిజం



కం॥ కన్నాంబ గారి నటనము
కన్నుల పండుగ గనుండు గాంచిన వాడున
యిన్నగ నెన్నుచు... కీర్తిని
కన్నయ్యనెయె... సతతము స్మరింతు కన్నాంబపయిన!



( అక్టోబర్ 5 కన్నాంబ జననం..)

-రాధశ్రీ
సెల్: 9494481210

# టిక్‌టాక్ ఫాలోవర్సంతా నాకే మద్దతు : సోనాలి

హైదరాబాద్ , అక్టోబర్ 4: హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో టిక్‌టాక్ స్టార్, భారతీయ జనతా పార్టీ నాయకురాలు సోనాలి ఫోగట్ పోటీ చేస్తున్నారు. అదంపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న సోనాలికి టిక్‌టాక్ ఫాలోవర్స్ మద్దతు తెలుపుతున్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టిక్‌టాక్‌లో తనను ఫాలో అయ్యే వారందరూ తనకు మద్దతు తెలుపుతున్నారని చెప్పారు. తన నామినేషన్ కోసం వారంతా ఎదురు చూస్తున్నారని తెలిపారు. బీజేపీ తనకెంతో మనో ధైర్యాన్ని ఇస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో తప్పకుండా తాను గెలుస్తానని సోనాలి ధీమా వ్యక్తం చేశారు. అదంపూర్ స్థానం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉంది. హర్యానా మాజీ సీఎం భజన్ లాల్ 2000, 2005 ఎన్నికల్లో రెండుసార్లు ఈ స్థానం నుంచి గెలుపొందారు.సోనాలీ సింగ్ టీవీ నటి కూడా. హర్యాన్వీ షోలో దూరదర్శన్ లో ప్రసారమయ్యే కార్యక్రమానికి యాంకర్ గా కెరీర్ ప్రారంభించింది. జీ టీవీలో పాపులర్ సీరియల్ అమ్మతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. సోనాలికి ఏడేళ్ల కూతురుంది.

## రెపో రేటు తగ్గించిన ఆర్బీఐ

హైదరాబాద్, అక్టోబర్ 4: వడ్డీ రేట్లను వరుసగా అయిదోసారి తగ్గించింది ఆర్బీఐ. ఆర్థిక వృద్ధిని పరుగులు పెట్టించేందుకు ఆర్బీఐ ఈ చర్యలను ప్రకటించింది. 25 బేసిన్ పాయింట్లతో రెపో రేటును తగ్గించినట్లు ఇవాళ ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ తెలిపారు. 5.40 శాతం ఉన్న రెపో రేటును 5.15 శాతానికి తగ్గించింది. దీంతో జాతీయ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ఆర్బీఐ భావిస్తున్నది. ఆర్థిక వృద్ధిని సాధించేందుకు వీలైనన్ని రోజులు ఇదే స్థితిని కొనసాగించనున్నట్లు ఆర్బీఐ చెప్పింది. ఆరుగురు సభ్యుల ద్రవ్య విధాన కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నది. రివర్స్ రెపో రేటును కూడా 4.9 శాతానికి తగ్గించారు.


రంజని,
తెలుగు సాహితి సమితి, ఏ.జి ఆఫీస్ , సైఫాబాద్ 500004



### నేటినిజం దినపత్రిక -రంజని
### విశ్వనాథ పద్య కవితా పోటీలు 2019

మఱల నిదేల రామాయణం బన్నచో నీ ప్రపంచక మెల్ల నెల్ల వేళ
దినుచున్న యన్నమే తినుచున్న దిన్నాళ్ళుతనరుచి బ్రదుకులు తనవిగాన
చేసిన సంసారమే సేయుచున్నది తనదైన యనుభూతి తనదిగాన
తలచిన రామునే తలఁచెద నేనును నా భక్తిరచనలు నావిగాన...

అన్న "మాటలాడే వెన్నెముక, పాటపాడే సుషుమ్న, నిన్నటి నన్నయ్యభట్టు, ఈనాటి కవిసామ్రాట్టు, ప్రథమ జ్ఞానపీఠ అవార్డు గ్రహీత శ్రీ విశ్వనాథ సత్యనారాయణ". ఆయన పట్టి సాధించని సాహిత్య ప్రక్రియ లేదు, మెట్టి చూడని సారస్వతమూ లేదు. "సంస్కృతంలో ఇప్పుడు వ్రాస్తే ప్రాచీన కవుల పరంపరలో ఏ వెయ్యిన్నొక్కటో వాణ్ణి అవుతాను. తెలుగులోనంటారా పన్నెండుగురు ప్రాచీన మహాకవుల తర్వాత పదమూడో వాణ్ణి నేను " అని స్వయంగా ప్రకటించుకున్నట్లే శిల్ప వైలక్ష్యంలో, భావన సౌకుమార్యంలో, దేశిచ్ఛందో విశేషంలో, కల్పనా సాహిత్యంలో విశ్వనాథ వారి తరువాతే ఎవరైనా.

'గిరి కుమారుని ప్రణయ గీతాలు' ఆయన తొలి కవిత. ఆ తరువాత ఆంధ్ర ప్రశస్తి , ఋతుసంహారం, రామాయణ కల్పవృక్షం వంటి కావ్యాలు రాసారు. కిన్నెరసాని పాటలు, కోకిలమ్మ పెళ్లి, టానిసల దీవి, ఉయ్యాలతాళ్లు వంటి గేయ కావ్యాలు, ఏకవీర, వేయిపడగలు, చెలియలికట్ట, బద్దన్నసేనాని, సముద్రపుదిబ్బ, మ్రోయుతుమ్మెద వంటి నవలలు, నర్తనశాల, సౌప్తిక ప్రళయం, అనార్కలి, వేనరాజు, త్రిశూలం, కళింగరాజ్యం వంటి నాటకాలు, శర్మిష్ఠ వంటి సంస్కృత నాటకాలు, ఎన్నో కథలు, పురాణవైర గ్రంథమాల పేరుతో ఎన్నో నవలలు...మొత్తం లక్ష పుటలకు పైగా సాహిత్యం అందించిన విశ్వనాథ సత్యనారాయణ గారు ' రంజని' ని ఎన్నో పర్యాయాలు సందర్శించారు. అకౌంటెంట్ జనరల్ గా పదవి విరమణ చేసి అమెరికాలో ఉంటున్న శ్రీ ఏ. సత్యవర్ధన, IA & AS గారి సౌజన్యంతో రంజని తొలి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత శ్రీ విశ్వనాథ సత్యనారాయణ పేరు మీద 2008 నుంచి ' **రంజని- విశ్వనాథ పద్య కవితా పోటీలు**' నిర్వహిస్తోంది.

బహుమతులు : ప్రథమ బహుమతి రూ. 2,000/- , ద్వితీయ బహుమతి రూ. 1,500 /- మూడు తృతీయ బహుమతులు (500/-) మొత్తం 5,000/- (యోగ్యతాపత్రాలతో సహా)

నిబంధనలు: ఏ ఛందస్సు లోనైనా ఒక అంశం మీదే 12 పద్యాలకు తక్కువ కాకుండా ఉండాలి. సామాజికత తప్పనిసరి. ఇంతవరకు ప్రచురణ, ప్రసారంకానివి, దేనికి అనువాదం, అనుక(స)రణ కాని పద్య కవితల్ని మాత్రమే పంపాలి. ఇందుకు సంబంధించిన హామీ పత్రాన్ని విడిగా జతపరచాలి. ఒకరు ఎన్ని పద్యకవితాలైనా పంపవచ్చు. పద్యకవితాల్ని కాగితంపై ఒక వైపే రాయాలి. పద్య కవితలు పంపే కవరు పై ' రంజని- పద్యకవితా పోటీలు- 2019' అని పేర్కొవాలి. పద్యకవిత ఉన్న కాగితం పై పేరు, విలాసం తదితర వివరాలు వ్రాయకూడదు. పూర్తిపేరు, చిరునామా వివరాలు హామీ పత్రంలో మాత్రమే పేర్కొనాలి. విజేతలకు ఫలితాలను నేరుగాను, పత్రిక ముఖంగాను తెలియచేస్తాం. ఎంపికైన పద్యకవితలను ప్రచురించే హక్కు రంజనిదే. న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయం.

చిరునామా: ప్రధాన కార్యదర్శి, రంజని, తెలుగు సాహితి సమితి, ఏ.జి ఆఫీస్ , సైఫాబాద్, హైదరాబాద్— 500004.

చివరితేదీ: 31 అక్టోబర్ 2019

నందిరాజు పద్మలత జయరాం
అధ్యక్షులు
9492921383

మట్టిగుంట వెంకట రమణ
ప్రధాన కార్యదర్శి
83748

# నీటికై ఎదురుచూపులు ఎంతకాలం..?

నేటి నిజం
శనివారం 5-10-2019

నీరు లేనిదే ప్రాణికోటి లేదు. అసలు జీవన విధానమే లేదు. భారత్‌తో సహా ప్రపంచ దేశాలు నేడు ఎదుర్కొంటున్నది నీటి కరువును కాదు నీటి నిర్వహణ రంగంలో సంక్షోభ స్థితిని అనే వాస్తవాన్ని పెడచెవిన పెట్టిన పాలకుల పాపం కోట్లాది అభాగ్యుల బతుకుకు పెను విషాదంలా మార్చుతున్నాయి. విలువయిన నీటిని భద్రపరుచుకోవడం చేతకాని మూడోవంతు పట్టణాల్లో నీటికరువు మొదలవుతోందని భారత్‌లోని దక్షిణ. పశ్చిమ ప్రాంతాలు తాగునీటికి అలమటించి పోతున్నాయని పుష్కర కాలం క్రితమే ప్రపంచ బ్యాంకు ప్రమాద సూచనలు మోగించింది. జీవాలను రక్షించేది జలం.. అయితే జలాన్ని కాపాడేది మనం అని ఉపన్యాసం ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం చెప్పినంతగా చేయలేకపోతోంది. భారతావనిలో భూగర్భజల ఘట్టాలతో పాటు, తలసరి నీటి లభ్యతా ఏ ఏడాదికాఏడాది కుంగిపోతోంది. ఇలా పదేళ్ళ అనుభవాల్ని పరిశీలిస్తే జలవిధానమే నీరుగారి, నీటి కష్టాలు ఇంతింతలయిన వ్యధార్థ దృశ్యం గుండెల్ని మెలిపెడుతోంది. ఎప్పటికప్పుడు కొత్త జల విధానాన్ని పట్టాలెక్కిస్తామని సంకల్పం చెప్పుకుంటున్న ఎన్‌డీఏ సర్కారు నీటి సరఫరా సేవల్ని ప్రైవేటీకరించి సబ్సిడీలను తెగ్గోసి చార్జీల కొరడా చేత కొట్టి చెలరేగిపోవాలని ప్రతి పాదిస్తోంది. చుక్క చుక్కకూ, గుక్క గుక్కకూ లెక్కగట్టి ఏకమొత్తంగా ఒక్క పెట్టున చార్జీల షాకులివ్వకమేనా ప్రభుత్వం చేయాల్సింది? కాస్తంత కాదు ఈ విషయంలో ఎక్కువే ఆలోచించాలి.. అయితే...ప్రజలకు మంచినీరు కూడా అందించలేని పక్షంలో అధికారంలో కొనసాగే హక్కు ప్రభుత్వానికి లేదని 2009లో సుప్రీంకోర్టు నిప్పులు చెరిగింది. దేశంలో అయిదేళ్ళలోపు పిల్లల్లో ఏటా 15 లక్షల మంది కలుషిత నీరు తాగి మృత్యువాత పడుతున్నట్లు పలు అధ్యయనాలు చాటుతున్నాయి. అతివృష్టి, అనావృష్టి తాకిడికి పొలాల్లో కాదు, రైతు గుండెల్లో సంక్షోభాగ్నులు ఎగసిపడుతున్నాయి. రాజ్యాంగం పదకొండో షెడ్యూలు ప్రకారం స్థానిక సంస్థల మౌలిక విధుల్లో మంచినీటి సరఫరా ఒకటని నీటిపొదుపు దిశగా నిర్దిష్ట ప్రణాళికలు అమలు కాకుంటే మహాసంక్షోభం తథ్యమనీ, జలవనరుల నియంత్రణ బాధ్యతను జిల్లాస్థాయి యంత్రాంగాలకు బదలాయించాలని సూచించారు. నీటి చార్జీలు బాగా పెరిగి అమూల్యమయిన జలవనరుల దుర్వినియోగానికి పగ్గాలు పడతాయని విధానపత్రం చాటుతోంది. వ్యవసాయానికి గృహవినియోగానికి ఇచ్చే అన్నిరకాల సబ్సిడీలను ఎత్తివేయాలట. నీటిని పునశుద్ధి చేసే ప్రైవేటు పరిశ్రమలకు మాత్రం రాయతీలు, ప్రోత్సహకాలు అందించాలట! అట్టడుగు వర్గాల జీవన స్థితిగతుల మధ్య కనీస అవగాహన కూడా లేనట్లు వండివార్చిన ఈ ప్రతిపాదనలు అసంబద్ధమే కాదు అవమానం, అమానుషం కూడా.. సగటు జీవి నీటి అగచాట్లను ఇలాంటి నివేదికలు ఎంతగా అద్దం పడుతున్నా పాలకుల అసమ్మర్థ నిర్వాకాలకు జనాన్ని మూల్యం చెల్లించాలనుకోవడం ద్వారా రగులుతున్న గాయంపై గునపపు పోట్లలా మరనుంది అనడంలో అతిశయోక్తిలేదు. రానురాను జీవనాధారం నీటికి బదులు కన్నీరుగా మారుతున్నా ఈ సమయంలోనైనా ప్రభుత్వంతో పాటు జనం కూడా నీటిని కాపాడటంలో అప్రమత్తం కావాలి..!

## హుజూర్‌నగర్ ఉప ఎన్నిక బరిలో 28 మంది అభ్యర్థులు

### 45 నామినేషన్లను తిరస్కరించిన రిటర్నింగ్ అధికారి నామినేషన్లు ఉపసంహరించుకున్న ముగ్గురు

సూర్యాపేట,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): హుజూర్‌నగర్ ఉప ఎన్నిక బరిలో 28 మంది అభ్యర్థులు నిలిచారు. మొత్తం 76 నామినేషన్లు దాఖలు కాగా, వీటిలో 45 నామినేషన్లను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. మరో ముగ్గురు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. గురువారం ఉపసంహరణకు చివరి రోజు కావడంతో పలువురు నామినేషన్లు వెనక్కి తీసుకున్నారు. కంచుకోట లాంటి చోట కమ్యూనిస్టులు ఉనికిలో లేకుండా పోయారు. ఉప ఎన్నికల్లో సీపీఐ ఇప్పటికే టీఆర్ఎస్ కు మద్దతు ప్రకటించింది. సీపీఎం అభ్యర్థి శేఖర్ రావు నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. దీంతో బై పోల్ లో కామ్రేడ్లు పోటీకి దూరమయ్యారు. ఇది జిల్లాలో రాజకీయంగా పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది. ఇకపోతే ఉప ఎన్నికలో టీడీపీ.. సీపీఎం మద్దతు కోరింది. తమకు మద్దతు ఇవ్వాలంటూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో టీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ ఫోన్ లో మాట్లాడారు. అయితే పార్టీలో చర్చించి నిర్ణయం చెబుతామని తమ్మినేని వీరభద్రం చెప్పారు. కాగా సీపీఎం అభ్యర్థి నామినేషన్ తిరస్కరణపై తమ్మినేని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. మరోవైపు ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని టీజేఎస్ నిర్ణయం తీసుకుంది. అయితే కాంగ్రెస్ కు బయటి నుంచి మద్దతిస్తామని, వారితో కలిసి ప్రచారం చేయబోమని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం స్పష్టం చేశారు. టీఆర్ఎస్ పాలనకు చరమ గీతం పాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడతామన్నారు. టీఆర్ఎస్ కు సీపీఐ మద్దతు ఇవ్వడం చారిత్రక తప్పిదమని విమర్శించారు. అక్టోబర్ 21న హుజూర్ నగర్ ఉప ఎన్నికలు జరుగనున్నాయి. 24వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. రాజకీయ పార్టీలు ఎవరికివారే గెలుస్తామనే ధీమాలో ఉన్నారు. దీంతో ఉప ఎన్నికపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## కేంద్రం నిధులిస్తున్నా అబద్ధాలా?

నిజామాబాద్,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం నిధులు విడుదల చేస్తే ఆ నిధులు తమవేనని సీఎం కేసీఆర్ చెప్పుకోవడం సిగ్గుచేటని బిజెపి నేత పల్లె గంగారెడ్డి అన్నారు. అలాగే కేంద్రం నిధులు విడుదుల చేస్తున్నా కావాలనే ఇవ్వడంలేదని దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ కేసీఆర్ కిట్టుకు రూ.6వేలు కేంద్రమే ఇస్తోందని, గొర్రెల పెంపకానికి 50శాతం నిధులు కేంద్ర ఇస్తోందని అన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.12వేలు కూడా కేంద్రం ఇస్తోందని అన్నారు. ప్రజలను పాస్టిక్ వాడకుండా చైతన్యం చేస్తామన్నారు.

## ఉమ్మడి జిల్లాలో జోరుగా ప్రణాళికా పనులు

### స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇస్తున్న అధికారులు

ఆదిలాబాద్,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గ్రామ ప్రణాళిక మేరకు గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పరిశుభ్రతకుసహకరించాలని సర్పంచులు గ్రామాల్లో ప్రజలను కోరుతున్నారు. గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటారు. పిచ్చి మొక్కలను, చెత్తా చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ప్రజలు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ సూచించారు.పలు కాలనీల్లో ప్రణాళిక పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పారతో పిచ్చిమొక్కలను తొలగించారు. ఉట్నూర్ ప్రభుత్వ దవాఖానను అప్‌గ్రేడ్ చేయనున్నామని, ఐసీయూ, రక్తనిధి కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మెరుగైన సేవలను అందించాలని దవాఖాన సూపరింటెండెంట్ దీపక్ పుష్కర్‌ను ఆదేశించారు. ప్లాస్టిక్ నిషేధాజ్ఞలను గాంధీ జయంతి నుంచి పకడ్బందీగా అమలు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ ప్రశాంతి సూచించారు. 30 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కలెక్టర్ పర్యటించారు. వాడవాడలా తిరుగుతూ అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల వివరాలనుఅడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని అభివృద్ధి చేయాలని సర్పంచ్‌లకు సూచించారు.

# ఎన్‌ఆర్‌సి అంటే ఉలికి పాటెందుకు?

హైదరాబాద్, అక్టోబర్ 4:ఇప్పుడు దేశం యావత్తా అసోం నమూనా అమలుకు రంగం సిద్ధం కానుందా ? అంటే కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాటలను బట్టి ఔననే అనాల్సి ఉంటుంది. దేశ వ్యాప్తంగా త్వరలోనే జాతీయ పౌరసత్వ నమోదు(ఎన్నార్సీ)ను చేపడతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. చొరబాటు దారులను ఎట్టి పరిస్థితుల్లో దేశంలో ఉండనివ్వమని.. శరణార్థులకు పౌరసత్వం కల్పిస్తామని షా తెలిపారు. అంటే అక్రమ వలసదారునలు తరిమి కొడతామని అమిత్ షా ముక్కుసూటిగానే చెప్పారు. ఎందుకనో ఆయన ఈ ప్రకటన చేయగానే మమతాబెనర్జీ, సీతారం ఏచూరీ లాంటి వారు అంతెత్తు లేచారు. ఇదేదో దేశ వ్యతిరేక విధాన మన్న రీతిలో మాట్లాడారు. ఓటు బ్యాక్ రాజకీయాలకు అలవాటు పడ్డ ప్రాంతీయ పార్టీలు, లెఫ్ట్ పార్టీలు దేశహితం కోరే అనేక విషయాల్లో చర్చకు ముందుకు రావడంలేదు. సరికదా ఎదురుదాడితో అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ట్రిపుల్ తలాక్, 370 రద్దు విషయంలో కూడా ఇలాంటి ప్రయత్నాలే చేశారు.

మొన్నటికి మొన్న హిందీపై వివాదం లేపారు. జాతీయభాషగా వృద్ధి చెందు తున్న క్రమంలో హిందీని అంతా నేర్చుకోవాలని అమిత్ షా ప్రకటించగానే ఎప్పటిలాగే హిందీపై పెను వివాదం రేగింది. దేశానికి ఉమ్మడి భాషగా హిందీ ఉండాలని, అప్పుడే మహాత్మా గాంధీ, సర్దార్ పటేల్ కన్న కలలు నెరవేరతాయని చెప్పడం ఈ వివాదానికి మూలం. అయితే హిందీని ద్వితీయ భాషగానైనా నేర్చుకోవాలన్నదే తన ఉద్దేశమని షా వివరణ ఇచ్చారు. మన దేశానికి జాతీయ భాష లేదు. కేంద్ర స్థాయిలో అధికార భాషగా హిందీ, ఇంగ్లిష్ ఉన్నాయి. రాష్ట్రాల్లో అక్కడి ప్రాంతీయ భాషలు అధికార భాషలుగా ఉంటున్నాయి. మనది కాని ఇంగ్లిష్ భాషను నేర్చుకుంటున్నప్పుడు హిందీని నేర్చుకోమనగానే కొందరు రాజకీయ వేత్తలు రెచ్చగొట్టే చర్యలకు దిగారు. ఇలా ఇప్పుడు ఎన్ఆర్సి విషయంలో కూడా మమతబెనర్జీ లాంటి వారు రాజకీయం చేస్తున్నారు. ఇది అవసరమా అన్నది ఆలోచనచేయాలని రెచ్చగొట్టే రాజకీయాలు కాకుండా దేశహితాన్ని సంకల్పించాలి. 1960 ప్రాంతంలో హిందీ భాషను తీవ్రంగా వ్యతిరేకిస్తూ దక్షిణాది రాష్ట్రాల్లో మరీ ముఖ్యంగా తమిళనాడులో పెద్దయెత్తున ఆందోళనలు పెల్లుబికాయి. ఆ తర్వాత 1963లో అధికార భాషల చట్టం వచ్చింది. అధికార లావాదేవీలన్నిటా హిందీతో పాటు ఇంగ్లిష్‌ను కూడా వినియోగించడం తప్పనిసరి చేస్తూ ఆ చట్టం తీసుకొచ్చారు. తెలుగు, కన్నడం, తమిళం, మలయాళం, ఒడియా, గుజరాతీ, పంజాబీ, బెంగాలీ వంటి 22 భాషల్ని ఆయా ప్రాంతాల్లో అధికార భాషలుగా రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్ గుర్తించింది. అయితే హిందీ నేర్చుకుంటే దేశ రాజకీయాల్లో గానీ ఇతరత్రా కమ్యూని కేషన్‌కు మంచి పట్టు ఉంటుందన్న ధ్యాన రాజకయినేతల్లో కానరావడం లేదు. ఇప్పుడు ఎన్నార్‌సి విషయంలోనూ వ్యతిరేకించడం వల్ల దేశానికి నష్టమే తప్పలాభం ఉండబోదు. ఓటు బ్యాంక్ రాజకీయాలకు అలవాటు పడ్డ పార్టీలో దేశహితం కోరే పనులకు అడ్డుపడుతున్నారు. టీఎంసీ లాంటి పార్టీలు ఓటు బ్యాంక్‌ను పెంచుకోవడానికే చొరబాటుదారులకు మమత మద్ధతుగా నిలుస్తుందని షా ఆరోపించారు. దేశ విభజన సమయంలో బెంగాల్ మొత్తం పాకిస్తాన్‌తో కలవాలని చూస్తే.. శ్యామ ప్రసాద్ ముఖర్జీ పోరాడి పశ్చిమ బెంగాల్ భారత్ లోనే ఉండేలా చేశారని తెలిపారు. ఆర్టికల్ 370ని రద్దు చేయడం ద్వారా కశ్మీర్‌ను భారత్‌లో అంతర్భాగం చేశామని.. తద్వారా శ్యామ ప్రసాద్ ముఖర్జీకి ప్రధాని నరేంద్ర మోదీ నివాళులర్పించారని చెప్పారు. చొరబాటుదారులు వామపక్షాలకు ఓటు వేసిన సమయంలో మమత వారిని వ్యతిరేకించారని.. ఇప్పుడు వారు టీఎంసీకి మద్దతు తెలుపడంతో ఆమె వారికి వ్యతిరేకంగా మాట్లాడటం లేదని మండిపడ్డారు. అలాగే పశ్చిమ బెంగాల్‌లో ఎన్నార్సీ అమలు కాకుండా చూస్తామని మమత చేసిన వ్యాఖ్యలపై స్పందించిన షా..

బెంగాల్‌లో ఒక్క చొరబాటు దారున్ని కూడా ఉండకుండా చూస్తామని ప్రకటించారు. నిజానికి బెంగాల్లో బంగ్లా నుంచి చొరబాటుదారులు విపరీతంగా చేరారు. అక్కడ స్థానికంగా ఉంటున్నప్రజలపై వీరు పెత్తనం చేస్తున్నారు. అసోంలో కేంద్రం భారీ స్థాయిలో ప్రభుత్వ సిబ్బందిని వినియోగించి ఎన్ఆర్‌సి జాబితా రూపొందించింది. సరిహద్దు రాష్ట్రమైన అసోంలో ఎన్ఆర్‌సిని తయారు చేయడానికి చారిత్రిక కారణాల రీత్యా కొంత ప్రాతిపదికైనా ఉంది. మిగిలిన దేశమంతటికి దీనిని విధించడం వల్ల తిష్టవేసిన వారిని గుర్తించడం సులువు కాగలదు. ప్రస్తుత హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన దేశ వ్యాప్తంగా రాజీయపార్టీల్లో అభద్రతా భావాన్ని సృష్టించిందనే చెప్పాలి. మొత్తంగా ఏ కార్యక్రమం తీసుకున్నా వ్యతిరేకించడమే పనిగా విపక్షాలుపెట్టుకున్నాయి. అలా కాకుండా ఏదైనా ప్రకటన వస్తే దానిలో మంచి చెడులను చర్చించాలి. అప్పుడే దేశానికి ప్రజలకు మేలు కలుగుతుంది. ఈ దశలో రాజకీయాలు సాగాలి. కానీ అలా కాకుండా ఆదిలోనే విమర్శలతో తమ రాజకీయాలను ప్రదర్శించడం విపక్షాలకు తగదు. దేశంలో ఇప్పటికీ సర్వదరిద్రాలు ఉన్నాయి. వాటిని అంతమొందించే క్రమంలో మంచి సూచనలు చేయాలి. అప్పుడే రాజకీయ పార్టీలకు ప్రజల్లో మంచి పేరు వస్తుంది.

## కాశ్మీర్ పర్యాటకానికి మంచి రోజులు

### వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలు ప్రారంభోత్సవంలో అమిత్ షా

న్యూఢిల్లీ,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): పర్యాటకంగా కాశ్మీర్ మరింత అభివృద్ధి చెందగలదని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. గురువారం వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలును ప్రారంభించారు. కేంద్రమంత్రులు పీయూష్ గోయల్, హర్షవర్దన్ తదితరులతో కలిసి దిల్లీ రైల్వే స్టేషన్ నుంచి ఈ రైలుకు జెండా ఊపారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్ ప్రజలకు ఈ రైలు పెద్ద బహుమతి అన్నారు.

ఆధ్యాత్మిక పర్యాటకానికి ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఆర్టికల్ 370 జమ్మూకశ్మీర్ అభివృద్ధికి పెద్ద అడ్డంకి అని చెప్పారు. రాబోయే పదేళ్లలో జమ్మూకశ్మీర్‌ను అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. అనంతరం రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. 2022 ఆగస్టు 15 నాటికి కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రైల్వేలను అనుసంధానం చేస్తామన్నారు. కాట్రాలోని వైష్ణోదేవి ఆలయానికి వెళ్లే భక్తులకు ఈ రైలు ఎంతో ఉపయోగపడనుంది. అక్టోబర్ 5 నుంచి ఈ రైలు కమర్షియల్ సేవల్ని కొనసాగించనుంది. ఈ రైలులో ప్రయాణించేందుకు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో టికెట్లను అందుబాటులో ఉంచారు.

ఇది దసరా కానుక: మోదీ

వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవంపై ప్రధాని నరేంద్ర మోదీ ట్విటర్‌లో స్పందించారు. వైష్ణోదేవి భక్తులైన సోదర సోదరీ మణులకు ఈ రైలు దసరా కానుకగా అభివర్ణించారు. ఇది ఆధ్యాత్మిక పర్యాటకానికి మరింత దోహదపడుతుందని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అందరికీ అభినందనలు తెలిపారు.

ఇప్పటికే దిల్లీ నుంచి వారణాసికి ఒక వందే భారత్ రైలు సేవలందిస్తోంది. ఈ రోజు ప్రారంభించిన రైలు రెండోది కావడం విశేషం. 22439 నంబర్ కల్గిన దిల్లీ – కాట్రా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 6గంటలకు దిల్లీలో బయల్దేరనుంది. మధ్యాహ్నం 2గంటల సమయానికి కాట్రా చేరుకుంటుంది. మంగళవారం మినహాయిస్తే ప్రతి రోజూ ఈ రైలు సేవలందించనుంది. అంబాలా, లుధియానా, జమ్మూతవి స్టేషన్లలో రెండు నిమిషాల చొప్పున ఆగనుంది. తిరుగు ప్రయాణంలో 22440 నంబర్ కల్గిన వందే భారత్ రైలు కాట్రా స్టేషన్ నుంచి మధ్యాహ్నం 3గంటలకు బయల్దేరి రాత్రి 11గంటలకు దిల్లీకి చేరుకోనుంది. ఈ రైలు టికెట్ కనీస ధర రూ.1630లు కాగా.. గరిష్ఠ ధర రూ.3015లుగా నిర్ణయించారు.




కాశ్మీర్‌లోని వైష్ణోదేవీకి ఢిల్లీ నుంచి ప్రత్యేక రైలు వందే భారత్‌ను జెండా ఊపి ప్రారంభించిన కేంద్రహోంమంత్రి అమిత్ షా, రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్.

## రివర్స్‌గేర్‌లో ఏపి పాలన

### జగన్ తీరుపై మండిపడ్డ నారాయణ

హైదరాబాద్,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): రివర్స్ గేర్‌లో ఆంధ్రప్రదేశ్‌ను జగన్ పాలిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రీ టెండరింగ్‌లో కాంట్రాక్టులు తీసుకున్నవారికి మరో మార్గంలో లబ్ది చేకూర్చకూడదని అన్నారు. కేందప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 10వ తేదీ నుంచి దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు నారాయణ తెలిపారు. తాను అవినీతికి మద్దతివ్వడంలేదని, అవినీతి ఎక్కడున్నా యుద్ధం చేయాల్సిందేనని అన్నారు. ఉన్న ప్రాజెక్టులకు రీ టెండరింగ్ పెట్టి.. డబ్బు ఆదా చేస్తున్నామని ఏపీ ప్రభుత్వం చెబుతోందని.. అయితే డబ్బు ఆదా చేయడం మంచిదేనని అన్నారు. కానీ రీ టెండరింగ్ కాంట్రాక్ట్ తీసుకున్నవారికి భవిష్యత్తులో ఏ పద్ధతుల్లో గానీ ప్రభుత్వం మళ్లీ కాంట్రాక్టు ఇవ్వకుండా ఆపుతుందా? అని నారాయణ ప్రశ్నించారు. దీనికి సంబంధించి జగన్ ప్రభుత్వం హామీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

## చిదంబరం కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): మాజీ కేంద్ర మంత్రి చిదంబరం ఈనెల 17వ తేదీ వరకు జుడిషియల్ కస్టడీలోనే ఉండనున్నారు. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో ఆయన కస్టడీని పొడిగిస్తూ ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తొలుత ఇచ్చిన 14 రోజుల రిమాండ్ గడువు ముగియడంతో.. సీబీఐ గురువారం చిదంబరాన్ని కోర్టు ముందు ప్రవేశపెట్టింది. అడిషనల్ సెషన్స్ జడ్జ్ ఏకే కుహర్ ఈ కేసులో అరెస్టు గడువును పొడిగిస్తూ ఆదేశాలు ఇచ్చారు. అయితే ప్రస్తుతం తీహార్ జైలులో ఉంటున్న చిదంబరానికి కోర్టు కొంత ఊరట కల్పించింది. ఇంటి నుంచి తెచ్చిన భోజనాన్ని తినేందుకు ఆయనకు అనుమతి ఇచ్చింది. వైద్య సదుపాయం కోసం బయట ఆస్పత్రులకు వెళ్లేందుకు కూడా కోర్టు అంగీకరించింది. బెయిల్ ఇవ్వాలంటూ ఉదయం చిదంబరం సుప్రీంను ఆశ్రయించారు. చిదంబరం తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

## మాసాబ్ ట్యాంక్ నుంచి తలసాని కార్యకలాపాలు

### పశుసంవర్థక శాఖ కార్యాలయంలో ఛాంబర్

హైదరాబాద్,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇకనుంచి నగరంలోని మాసబ్‌ట్యాంక్ కార్యాలయం నుంచి తన కార్యకలాపాలను కొనసాగించనున్నారు. సచివాలయ తరలింపులో బాగంగా ఆయన మాసాబ్ ట్యాంక్ పవు సంవర్థక శాఖ కార్యలయం నుంచి విధులు నిర్వర్తించనున్నారు. ఇక్కడ ఆయన గురువారం పలు ప్రభుత్వ కార్యాలయాలను ప్రారంభించారు. పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పశుసంవర్థక, మత్స్య, పాడి పరిశ్రమ, సినిమాటోగ్రఫీ శాఖల కార్యాలయాలను ప్రారంభించారు. మంత్రి ఇకనుంచి అధికారిక కార్యకలాపాలు ఇక్కడినుంచే నిర్వహించనున్నారు. ఇదిలావుంటే గ్రేటర్ హైదరాబాద్‌లో సమస్యల పరిష్కారానికి మాస్టర్ ఎ÷–లాన్ సిద్ధం చేస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మాస్టర్‌ప్లాన్‌లో డ్రైనేజీల పునరుద్ధరణ, ఆక్రమణల తొలగింపు, రోడ్ల విస్తరణ తదితర పనులు ఉన్నాయన్నారు. చనిపోయిన గొర్రెలకు దీపావళి లోపు ఇన్సూరెన్స్ పథకం అమలు చేయనున్నట్లు మంత్రి తలసాని స్పష్టం చేశారు.

## హుజూర్‌నగర్‌లో గెలుపు మాదే: మంత్రి సత్యవతి

హైదరాబాద్,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): హుజూర్‌నగర్ ఉప ఎన్నకల్లో మహిళలు టీఆర్ఎస్ వైపే ఉండి భారీ మెజారిటీతో గెలిపించబోతున్నారని మంత్రి సత్యవతి రాథోడ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. ఉప ఎన్నికలో టిఆర్ఎస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్దమయ్యారని అన్నారు. గురువారం నాడిక్కడ మాట్లాడుతూ అంగన్‌వాడీలను గత ప్రభుత్వం గుర్రాలతో తొక్కిస్తే... తమ ప్రభుత్వం గుండెల్లో పెట్టుకుని చూసుకుంటోందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లలో అంగన్‌వాడీలకు ప్రభుత్వం మరిన్ని ప్రయోజనాలను చేకూర్చబోతుందన్నారు. ఈ క్రమంలో అంగన్‌వాడీలు కూడా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని కోరారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు వెసులుబాటు కల్పిస్తూ వారి వేతనాలను ప్రభుత్వం ముందే విడుదల చేసింది. దసరా నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లే? ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. అంగన్‌వాడీ ఉద్యోగుల వేతనాల నిమిత్తం రూ. 83 కోట్లను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ 'అంగన్‌వాడీలకు ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. మాది మహిళా సమస్యలు పరిష్కరించే ప్రభుత్వం అని అన్నారు.

# ఉమ్మడిగా ఏపితో కలిసి ప్రాజెక్టులు ఎలా కడతారు?

**గోదావరిని కృష్ణాకు ఎలా తరలిస్తారు**

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ సూటి ప్రశ్న**

**బిజెపిలో చేరిన వీరేందర్ గౌడ్**

న్యూఢిల్లీ,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): ఏపితో కలిసి ఉమ్మడి ప్రాజెక్ట్ ఎలా కడతారని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు లక్ష్మణ్ ప్రశ్నించారు. అంటే అప్పుడు చెప్పిన మాట అబద్దమా?.. ఇప్పుడు చెబుతున్న మాటలు అబద్దమా అని టీఆరఎస్ ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఇద్దరు సీఎంలు నీళ్ల పేరుతో దోపిడీకి ఎత్తుగడ వేశారని ఆరోపించారు. హుజూరానగర్‌లో కోట్లు వెదజల్లి టీఆర్ఎస్ గెలవాలనుకుంటోందని, టీఆర్ఎస్‌కు మరోసారి అవకాశమిస్తే భవిష్యత్ ఉండదన్నారు. నామినేషన్లు వేసేందుకు సిద్ధమైనవారిపై దొంగ కేసులు పెట్టారని దుయ్యబట్టారు. ప్రజాధనం దుర్వినియోగం చేయడానికే జగన్-కేసీఆర్ లక్ష కోట్లతో ప్రాజెక్టులు కడతామంటున్నారని లక్ష్మణ్ ధ్వజమెత్తారు. నీళ్లు, నిధులు, నియామకాల అంశాన్ని కేసీఆర్ నిర్వీర్యం చేశారు. తెలంగాణలో కుటుంబ, అవినీతి పాలన రాజ్యమేలుతోంది. బంగారు తెలంగాణ పేరుతో మాయ మాటలు చెబుతున్నారు. ఉద్యమ సమయంలో ఆంధ్రోళ్ళు తెలంగాణ నీళ్లను ఏపీ దోచుకుందని దూషించి పబ్బం గడుపుకొన్నారు. ఇప్పుడు ఏపీతో కలిసి ప్రాజెక్టులు ఎలా కడతారు? కాంట్రాక్టర్ల జేబులు నింపడం, కమీషన్ల కోసం ఏపీ సీఎంతో కలిసి కేసీఆర్ ప్రాజెక్టుల నాటకం ఆడుతున్నారు. కాంట్రాక్టర్ల దగ్గర కమీషన్లు దండుకుని కేసీఆర్ ఎన్నికల్లో గెలుస్తూ వచ్చారు. రూ.30 వేల కోట్లతో మొదలుపెట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ఇప్పుడు రూ.80 వేల కోట్లకు చేరుకుందని లక్ష్మణ్ విమర్శించారు. మాజీ మంత్రి దేవేందర్ గౌడ్ కుమారుడు, తెలంగాణ తెలుగు యువత మాజీ అధ్యక్షుడు వీరేందర్ గౌడ్ బిజెపిలో చేరారు. లక్ష్మణ్,ఎంపి గరికపాటి,మురళీధర్ రావు, వివేక తదితరుల సమక్షంలో బీజేపీ కార్యాలయంలో ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ కేసీఆర్ తీరును ఎండగట్టారు. దేశానికి సేవ చేయాలనే ఉద్దేశ్యంతోనే బీజేపీలో చేరుతున్నానని మాజీ మంత్రి దేవేందర్ గౌడ్ కుమారుడు, తెలంగాణ తెలుగు యువత మాజీ అధ్యక్షుడు వీరేందర్ గౌడ్ అన్నారు. సుదీర్ఘంగా ఆలోచించే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. గురువారం ఆయన ఢిల్లీలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ ను కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో ప్రధాని మోదీ దేశాన్ని ఎంతో అభివృద్ధి చేశారని ప్రశంసించారు. న్యూ ఇండియా చేయాలన్న మోదీ ఆలోచన తనకు బాగా నచ్చిందని, అందుకే బీజేపీలో చేరుతున్నానని వివరించారు. నయా భారత్ రావాలంటే మోదీతోనే సాధ్యమన్నారు. ఈ రోజు సాయంత్రం బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా సమక్షంలో పార్టీలో చేరుతానని ప్రకటించారు. మూడు రోజుల క్రితం వీరేందర్ గౌడ్ టీడీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

# తండ్రి అఘాయిత్యంపై బాలుడి ఫిర్యాదు

**మందలించి పంపిన పోలీసులు**

నిజామాబాద్,అక్టోబర్4 (ఆర్ఎన్ఎ): ఎనిమిదేళ్ల ఓ బాలుడు పోలీస్ స్టేషన్‌లో తన తండ్రిపై ఫిర్యాదు ఇచ్చాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని వర్ని మండలం ఒడ్డేపల్లిపకి గ్రామానికి చెందిన 8 ఏళ్ల వయస్సున్న మహేష్ అనే బాలుడు తన తండ్రిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తండ్రి శివ నిత్యం తనను కొడుతూ, వేధిస్తున్నాడని పోలీసుల ముందు ఆ బాలుడు విలవిల ఏడ్చాడు. వివరాలు తెలుసుకున్న ఎస్సై అనిల్ రెడ్డి బాలుడి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మీ మధ్య ఏమైనా గొడవలుంటే పిల్లలపై మీ ప్రతాపం చూపిస్తారా.. అంటూ ఆయన తల్లితండ్రులను నిలదీశారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకూడదనీ, పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని ఎస్సై వారికి సూచించారు.

# బాసరలో ఘనంగా దేవీ శరన్నవరాత్రులు

**స్కందమాతగా దర్శనమిచ్చిన అమ్మవారు**

**భారీగా తరలివస్తున్న భక్తులు**

నిర్మల్,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసర ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బాసరలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నాల్గొవ రోజు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. జ్ఞాన సరస్వతి అమ్మవారు గురువారం స్కందమాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మాతకే మాతగా శ్వేత వర్ణంలో ఆదిమాతయైం కుమారస్వామిని లాలించే అమ్మ తత్తపు స్ఫురద్రూపం స్కందమాత అవతారం. అమ్మ భావనలోనే అమృతత్తం ఉంది. మన కన్నతల్లిలోని అమ్మతనం కూడా జగన్మాత ప్రకాశమేననీ., మాతృదేవోభవ అనే సందేశాన్నీ మానవాళికి ప్రబోధంగా అందిస్తుంది స్కందీమాత రూపం. ఈ అమ్మ లాలిత్యమే శాశ్వత చైతన్య ఝురి. సకల సృష్టిపై వాత్సల్యపూరిత దృష్టిని ప్రసరించే విశ్వజనని స్కందమాత దృష్టివైభవాన్ని ఎంతగా వర్ణించినా తనివి తీరదు. ఈ అవతరాంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులుభారీ సంఖ్యలో తరలి వచ్చారు.

నవరాత్రుల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు తెలంగాణతో పాటు మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. రాత్రి వేళల్లో సాంస్కృతిక, జానపద, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలువురు భక్తులు పాదయాత్రగా బాసరకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

# లలితా జ్యువెలరీలో దొంగతనం కేసు

**రంగంలోకి దిగిన క్లూస్ టీమ్**

**ఆధారాల వేటలో పడ్డ పోలీసులు**

**ప్రత్యేక బృందాలతో దొంగల కోసం గాలింపు**

చెన్నై,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): తమిళనాడు తిరుచ్చి లలిత జూలరీలో భారీ చోరీ జరిగిన ఘటనలో క్లూస్ టీమ్ రంగంలోకి దిగాయి. సినీ ఫక్కీలో షోరూమ్‌కి కన్నం వేసిన దొంగలు పదమూడు కోట్ల రూపాల విలువైన నగలు ఎత్తుకపోయారు. జంతువుల మాస్కులు పెట్టుకుని రెండు గంటల్లోనే ఈ దొంగతనం చేశారు. షోరూం వెనుక వైపు ఉన్న గోడకు కన్నం వేసి, పిల్లలు ఆడుకునే జంతువుల మాస్క్ లు పెట్టుకొని సిసి కెమెరాల కన్ను కప్పారు, అమ్మకాల కోసం బాక్సుల్లో ఉంచిన బంగారం, వజ్రాలు మూటగట్టుకున్నారు. ఇద్దరు అగంతకులు మొత్తం రెండు గంటల లోపే పదమూడు కోట్ల రూపాయలు విలువైన ఆభరణాలతో ఉడాయించారు. వెంటనే తిరుచ్చి నగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆధారాల కోసం ఫోరెన్సిక్ నిపుణులు చోరీ జరిగిన ప్రాంతంలో క్షుణ్ణంగా పరిశీలన జరిపారు. పరిసర ప్రాంతాల్లో జాగిలాలతో తనిఖీ చేశారు. షోరూం లోని సీసీ టీవీ ఫుటేజ్ ను పరిశీలించగా వేకువ జామున రెండు గంటల ముప్పై నిమిషాల నుండి ఉదయం నాలుగు గంటల ముప్పై నిమిషాల మధ్య షోరూంలో రెండు అగంతకులు ఉన్నట్లు గుర్తించారు. అయితే వారు తమ చేతి వేలి ముద్రలు కూడా దొరకకుండా జాగ్రత్త పడ్డారు. దోచుకున్న నగలను ఏ మార్గంలో ఏ వాహనంలో తరలించారన్న విషయం పై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే షోరూంలో పని చేస్తున్న నూట అరవై మందికి పైగా సిబ్బంది వద్ద విచారణ జరుపుతున్నారు. గత కొన్నేళ్లలో తమిళనాడులో జరిగిన అతిపెద్ద చోరీ ఇదే. విషయం తెలిసిన వెంటనే లలితా జ్యూయలరీ అధినేత కిరణ్ కుమార్ తిరుచ్చికి వెళ్లి షోరూంను పరిశీలించారు. బంగారు నగలతో పాటు వజ్రాలం, ప్లాటినంతో తయారు చేసిన ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. రాష్ట్రం మొత్తం ఉలిక్కిపడేలా చేసిన ఈ ఘటనలో నిందితులను పట్టుకునేందుకు ఏడు ప్రత్యేక పోలీసు బృందాలు నిర్మితమయ్యాయి. కిరణ్ కుమార్ తన ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం తిరుచ్చి సత్రం బస్టాండ్ సమీపంలో ఉన్న లలితా జ్యువెలరి షోరూంని రోజులాగానే బుధవారం ఉదయం తెరిచారు. షోరూం లోపల ఖాళీగా ఆభరణాల బాక్సులు కనిపించే సరికి నిర్వాహకులు సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు. గతేడాది తిరుచ్చి ఒకటవ నెంబర్ టోల్ గేట్ సమీపంలోని పంజాబ్ నేషనల్ బ్యాంకుని ఇదే రీతిన కన్నం వేశారు. అప్పుడు బ్యాంక్ గోడకు కన్నం వేసి అగంతకులు లోపలకు ప్రవేశించి ఐదు కోట్ల విలువైన నగలను అపహరించారు. ఆ ఘటన లలితా జువెలర్స్ లో దోపిడీ జరిగిన విధానం ఒకేలా ఉన్నాయని ఆ అగంతకులే ఈ దోపిడీ కి పాల్పడి ఉంటారనే కోణం లోనూ దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# కర్ణాటకలోనూ ఎన్నార్సీని అమలు చేస్తాం

**మా రాష్ట్రంలోనే అక్రమ వలసదారులెక్కువ**

**రాష్ట్ర హోం మంత్రి బసవరాజ్ బొమ్మయ్**

బెంగళూరు,అక్టోబర్4 (ఆర్ఎన్ఎ): కర్ణాటకలోనూ ఎన్నార్సీని అమలు చేస్తామంటూ ఆ రాష్ట్ర హోం మంత్రి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. ఓ కార్యక్రమంలో మీడియాతో మాట్లాడిన బసవరాజ్ బొమ్మాయి.. రాష్ట్రంలో నివసిస్తున్న అక్రమవలసదారుల సమాచారాన్ని సేకరించే పక్రియను ప్రభుత్వం మొదలు పెట్టిందని తెలిపారు. పూర్తి వివరాలు సేకరించిన అనంతరం ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్తాం అన్నారు. అక్రమ వలసదారులు అత్యధికంగా నివసిస్తున్న రాష్ట్రాల్లో కర్ణాటక కూడా ఒకటన్నారు. కేంద్రంతో సంప్రదించి కర్ణాటకలో కూడా ఎన్నార్సీని అమలు చేస్తామని స్పష్టం చేశారు. కాగా.. అస్సాంలో ఎన్నార్సీని అమలు చేసిన అనంతరం ఢిల్లీ, బెంగాల్ సహా కర్ణాటకలో కూడా జాతీయ పౌర జాబితాను అమలు చేయాలని ఆయా రాష్ట్రాల బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర హోం మంత్రిత్వశాఖ నుంచి ఆదేశాలు అందిన వెంటనే ఆ నిర్ణయాన్ని అమలు చేయడం ఖాయంగా కనిపిస్తోంది. కేంద్రం అనుమతులు కోసం ఎదురు చూస్తున్నామని కర్ణాటక హోం శాఖ మంత్రి బసవరాజ్ బొమ్మై తెలిపారు. కర్ణాటక గనక ఎన్ఆర్సీని అమలు చేస్తే.. దక్షిణాదిన దీన్ని అమలు చేసిన తొలి రాష్ట్రమౌతుంది. కర్ణాటక వలసదారుల సంఖ్య అత్యధికంగా ఉన్న రాష్ట్రమని, ఎన్ఆర్సీని అమలు చేయాల్సిన అవసరం ఉందని బొమ్మై అన్నారు. గురువారం ఆయన హావేరీలో విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఎన్ఆర్సీనీ అమలు చేయాలంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన సూచనలను తాము పాటిస్తామని అన్నారు. ఇప్పటికే పౌరుల వివరాలను సేకరించే పనిలో ఉన్నామని, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి లభించిన వెంటనే ఎన్ఆర్సీని అమలు చేస్తామని చెప్పారు. రాజధాని బెంగళూరు సహా మైసూరు, మంగళూరు బీదర్, గుల్బర్గా, విజయపురా.. వంటి ప్రధాన నగరాల్లో పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన వారు వందల సంఖ్యలో ఉన్నారని, వారిలో కొందరు క్రిమినల్స్ కూడా ఉన్నారని చెప్పారు. తమ రాష్ట్రాల్లో నేరాలకు పాల్పడి కర్ణాటకలో తలదాచుకుంటున్నట్లు పోలీసు శాఖ వద్ద పక్కా సమాచారం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్ఆర్సీని అమలు చేయాల్సిన అవసరం ఉందనే విషయాన్ని తాము కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు వివరిస్తామని బసవరాజ్ బొమ్మై తెలిపారు. పొరుగు రాష్ట్రాల నుంచి వలస వచ్చిన నేరస్తులను తమ రాష్ట్రంలో షెల్టర్ ఇవ్వలేమని చెప్పారు.

# ఏసిబికి చిక్కిన వీఆర్వో

**లంచం తీసుకుంటుండగా పట్టివేత**

రంగారెడ్డి,అక్టోబర్4 (ఆంఎన్ఎ): మరో అవినీతి చేప ఏసీబీ అధికారులకు పట్టుబడింది. రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయాంజల్ గ్రామ వీఆర్వో శంకర్ గత కొన్ని రోజులుగా అవినీతికి పాల్పడుతున్నట్లు గుర్తించి పట్టుకున్నారు. ఇటీవల గుర్రంగూడకు చెందిన ముత్యంరెడ్డి అనే రైతు తనకు చెందిన ఎకరా ఇరవై గుంటల(1.20) భూమి మ్యూటేషన్ కోసం వీఆర్వో శంకర్‌ను కలవగా.. అతడు రైతును లక్ష రూపాయలు లంచం అడిగాడు. డబ్బిస్తేనే పనవుతుందని రైతుకు నిర్మొహమాటంగా తెలిపాడు. దీంతో, ఎక్కడా పాలుపోని రైతు.. వీఆర్వోకు లక్ష రూపాయలు ఇవ్వలేననీ, 70 వేల రూపాయలు ఇస్తానని ఒప్పుకున్నాడు. అనంతరం, రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పథకం ప్రకారం రైతు ముత్యం రెడ్డి వీఆర్వోకు డబ్బు ఇస్తుండగా ఏసీబీ అధికారులు అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం వీఆర్వో కార్యాలయంలో అధికారులు సోదాలు నిర్వహించారు. అవినీతికి పాల్పడ్డ వీఆర్వోను ఏసీబీ అధికారులు కోర్టుకు తరలించారు. ఏ స్థాయి అధికారి అయినా లంచం డిమాండ్ చేస్తే తమను ఆశ్రయించాలని ఏసీబీ డీఎస్పీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. 9440446140 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

# పోలీస్ అకాడమీల్లో అంతా చెత్తే

**మంచి ఫలితాలు రావడం లేదు**

**పోలీస్ అకాడమీ డైరెక్టర్ వీకే సింగ్ సంచలన వ్యాఖ్యలు**

హైదరాబాద్,అక్టోబర్4 (ఆర్ఎన్ఎ): పోలీస్ అకాడమి డైరెక్టర్ వీకే సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పోలీస్ అకాడమీల నుంచి ఆశించిన ఫలితాలు రావడం లేదన్నారు. ట్రైనింగ్ తీసుకున్న పోలీసులు మంచి పేరు తీసుకురావడం లేదని వ్యాఖ్యానించారు. పనికిరాని వాళ్లని భావిస్తున్నవాళ్లు, తుక్కుగా మిగిలినవాళ్లను.. ఆరోపణలు ఎదుర్కొంటున్నవాళ్లని అకాడమీలో నియమిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వారు పోలీసులకు ఎలాంటి శిక్షణ ఇస్తారు?, దీంతో అకాడమీలపై ఖర్చు చేసే సొమ్ము వృథా అవుతోందని చెప్పారు. పోలీసు శిక్షణాసంస్థలు పరిశోధన, అభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని హితవు పలికారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేసుకోవాలని సూచించారు. మా ముందు గురుతర బాధ్యత ఉంది.. దేశంలోనే అత్యున్నత శిక్షణ సంస్థగా టీఎస్‌పీఏను తీర్చిదిదుతామన్నారు. ఈ రకంగా దేశంలో పోలీస్ ట్రైనింగ్ అకాడమీలు డంపింగ్ యార్డుల్లా మారాయని సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పోలీస్ అకాడమీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత దేశంలో ఉన్న అన్ని పోలీస్ అకాడమీ నుండి ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రైనింగ్ సెంటర్ లలో శిక్షణ తీసుకున్న అధికారులు విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకోలేకపోతున్నారని తెలిపారు. ప్రజల కోసం పోలీసులు తమ ప్రాణాల్ని ఫణంగా పెడుతున్నారని, కానీ ఎక్కడా ప్రజల నుండి గుర్తింపు రావడంలేదన్నారు. దానికి కారణం శిక్షణ లోపమేనని అభిప్రాయం వ్యక్తం చేశారు. బ్రిటిష్ పాలకుల ఆచారం ఇంకా పోలీస్ శాఖలో కొనసాగుతుందని వ్యాఖ్యానించారు. కేవలం డబ్బు ఉన్నవారికి మాత్రమే పోలీసులు పనిచేస్తున్నారని చెప్పారు.

జైల్లలో మగ్గుతుందని 90 శాతం పేదవాళ్లేతినడానికి తిండిలేని 90శాతం మంది పేదవారు జైల్లలో మగ్గుతున్నారని అన్నారు. వారిలో కొంతమందికి కనీసం ఎందుకు అరెస్ట్ అయ్యామో..? ఏ కేసులో అరెస్ట్ అయ్యి జైల్ కి వచ్చామో కూడా తెలియదన్నారు. పోలీస్ అకాడమీ లో ప్రయోగాలు చేయడం ఎంతైనా అవసరం ఉందన్న ఆయన ..పోలీసులు సామాజిక కార్యకర్తల్లా పనిచేయాలని సూచించారు. పోలీస్ అకాడమీ లు స్కూలు, కాలేజీలు కావని ప్రజలతో పోలీసులు ఎలా ప్రవర్తించాలో శిక్షణలో ఉండాలని స్పష్టం చేశారు. ఈ నెల 24 న ప్రారంభం అయ్యే కొత్త బ్యాచ్ శిక్షణకు అకాడమీలో నూతన పద్ధతుల్ని అమలు చేస్తామన్నారు. పోలీస్ ఆఫీసర్ అంటే బిల్డర్ కావాల్సిన అవసరం లేదని.. వికలాంగుడైనా పోలీస్ కావొచ్చన్నారు. సీఐ నుండి ఎస్పీ వరకు గ్రౌండ్ లెవల్లో పని చేసే తీరుపైన అబ్జర్వేషన్ చేసి రిపోర్ట్ రాష్ట్ర డీజీపీ కు నివేదిక ఇస్తామని , దాని ప్రకారమే ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. అవినీతి లో దేశంలో తెలంగాణ 3వ స్థానం లో ఉంది అని ఒక సర్వే చెప్పిందని.. ఆ సర్వే తనని ఎంతగానో బాధించిందని వీకే సింగ్ తెలిపారు.

# టమోటాకి అంటిన ఉల్లి ఘాటు

**భారీగా పెరిగిన టమోటా ధరలు**

హైదరాబాద్,అక్టోబర్4 (ఆర్ఎన్ఎ): భారీ వర్షాల కారణంగా నిత్యావసరాల్లో చాలా ముఖ్యమైన ఉల్లి, టమాటాల ధరలు గత 10 రోజులగా చుక్కలు చూపిస్తున్నాయి. 10 రోజుల క్రితం 10రూపాయలకు వస్తున్న టమాటో ఇప్పుడు కేజీ టమోటాలు 42 రూపాయిలు చొప్పున అమ్ముతున్నారు. వర్షాకాలం కారణంగా చింతూరు జిల్లా మదనపల్లె నుంచి వచ్చే టమాటా తగ్గిపోయింది. దీంతో కర్ణాటక లోని కోలార్ నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. అనంతపురం జిల్లా నుంచి కొంత టమోటా రప్పిస్తున్నారు. సరిగ్గా రెండు రోజుల క్రితం సోమవారం టమాటా రైతు బజార్ లో కిలో 16 రూపాయిలు ఉండేది. మంగళవారం ఈ రేటు కాస్త పెరిగి 20రూపాయలకు చేరింది. బుధవారం నాటికీ 26రూపాయలకు చేరింది. ఈరోజు ఏకంగా 42 రూపాయలకు చేరింది. కేవలం మూడు రోజుల్లో 26 రూపాయిలు పెరిగింది. అదికూడా ఈ రేటు బోయినపల్లి మార్కెట్ లో రేటు. ఇంకా అక్కడ కొని బయట అమ్మే వారి రేటు.. వారు ఎంతకీ అమ్మితే అంత. అయితే మరో వారంలో ధర తగ్గే అవకాశం ఉంది అని అంటున్నారు. గత వారం భారీ వర్షాల కారణంగా రేట్లు అధికంగా పెరిగాయని, ఇప్పుడు వర్షాలు లేవు కాబట్టి వచ్చే వారం తగ్గిచు అని అంచనా వేస్తున్నారు. మరి ధరలు వచ్చే వారం అయినా తగ్గుతాయా లేదా అనేది చూడాల్సి ఉంటుంది.

# గాంధీ విగ్రహం ముందు విలపించిన ఎస్పీ నేత

లక్నో,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్ ఎస్పీ నేత ఫిరోజ్ ఖాన్.. గాంధీ విగ్రహం ముందు ఏడ్చేశారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం సంభల్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ గాంధీ విగ్రహానికి పూల మాల వేసే ముందు ఆ విగ్రహానికి అభిషేకం చేశారు. నీటితో విగ్రహాన్ని శుభ్రం చేసిన తర్వాత ఆ విగ్రహాన్ని పట్టుకుని బోరున విలపించారు. విగ్రహం మొత్తం దుమ్ముతో నిండిపోయి ఉన్నదని, ప్రజల్ని మోసం చేయలేరని, బీజేపీ నాటకాలు చేస్తోందని ఎస్పీ నేత ఫిరోజ్ ఖాన్ తెలిపారు. బీజేపీ నేతలు గాంధీకి మద్దతు ఇస్తున్నారా లేక గాడ్సేకు మద్దతు ఇస్తున్నారా తెలుపాలని అన్నారు.

# కిటకిట లాడుతున్న బస్ స్టేషన్లు

**సమ్మె పిలుపుతో ప్రయాణికుల్లో భయాలు**

**గమ్యం చేరేదెలా అన్న భయాందోళనలు**

హైదరాబాద్,అక్టోబర్4 (ఆర్ఎన్ఎ): దసరా పండగను పురస్కరించుకుని నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలు తమ సొంతూళ్లకు బయలుదేరుతుండడంతో రైళ్లన్నీ కిటకిటలాడుతున్నాయి. అలాగే ఆర్టీసీ బస్టాండ్లు కూడా కిటకిటలాడుతున్నాయి. మరోవైపు ఆర్టీసీ సమ్మె అనివార్యం కానుండడంతో ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. తమకు ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా 28 నుంచి అక్టోబర్ 14 వరకు 16 రోజుల పాటు పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పండగను తమ సొంతూళ్లలో ఆనందంగా జరుపుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన నగరవాసులు ఇంటిబాట పట్టడంతో ఇటు రైళ్లు, అటు బస్సులు కిటకిటలాడుతున్నాయి. ప్రయాణికులు పోటెత్తుతుండడంతో ఏ రైలులో చూసినా జనం రద్దీనే కనిపిస్తోంది. రెండు రోజుల నుంచి సికింద్రాబాద్ స్టేషన్ నుంచి దాదాపు 1.80 లక్షల మంది వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే నాంపల్లి, కాచిగూడతోపాటు చర్లపల్లి, లాలాగూడ స్టేషన్ల నుంచి మరో 50 వేల మంది ప్రయాణించినట్లు తెలిసింది. దసరా పండగను దృష్టిలో ఉంచుకుని సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్లలో ఆగే రైళ్ల ద్వారా తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు కొంతమంది ముందస్తుగా టికెట్లను రిజర్వేషన్ చేసుకున్నారు. అయితే ఇందులో పలువురికి తాము ఎక్కాల్సిన రైలుకు టికెట్లు కన్‌ఫాం కాకపోవడంతో స్టేషన్లకు వచ్చి భార్య, పిల్లలతో ఇబ్బందులు పడ్డారు. పండగకు వెళ్లే ప్రయాణికుల రద్దీ రైళ్లతోపాటు బస్సుల్లో కూడా కనిపిస్తోంది. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈనెల 5 నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు పిలుపునిచ్చిన తరుణంలో నగరానికి చెందిన తెలంగాణ, ఏపీ ప్రజలు ముందస్తుగా తమ ఇళ్లకు బయలుదేరి వెళ్తున్నారు. ఎంజీబీ ఎస్, జూబ్లీబస్‌స్టేషన్ నుంచి దూరప్రాంతాలకు వెళ్లే వారు భారీగా తరలివస్తున్నారు. బస్సులు కిటకిటలాడుతుండడంతో ఆయా బస్‌స్టేషన్ల నుంచి చాలా మంది రైల్వేస్టేషన్లకు పరుగులు తీస్తుండడంతో అక్కడ రద్దీ విపరీతంగా పెరిగిపోతుంది. పండుగ సందర్భంగా ఆర్టీసీ నగరం నుంచి వివిధ ప్రాంతాలకు 600 బస్సులు నడిపించగా, మరో 400 బస్సులను అందుబాటులో ఉంచింది.

# భారీ వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి

**రోడ్లను త్వరలోనే బాగు చేస్తాం**

**గ్రేటర్ హైదరాబాద్‌కు మాస్టర్ ప్లాన్ రెడీ**

**మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ వెల్లడి**

హైదరాబాద్,అక్టోబర్4 (ఆర్ఎన్ఎ): భారీ వర్షాలకు రోడ్లు దెబ్బతినేలాంటి పరిస్థితులు ఏర్పడడం సహజమేనని పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. దెబ్బతిన్న అన్నిరోడ్లను బాగుచేస్తున్నామని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌కు మాస్టర్ ప్లాన్ రెడీ అవుతోందని ఈసందర్భంగా మంత్రి తలసాని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక హైదరాబాద్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతు న్నాయని అన్నారు. గురువారం మాసాబ్ టాంక్‌లోని పశుసంవర్ధ శాఖ డైరెక్టర్‌కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసుకున్న కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. సెక్రటేరియట్ ఖాళీ చేసిన నేపథ్యంలో ఇకమంత్రి తన కార్యకలాపాలన్నీ ఈ కార్యాలయనుంచే నిర్వహించనున్నారు. గ్రేటర్ పరిధిలో మంత్రి కేటీఆర్ నేతృత్వంలో రోడ్లు తాగునీరు, ఫ్లై ఓవర్స్ నిర్మాణం జరుగుతున్నాయని అన్నారు. భారీ వర్షాలకు జంటనగరాల్లో చాలా ప్రాంతాల్లోరోడ్లు పాడయ్యాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాకనే కుల వృత్తులకు ప్రోత్సాహం లభించిందన్నారు. 7.62వేల మందికి గొర్రెలు పంపిణీ చేయాలని నిర్ణయించామని, 5వేల కోట్లతో 1.70 కోట్ల గొర్రెలు పంపిణీ చేస్తామన్నారు. కులవృత్తులను ఆర్థికంగా సామాజికంగా బలోపేతం చేయుడానికి ప్రోత్సహిస్తామన్నారు. ఇన్సూరెన్స్ ఉండి చనిపోయిన గొర్రెల స్థానంలో కొత్తవాటిని దీపావళిలోపు పంపిణీ చేస్తామన్నారు. కడీడీలు కట్టిన అందరికీ గొర్రెల యూనిట్లు పంపిణీ చేస్తామని కూడా మంత్రి వెల్లడించారు. మత్స్యకారుల కుటుంబాలు సంతోషంగా ఉన్నాయని, ఈసారి 80వేల చేప పిల్లలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రతి చెరువుల్లో , కుంటల్లో చేప పిల్లలు వేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. విజయ డెయిరీని రెండు సంవత్సరాల్లో దారికి తీసుకు వస్తామని మంత్రి తలసాని వెల్లడించారు. విజయడెయిరీ ఔట్ లెట్స్, ఉత్పత్తులను కూడా పెంచుతామని తెలిపారు. సినిమా టికెట్‌లు పెంచి నాలుగు సంవత్సరాలైందని, త్వరలోనే టికెట్ ధరలను సమీక్షిస్తామని మంత్రి వెల్లడించారు. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఆన్‌లైన్ టికెటింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టబోతున్నామని తెలిపారు. ప్రభుత్వ పోర్టల్ నుంచే టికెటింగ్ ఉంటుందని మంత్రి స్పష్టంచేశారు. రాజకీయాల్లో శాశ్వత శత్రుత్వం అంటూ ఉండదని, హుజూర్ నగర్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్‌పార్టీ కమ్యూనిస్టుల మద్దతు కోరటంలో తప్పులేదని అన్నారు. కాంగ్రెస్‌లో ఐక్యతలేదని ఆపార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఆయన అన్నారు. హుజూర్‌నగర్ ప్రచారం కోసం వెళ్లాలని గాంధీభవన్‌లో సమావేశం అనుకుంటే సూర్యాపేట వెళ్లే వరకూ కొట్టుకునే సంస్కృతి వారిదని ఎద్దేవా చేశారు. త్వరలోనే తాను టీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుకోసం హుజూర్‌నగర్‌కు వెళ్లనున్నట్టు తెలిపారు.

# నిజామాబాద్ ప్రాజెక్టులపై మంత్రి సమీక్ష

హైదరాబాద్,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): నిజామాబాద్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి ప్రశాంత్ రెడ్డి సమీక్ష చేపట్టారు. ఆర్మూర్ ఎమ్మెల్యే, నీటిపారుదల ఇంజినీర్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గుత్ప పూర్తి ఆయకట్టుకు నీరుందేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతలలో లోపాలు సరిచేసి అన్ని గ్రామాలకు సాగునీరు ఇవ్వాలన్నారు. రైతులను ఒప్పించి పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలన్నారు. జుక్కల్‌లోని నాగమడుగు ఎత్తిపోతలకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. వీలైనంత తక్కువ భూసేకరణతో ఎత్తిపోతలకు ప్రణాళికలు రూపొందించాలని మంత్రి పేర్కొన్నారు.

## ఏపీ వార్తలు

### మార్కెట్ కమిటీల్లో సగం పోస్టులు మహిళలకే

# సీఎం వైఎస్ జగన్ కీలక నిర్ణయం

**అధికారులతో పంటల కొనుగోళ్లపై సమీక్ష**
**ధరలను ముందు ప్రకటించాలని ఆదేశాలు**
**నెలాఖరుకు చిరుధాన్యాల బోర్డు ఏర్పాటు**

అమరావతి,అక్టోబర్4 (ఆర్ఎన్ఎ): ఏపీ సీఎం వైఎస్ జగన్ మహిళలపై వరాల జల్లు కురిపించారు. మార్కెటింగ్, సహకార శాఖలపై అధికారులతో చర్చించారు. స్థిరీకరణ, మార్కెట్లలో కనీస సదుపాయాలు, మిల్లెట్స్ బోర్డులపై సమీక్షించారు. ఇక మార్కెట్ ఛైర్మన్లలో సగం మహిళలకే కేటాయించారు. కమిటీల్లో కూడా సగం మహిళలకే ఇవ్వనున్నారు. అక్టోబర్ చివరినాటికి ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇప్పటికే జారీ అయిన జీవో ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు యాభై శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని సీఎం ఆదేశించారు. ఇకపోతే పంటలకు లభిస్తున్న ధరలు, మార్కెట్లపై నిరంతర సమాచారం అందించాలన్నారు. మూడు మార్గాల్లో వ్యవసాయ ఉత్పత్తులు, వాటికున్న డిమాండ్, వివిధ ప్రాంతాల్లో ధరల పై ఎప్పటికప్పుడు సమచారం తెలియజేయాలని చెప్పారు. పంటలు వేసినప్పుడే వాటికి ధరలు ప్రకటించాలని చెప్పారు. ఆరునెలల్లోగా దళారీ వ్యవస్థను నిర్మూలించాలన్నారు. కనీస మద్దతు ధరలు లేని పంటలకు కూడా ధరలు ప్రకటించాలి తెలిపారు. అక్టోబరు చివరి నాటికి చిరుధాన్యాలపై బోర్డు ఏర్పాటు చేయాలని సీఎం జగన్ చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకోసం ఇప్పుడున్న గోడౌన్లు, కోల్డ్ స్టోరేజీలపై సమగ్ర పరిశీలన, అవసరాల మేరకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల నష్టాలపై కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. అవినీతి, వక్షపాతం సహకార రంగంలో ఉండకూడదని జగన్ తెలిపారు.

ఆరుతడి పంటలపై అక్టోబరు 10 నుంచి రైతులు ఆన్ లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు చెప్పారు. అక్టోబరు 15 నుంచి కొనుగోలు ప్రారంభిస్తామన్నారు. ధరల స్థిరీకరణ, మార్కెట్లో ప్రభుత్వ జోక్యం వల్ల 85 రైతు బజార్లలో రూ.25లకే కిలో ఉల్లిపాయలు విక్రయిస్తున్నామని జగన్‌కు అధికారులు వివరించారు. 660 మెట్రిక్ టన్నులు వినియో గదారులకు ఇచ్చామన్నారు. అయితే మళ్లీ ధరలు పెరిగిన క్రమంలో ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ సమావేశంలో మంత్రులు కన్నబాబు, మోపిదేవి వెంకటరమణ పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ శాఖా మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ ధరల స్థిరీకరణ నిధిని వినియోగించి రైతులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా సహకార శాఖను ఆధునికీకరించాలని ఆదేశాలు జారీ చేశారు. నష్టాల్లో ఉన్న డీసీసీబీలను గాడిలో పెట్టి.. బకాయిల వసూళ్లపైనా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు. ఈ మేరకు నిపుణుల కమిటీని నియమించనున్నట్లు పేర్కొన్నారు. 'రైతు ఏ దశలో కూడా నష్టపోకూడదన్నదే సీఎం జగన్ లక్ష్యం. గిట్టుబాటు ధర ఇవ్వకపోతే గ్రామ సచివాలయాల్లో అగ్రికల్చరల్ అసిస్టెంట్‌కి ఫిర్యాదు చేయండి. రైతు భరోసా భారీ సంక్షేమ కార్యక్రమం. అక్టోబర్ 15న ఈ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభిస్తారు అని తెలిపారు. అదే విధంగా అక్టోబర్ 15 నుంచి అపరాల కొనుగోలు ప్రారంభిస్తామని మంత్రి కన్నబాబు తెలిపారు. పామాయిల్‌కు తెలంగాణాలో ఉన్న ధరనే రాష్ట్రంలో కూడా అమలు చేయాలని సీఎం జగన్ ఆదేశించినట్లు పేర్కొన్నారు. అంతేగాకుండా పామాయిల్ ధర రూ. 10వేలు చేయాలని విన్నవిస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం లేఖ రాశారని తెలిపారు. కాగా నేతన్నలకు మేలు చేకూర్చేవిధంగా ఆప్కో సంస్కరణల కోసం కూడా నిపుణుల కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

## గ్రంథాలయంలో గాంధీ విగ్రహావిష్కరణ

విజయనగరం,అక్టోబర్4 (ఆర్ఎన్ఎ): విజయనగరం మండలం కెయల్.పురం గ్రామంలో ఉన్న డాక్టర్ అబ్దుల్ కలాం స్మారక గ్రంథాలయంలో గాంధీజీ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. బుధవారం మహాత్మా గాంధీ 150 వ జయంతిని పురస్కరించుకుని.. గురువారం ఉదయం కాలనీ రిటైర్డ్ ఉద్యోగి నారాయణ రావు చేతుల మీదుగా గాంధీజీ విగ్రహ ప్రతిష్టాపన చేపట్టారు. కాలనీ పెద్దలు అంతా జ్యోతి ప్రజ్వలన గావించి, గాంధీజీ ఆశయాలను, త్యాగాన్ని, అహింసా విధానాన్ని, ప్రస్తుత కాలంలో వాటి అవసరాన్ని, యువతకు, చిన్నారులకు ప్రబోధించారు. బ్రిటీష్ వారు దేశ సంపదను దోచుకున్నారని అందరూ అంటున్నారు...కానీ మన చుట్టూ ఉన్న స్వార్థపూరిత రాజకీయ నాయకులే గత 70 సంవత్సరాలుగా దేశ సంపదను దోచుకుంటున్నారని, నిజమైన స్వాతంత్రం ఇంకా రాలేదని అక్కడి యువతీయువకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంఘ సభ్యులు కోరాడ, వెంకటరావు, పతివాడ రమణమూర్తి, తాళ్ళపూడి గణెళిష్ (పండు), కంది. ఈశ్వరరావు, చక్రి మాష్టారు, ప్రసాద్, పిల్లా రాంప్రసాద్, కఅష్ణారావు, సత్యారావు, ఆంజనేయులు, కె.నారాయణరావు, యువకులు, చిన్నారులందరూ పాల్గని గాంధీజీ ఆశయాల కోసం కఅషి చేస్తామని ప్రతిజ్ఞ చేపట్టారు.

# కల్పవృక్ష వాహనంపై ఊరేగిన మలయప్పస్వామి

**ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు**

తిరుమల,అక్టోబర్4 (అంఎన్ఎ): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. దీంతో ఇక్కడ ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నాయి. ఇందులో భాగంగా నాలుగో రోజు గురువారం శ్రీమలయప్ప స్వామివారు ఉభయదేవేరులతో కలిసి కల్పవృక్ష వాహనంపై రాజమన్నార్ అలంకారంలో ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 9 నుండి 11 గంటల వరకు స్వామివారు నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు చెక్కభజనలు, జీయ్యంగార్ల గోష్ఠితో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి శ్రీవారిని దర్శించుకున్నారు. క్షీరసాగరమథనంలో విలువైన వస్తువులెన్నో ఉద్భవించాయి. వాటిలో కల్పవృక్షం ఒకటి. ఈ చెట్టు నీడన చేరిన వారికి ఆకలిదప్పులుండవు. పూర్వజన్మస్మరణ కూడా కలుగుతుంది. ఇతర వృక్షాలు తాము కాచిన ఫలాలు మాత్రమే ప్రసాదిస్తాయి. అలాకాక కల్పవృక్షం కోరుకున్న ఫలాలన్నింటినీ ప్రసాదిస్తుంది. అటువంటి కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించి నాలుగో రోజు ఉదయం తిరుమాడ వీధులలో భక్తులకు తనివితీరా దర్శనమిస్తాడు శ్రీనివాసుడు. రాత్రి 8 నుండి 10 గంటల వరకు సర్వభూపాల వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిస్తారు.

# స్కూల్స్, హాస్పిటల్స్‌కి 100మీ. దూరంలో వైన్ షాప్స్..

అమరావతి,అక్టోబర్4 (ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతన మద్యం విధానాన్ని తీసుకొచ్చిన నేపథ్యంలో ఇకనుంచి ప్రైవేటు వ్యాపారులు కాకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యాన్ని విక్రయించనుంది. విద్యాసంస్థలు, ఆధ్యాత్మిక స్థలాలు, ఆసుపత్రులకు 100 మీటర్ల అవతలనే మద్యం దుకాణాలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మంగళవారం నుంచే ఈ విధానాలన్నీ అమలులోకి వచ్చాయనీ, ఆంధ్రప్రదేశ్ బేవరేజెస్ కార్పోరేషన్ లిమిటెడ్(ఏపీబీసీఎల్) తెలిపింది. అదేవిధంగా, మద్యం దుకాణాలు సైతం గతంలో కంటే తక్కువ ఉండేట్లు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందుకనుగణంగా గతంలో ఉన్న 4,380 మద్యం షాపులకు గానూ, ప్రస్తుతం 3,500 షాపులకు కుదించారు. విడతల వారీగా మద్యాన్ని నిషేదిస్తామన్న ప్రభుత్వం ఈ విధంగా మద్య నిషేధానికి శ్రీకారం చుట్టిందని చెప్పవచ్చు. రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ ఎం ఎం నాయక్ మాట్లాడుతూ.. ఆసుపత్రులు, ఆధ్యాత్మిక ప్రాంతాలు, విద్యాసంస్థలకు దూరంగా మద్యం షాపులు ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన అన్నారు. మద్యం అమ్మకాల్లో నిరుద్యోగులకు కూడా ప్రభుత్వం ఉపాధినిస్తుంది. 21 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వయస్సున్న వారిని ఔట్‌సోర్సింగ్ విధానంలో ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. మద్యం షాపుల పని గంటలను కూడా ప్రభుత్వం కుదించింది. ఇంతకు ముందు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం దుకాణాలు తెరిచి ఉండగా, ప్రస్తుతం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు టైమింగ్‌ను కుదించారు.

# మారుతున్న విజయవాడ రూపురేఖలు

**స్మార్ట్ సిటీగా అభివృద్ధికి ప్రణాళికలు**

విజయవాడ,అక్టోబర్4 (ఆర్ఎన్ఎ): ఎపికి రాజధానిగా కాకపోయినా విజయవాడ గతంతో పోలిస్తే అన్ని రంగాల్లోనూ ముందుకు దూసుకుని పోతోంది. వ్యాపార వాణిజ్యరంగాల్లో ముందుండడంతో పాటు, క్లీన్ సిటీగా అవతరిస్తోంది. స్వచ్ఛభారత్ కింద సిటీని బాగా పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారు. విభజన తరవాత పాలన ఇక్కడి నుంచే సాగించడంతో విజయవాడ రూపురేఖలు మారాయి. గతంలో ఉన్న విజయవాడకు ఇప్పటి విజయవాడకు పోలికన్నది లేకుండా మంచి మార్పులను చోటుచేసుకుంది. దీంతో తాత్కాలికంగా అయినా నవ్యాంధ్ర రాజధానికి కేంద్రంగా ఉన్న విజయవాడ నగరం రూపురేఖలు మారుతున్నాయి. బెజవాడ బ్రాండ్ ఇమేజ్‌ను మార్చాలని గతంలో చంద్రబాబు పలుమార్లు కోరారు. పారిశుద్ధ్య విభాగంలో ఆధార్ నెంబరు అనుసంధానించి బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేస్తున్నారు. సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగంలో విజయవాడ నగరపాలక సంస్థకు జాతీయ స్థాయిలో గుర్తింపు అవార్డు దక్కాయి. దాదాపు 0.5మెగావాట్ల సౌరశక్తి ఉత్పత్తి చేసి మరో 5మెగావాట్లకు ప్రణాళికలు రూపొందించింది. దేశంలోనే తొలిసారిగా విజయవాడ నగరంలో డిజిటల్ డోరు నెంబర్లు ఇచ్చి అమలు పరిచారు. జీపీఎస్ ద్వారా నేరుగా ఇంటి చిరునామా కనుగొనే స్థాయిలో ఏర్పాటు చేసిన దీనకి అవార్డు దక్కింది. భవన నిర్మాణాలకు అనుమతులు జారీ చేసే ప్రక్రియను ఆన్‌లైన్ చేసి పారదర్శకతకు శ్రీకారం చుట్టారు. దేశంలోనే ప్రథమంగా పలు పథకాలు ప్రవేశపెట్టి అవార్డులు అందుకున్న విజయవాడ నగరపాలక సంస్థ మరో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. దేశంలోనే తొలిసారిగా ఎల్‌ఈడీ ట్యూబ్ లైట్లను వీధి దీపాలుగా ఏర్పాటు చేస్తున్నారు. ఎల్ఇడితో విద్యుత్తు వినియోగం చాలా తక్కువగా ఉంటుంది. వీటని ఒకే ప్రాంతం నుంచి రిమోట్ ద్వారా నిర్వహించే వెసులు బాటు ఉంటుంది. దీనికి నగరపాలక సంస్థ సన్నాహాలు చేస్తోంది. వీఎంసీకి ప్రత్యేక యాప్ రూపొందించి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ఓడిఎఫ్‌గా విజయవాడ ప్రకటించారు. ఈ జాబితాలో ఇప్పుడు ఎల్‌ఈడీ ట్యూబ్‌లైట్ల పథకం చేరనుంది. నగరంలో దాదాపు 47వేల వీధిలైట్ల అవసరం ఉంది. కూడళ్లలో గతంలో హైమాస్ట్ లైట్లు ఉండేవి. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ అవే వినియోగిస్తున్నారు. వీధిలైట్లు మాత్రం బల్బులను ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు 31 వేల ఎల్‌ఈడీ బల్బులు మార్చుతున్నారు. 90శాతం వరకు పూర్తి కావచ్చింది. ఇప్పటికే విశాఖనగరంలోని వీధిలైట్లను కమాండ్ కంట్రోల్ రూం నుంచి ఆన్, ఆఫ్ చేస్తున్నారు. విజయవాడ దుర్గమ్మ గుడి వద్ద ఫ్లై ఓవర్ అందుబాటులోకి వస్తే ఇక మరింతగా రవాణా సౌకర్యం పెరగనుంది.

## విద్యుత్ కొరతలు నిజమే అన్న బొత్స

విజయవాడ,అక్టోబర్4 (ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉన్న మాట వాస్తవమేనని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాటాడుతూ విద్యుత్ సమస్యపై కేంద్రం, పక్క రాష్ట్రాలతో చర్చలు జరుపుతున్నామన్నారు. ప్రభుత్వంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ చేసిన వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కొత్త పాలసీ అమల్లోకి వచ్చాక ఇసుక కొరత తగ్గిందన్నారు. గ్రామ సచివాలయాల ఆలోచన చంద్రబాబుకు వస్తే.. ఎందుకు అమలు చేయలేదని మంత్రి ప్రశ్నించారు. ఆస్పత్రుల దగ్గర క్యాంటీన్లు ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. మునిసిపల్ ఎన్నికలకు కసరత్తు చేస్తున్నామని మంత్రి బొత్స తెలిపారు.

# పారిస్‌లో కత్తితో దుండగుడి హల్‌చల్

**-పోలీస్ అధికారి మృతి..దుండగుడి కాల్చివేత**

పారిస్,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): పారిస్‌లోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో దుండగుడు కత్తితో కలకలం సృష్టించాడు. ఆగంతకుడు కత్తితో దాడి చేసిన ఘటనలో ఓ పోలీస్ అధికారి చనిపోగా..మరో వ్యక్తికి గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన పోలీసులు కాల్పులు జరిపి దుండగుడిని హతమార్చారు. పారిస్‌లోని నోత్రె డామె కేథడ్రల్‌కు సమీపంలో ఈ ఘటన జరిగింది. ఈ దాడి నేపథ్యంలో భద్రతాదళాలు పరిసర ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. దుండగుడి దాడికి గల కారణాలపై పోలీస్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. దుండగుడు ఎవరన్నది కూడా ఆరా తీస్తున్నారు. ఈ ఘటనతో నగరంలో హై అలర్ట్ అయ్యారు.

# గిరిజనుల్లో పోషకాహార లోపాలను అధిగమించాలి

**-అధికారులకు మంత్రి సత్యవతి రాథోడ్ ఆదేశాలు**

హైదరాబాద్,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): గిరిజన ప్రాంతాల్లోని మహిళలు, పిల్లల్లో పోషకాహారం లోపం అధిగమించేలా అంగన్ వాడీలు, గిరిజన అధికారులు కలిసి పని చేయాలని మంత్రి సత్యవతి రాథోడ్ ఆదేశించారు. గిరిపోషణ్ ద్వారా 6 కోట్ల రూపాయలతో 414 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 13 వేల మందికి లబ్ది చేకూర్చామని, ఈ క్రమంలో వారికి పోషకాహారం అందిస్తున్నామన్నారు. గిరిపోషణ్ కార్యక్రమాన్ని ఏజెన్సీ ప్రాంతాలన్నింటికీ విస్తరించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి గిరిజనులకు లబ్ది చేకూరేలా చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. గిరిపోషణ్ పథకం పని తీరుపై, పథకంలోని లోపాలపై మంత్రి సత్యవతి రాథోడ్ అధికారులతో దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌లో సమీక్ష నిర్వహించారు.

గిరిపోషణ్ పథకం అమలులో ఇబ్బందులను పరిష్కరిస్తామని, కళ్యాణలక్ష్మి పథకం అమలు కోసం రూ.350 కోట్లకు పరిపాలనా అనుమతులు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసిందని ఆమె తెలిపారు. మహిళలు, చిన్నారుల పోషణ కోసం కేంద్రం ప్రభుత్వం ఇస్తున్న నిధుల కంటే రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువ ఖర్చు చేస్తుందని మంత్రి చెప్పారు. గిరిపోషణ్ పథకానికి అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చిన్నారులను కన్న తల్లుల్లా చూసుకోవాలని మంత్రి సత్యవతి సూచించారు.

# టీడీపీలోనే క్రిమినల్స్ ఎక్కువ

**నేరస్థులను వెనకేసు కొస్తున్న బాబు**
**డిప్యూటీ సీఎం అంజాద్ బాషా**

కడప,అక్టోబర్ 4 (అంఎన్ఎ): క్రిమినల్ కేసులు నమోదైన టీడీపీ కార్యకర్తకు మాజీ సీఎం చంద్రబాబు వంత పాడటం విడ్డురంగా ఉందని డిప్యూటీ సీఎం అంజాద్ బాషా దుయ్యబట్టారు. గత ఐదు సంవత్సరాలలో అవినీతికి కేర్ ఆఫ్ అడ్రెస్‌గా టీడీపీ వ్యవహరించిందని.. దద్దమ్మల పార్టీ ఏదైనా ఉందంటే అది టీడీపీ మాత్రమేనని అంజాద్ బాషా విమర్శించారు. టీడీపీ పాలనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను చంద్రబాబు తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని గుర్తు చేశారు. జిల్లాలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే రఘురామి రెడ్డి, పార్లమెంటరీ అధ్యక్షుడు సురేశబాబులతో కలిసి గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మైదుకూరు బి.మఠంకు చెందిన టీడీపీ కార్యకర్త ముద్దు కృష్ణంనాయుడుపై వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు దాడులు చేశారని చంద్రబాబు అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

ముద్దు కృష్ణంనాయుడుపై ఎన్నో క్రిమినల్ కేసులు నమోదయ్యాయని, అలాంటి వ్యక్తికి బాబు మద్దతు ఇవ్వడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసిన కృష్ణంనాయుడిని మైదుకూరు టీడీపీ ఇంచార్జ్ పుట్టా సుధాకర్ యాదవ్ ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసి, ఇప్పుడు ప్రతిపక్షనేతగా ఉన్న చంద్రబాబు మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. ముద్దు కృష్ణంనాయుడుపై ఉన్న ఆరోపణలు రుజువు చేస్తామని స్పష్టం చేశారు. గ్రామంలో జరిగిన చిన్న ఘర్షణపై సీఎం స్పందించాలని కోరడం విడ్డురంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలియజేశారు. గతంలో టీడీపీలో ఉన్న వారికి కూడా ఉద్యోగాలు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందని అన్నారు. సచివాలయ ఉద్యోగాల్లో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించిందని, సీఎం జగన్‌కు పెరిగిపోతున్న ప్రజాదరణ ఓర్వలేకే టీడీపీ అనవసర ఆరోపణలు చేస్తోందన్నారు.

## ముంబై వర్లి నుంచి ఆదిత్య నామినేషన్

**ఆస్తి మొత్తం 16 కోట్ల 5 లక్షలు.**

ముంబై,అక్టోబర్4 (ఆర్ఎన్ఎ): శివసేన నేత ఆదిత్య థాకరే ఇవాళ నామినేషన్ దాఖలు చేశారు. ముంబైలోని వర్లీ సీటు నుంచి ఆదిత్య పోటీ చేయనున్నారు. ఈనెల 21న జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన పార్టీ చీఫ్ ఉద్దవ్ థాకరే కుమారుడు ఆదిత్య థాకరే పోటీలో నిలుస్తున్నారు. ముంబై ఓటర్లు ఆదిత్యకు మద్దతు ఇస్తారని ఆశిస్తున్నట్లు ఉద్దవ్ తెలిపారు. తమ కుటుంబంలో సామాజిక సేవ చేసే సాంప్రదాయం ఉందని, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకూడదని ముందు అనుకున్నాం, కానీ పరిస్థితులు మారాయి, నియోజకవర్గ ప్రజల కోసం ఆదిత్య ఎప్పుడూ అండగా ఉంటారని భావిస్తున్నట్లు ఉద్దవ్ తెలిపారు. భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేయబోనని శివసేన చీఫ్ ఉద్దవ్ స్పష్టం చేశారు. నామినేషన్ దాఖలుకు ముందు ఇవాళ ముంబైలో భారీ రోడ్‌షో నిర్వహించారు. నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్లే ముందు ఆదిత్య.. ఇంట్లోనే శివసేన వ్యవస్థాపకుడు, తాతయ్య బాలా సాహెబ్ థాకరే ఫోటో వద్ద ఆస్సులు తీసుకున్నారు.

# బాధితులను పరామర్శించే క్రమంలో అపశృతి

**నదిలో పడిపోయిన ఎంపి...రక్షించిన సిబ్బంది**

పాట్నా,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): బిహార్‌లోని పాట్నాకు సమీపంలో బిజెపి ఎంపి, మాజీ కేంద్ర మంత్రి రామ్ క్రిపాల్ యాదవ్ బోటు ఒరగడంతో దాద్రా నదిలో పడిపోయాడు. బిహార్‌లో భారీ వర్షాలు కురుస్తుండడంతో లోతట్టు ప్రాంతాలు నీటిలో మునిగిపోయాయి. దీంతో వరద బాధితులను పరామర్శించేందుకు రామ్ క్రిపాల్ పడవకు బదులుగా ట్యూబ్‌లతో తయారు చేసిన బోటులో నదిలో ప్రయాణించాడు. నదిలో కొద్ది దూరం వెళ్లిన తరువాత బోటు తిరగబడడంతో అతడు నీటిలో పడిపోయాడు. వెంటనే అనుచరులు, బోటు నిర్వహకులు అతడిని రక్షించారు. కొంచెం సేపు శ్వాస తీసుకోవడానికి ఎంపి తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. గత పార్లమెంట్ ఎన్నికలలో పాటలిపుత్ర నియోజకవర్గం నుంచి యాదవ్ గెలుపొందారు. భారీ వర్షాలు కురుస్తుండడంతో 15 జిల్లాలు నీటిలో మునిగిపోయాయి. ప్రభుత్వాధికారులు, ఎంపిలు, ఎంఎల్ఎలు సహాయక చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు తరలిస్తున్నాయి. భారీ వర్షాలు రావడంతో వివిధ కారణాలతో బిహార్‌లో 40 మంది చనిపోయారని ఆ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది.

# నిజాం సొమ్ములో ఔరంగాబాద్ నీటి కష్టాలు తీర్చాలి

**గాంధీ జపం తప్ప ఆచరలో మోడీ సర్కార్ విఫలం**
**ఎన్నికల ప్రచారంలో మండిపడ్డ ఓవైసీ**

ఔరంగబాద్,అక్టోబర్4 (ఆర్ఎన్ఎ): ప్రస్తుత ఎన్డీఏ సర్కారు.. మనసులో గాడ్సేని పెట్టుకుని, పెదాల చివరి నుంచి గాంధీ గురించి మాట్లాడుతోందని హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. మహాత్ముడిని హత్య చేసిన గాడ్సేనే వాళ్లు హీరోలా ఆరాధిస్తున్నారన్నారు.

గాడ్సే నాడు గాంధీజీని మూడు బుల్లెట్లతో చంపితే.. నేటి పాలకులు ప్రతి రోజూ ప్రజల్ని చంపుతున్నారంటూ ఆవేశంగా మాట్లాడరు. మహాత్మ గాంధీ జయంతి నాడు హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ.. మోడీ సర్కార్ పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర ఎన్నికల్లో 28 స్థానాల నుంచి పోటీ చేస్తున్న ఎంఐఎం తన ప్రచారంలో భాగంగా ఔరంగబాద్ లో బుధవారం రాత్రి సభ నిర్వహించింది. ఈ సందర్భంగా అసదుద్దీన్ ఒవైసీ ఆవేశంగా ప్రసంగించారు.

బీజేపీ నేతలు గాంధీజీ పేరు చెప్పుకొంటూ తమ దుకాణం నడుపుకొంస్తున్నారని ఒవైసీ అన్నారు.

దేశ ప్రజల్ని ఆ మహాత్ముడి పేరు చెప్పి మాయ చేస్తున్నారని ఆరోపించారు. మహాత్మ గాంధీ అహింసా సిద్ధాంతాన్ని ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలన్నారు. రైతుల కోసం గాంధీజీ స్వాతంత్ర్య పోరాట సమయంలోనే ఉద్యమించారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు.

చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఆస్తుల కేసులో 70 ఏళ్ల పోరాటంలో పాక్ పై భారత్ విజయం సాధించిందని, లండన్ కోర్టు దాదాపు 450 కోట్లు భారత్‌కు చెందుతాయని తీర్పు ఇచ్చిందని అన్నారు. ఈ సొమ్ములో కొంత భాగం నిజాం వారసులకు పోతుందని, మిగిలిన దాన్ని ఔరంగబాద్ ప్రజల తాగు నీటి కష్టాలు తీర్చడానికి వాడాలని కోరారాయన.

## తన పెళ్లికి జగన్‌ను ఆహ్వానించిన చందనాదీప్తి

హైదరాబాద్,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): యువ ఐపీఎస్ ఆఫీసర్, మెదక్ జిల్లా ఎస్పీ చందనాదీప్తి .. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఇవాళ కలిశారు. అతిత్వరలో హైదరాబాద్ లో జరగనున్న తన పెళ్లి వేడుకకు హాజరుకావాలని చందనా దీప్తి సీఎం జగన్ దంపతులను ఆహ్వానించారు. వైఎస్ జగన్ దగ్గరి బంధువు అయిన బలరాంతో చందనాదీప్తి వివాహం గత నెలలో నిశ్చయమైంది. తన పెళ్లికి రావాలంటూ గత నెలలో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు చందనాదీప్తి. తల్లిదండ్రులతో కలిసి బేగంపేటలోని సీఎం క్యాంప్ ఆఫీస్ లో కేసీఆర్ దంపతులను ఆమె కలుసుకున్నారు. చందనాదీప్తి ఇపుడు మెదక్ జిల్లా ఎస్పీగా ఉన్నారు. విధుల్లో భాగంగా ఆమె సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటారు. ఆమెకు సామాజిక మాధ్యమాల్లోమంచి పేరుంది. వరంగల్ లో పుట్టిన హైదరాబాద్ లో పెరిగారు చందనాదీప్తి. ఐఐటీ ఢిల్లీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ పూర్తిచేశారు. 2012 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన చందనాదీప్తి.. హైదరాబాద్ సహా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పోలీస్ ఆఫీసర్ గా విధులు నిర్వర్తించారు.

చందనాదీప్తి భరతనాట్యం కళాకారిణి. మూడేళ్ల వయసులోనే తాను మొదటి ప్రదర్శన చేసినట్టుగా ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.

# చిన్నారిపై అత్యాచారం కేసులో నిర్లిప్తత

## మానవహక్కులు సంఘంలో పిటిషన్

హైదరాబాద్,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): మూడున్నర సంవత్సరాల పసిపాప పై జరిగిన అత్యాచారం కేసులో మియాపూర్ పోలీసులు సక్రమంగా విచారణ చేయడం లేదంటూ వచ్చిన ఫిర్యాదుతో బాలల హక్కుల సంఘం మావన హక్కుల కమిషన్ (హెచ్ఆర్సి)లో పటిషన్ దాఖలుచేసింది. మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దీప్తినగర్‌లో ఉన్న కుకూబర్డ్స్ పాఠశాల జిమ్నాసిస్ట్ కిరణ్‌సాయి జూన్26వ తేదీన అత్యాచారం చేయగా అతని సోదరి స్కూల్ ప్రిన్సిపాల్, యజమాని దీపిక నిందితుడికి సహకరించిందన్నారు. ఆమెను సహనిందితురాలిగా అరెస్ట్‌చేయడం లేదని, అలాగే తనపై అత్యాచారం చేసింది గడ్డం అంకుల్ అని పోలీసులకు పాప చెప్పగా నిందితుడికి గుండు, క్షవరం చేయించి ఐడెంటిఫికేషన్ పరేడ్ పోలీస్‌స్టేషన్‌లో చేయించారని అన్నారు. పాప వంటిపై ఉన్న రక్తపు మరకల దుస్తులు జూన్ 30న ఇస్తే జూలై 14న ఫోరెన్సిక్‌కి పంపామని స్వయంగా పోలీసులే చెప్పారని బాలల హక్కుల సంఘం గౌరవాధ్యక్షుడు అచ్యుతరావు పేర్కొన్నారు. ఇంత ఆలస్యాన్ని చూస్తే మియాపూర్ పోలీసులు పక్షపాతం లేకుండా దర్యాప్తు జరుపుతారనే నమ్మకం పోయిందని బాలిక తల్లిదండ్రులు బాలల హక్కుల సంఘానికి పిర్యాదు చేశారని అన్నారు. ఈ ఘటన పై విచారణకు ఆదేశాలివ్వాలని మానవహక్కుల కమిషన్‌లో పిటిషన్ వేసినట్టు ఆయనవెల్లడించారు. మూడున్నర సంవత్సరాల పాప అత్యాచార ఘటనలో నిజాయితీగా దర్యాప్తు జరపాలని, మరకల దుస్తులు పోరెన్సిక్‌కి పంపడంలో ఆలస్యం చేసిన వారి పై చర్యలతో పాటు సహనిందితురాలు దీపికను వెంటనే అరెస్ట్ చేయాలని బాలల హక్కుల సంఘం డిమాండ్ చేసింది.

# మంగళగిరిలో డ్రగ్స్ కలకలం!

### విద్యార్థులు టార్గెట్‌గా సరఫరా

గుంటూరు,అక్టోబర్4 (ఆంఎన్ఎ): ఏపిలో డ్రగ్స్ కలకలం సృష్టించింది. విద్యార్థులను టార్గెట్ చేసి డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, ఓ కార్పొరేట్ కాలేజీలో గంజాయి వ్యవహారం వెలుగు చూసింది. కార్పోరేట్ కాలేజ్ అడ్డగా చేసుకొని డ్రగ్స్ కి కొంత మంది స్టూడెంట్స్ అలవాటు పడ్డారని..ఆ మత్తులో వారు విచక్షణ కోల్పోయి కొన్ని అఘాయిత్యాలకు పాల్పవడుతున్నారన్న ఆరోపణ రావడంతో రంగంలోకి దిగిన పోలీసులు నలుగురు విద్యార్థుల రక్త నమూనా సేకరించారు. అయితే రక్త పరీక్షలో డ్రగ్స్ నమూనా గనకతేలినట్లయితే వారిని అరెస్ట్ చేసే అవకాశం కూడా ఉందంటున్నారు. కాగా, నవ్యాంధ్ర రాజధానికి అమరావతికి మంగళగిరి అత్యంత కీలకమైన ప్రాంతం... సీఎం, మాజీ సీఎం, మంత్రులు, కీలక అధికారులు.. ఇలా ప్రభుత్వ వ్యవహారాలు మొత్తం మంగళగిరి కేంద్రంగానే జరుగుతున్నాయి. ఇలాంటి ప్రాంతంలో డ్రగ్స్ వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. గుంటూరు జిల్లా మంగళగిరి కేంద్రంగా గంజాయి, మత్తు పదార్థాల రవాణా కొనసాగుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఇటీవల టోల్ గేట్ వద్ద కూడా గంజాయి ఇతర మత్తు పదార్థాలను రవాణా జరుగుతుండగా పట్టుకొని వాటిని స్వాదీనం చేసుకున్నారు.

# హుజూర్‌నగర్‌లో గెలుపు పద్మావతిదే

### -కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ కుంతియా

హైదరాబాద్,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో.. రాజకీయ పార్టీలు ఏ అభ్యర్థికి టిక్కెట్ ఇచ్చినా.. కాంగ్రెస్‌కు ఎవరు పోటీ కాదని, కచ్చితంగా ఉత్తమ్ పద్మావతి రెడ్డి భారీ మెజారిటీతో గెలుస్తారని ఏఐసీసీ ఇంఛార్జ్ ప్రధాన కార్యదర్శి ఆర్‌సీ కుంతియా అన్నారు. అక్కడ తమ పార్టీ విజయం సాధించి తీరు÷-దన్నారు. గురువారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన బీజేపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీ నేతలు ప్రచారం కోసం గాంధీజీ కళ్ళద్దాలను, గాంధీ పేరును వాడుకుంటారు కానీ, గాడ్సేకు గుడి కడతారని ఎద్దేవా చేశారు. పార్లమెంటు ఎన్నికలలో టీఆర్ఎస్ ఏడు ఎంపీ సీట్లు ఓడిపోవ డంతో.. హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో ఆ పార్టీ భయ పడుతుందని కుంతియా వ్యాఖ్యానించారు. అందుకే సీపీఐ మద్దతు కోరుతోందని అన్నారు. ఇంతకు ముందు అసెంబ్లీ ఎన్నికలలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కోదాడలో కుట్ర చేసి ఓడిం చిందని కుంతియా పేర్కొన్నారు. హుజూర్‌నగర్‌లో టీఆర్ఎస్ ఓడిపోతుందనీ, తమ పార్టీ నేతలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జానారెడ్డి, రేవంత్ రెడ్డిలు ప్రచారం చేసి పద్మావతి రెడ్డిని గెలిపిస్తారన్నారు.

# పత్తి రైతులకు నష్టం లేకుండా కొనుగోళ్లు

### కొనుగోళ్లపై ఎమ్మెల్యే జోగురామన్న హామీ

ఆదిలాబాద్,అక్టోబర్ 4(ఆర్ఎన్ఎ): ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో పత్తిరైతులకు మద్దతు ధరలు చెల్లించి కొనుగోళ్లకు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. ఈ యేడు మరింత పక్కగా ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. రైతులు తమ పత్తిని, ఇతర పంటలను ఎక్కడైనా విక్రయించుకోవచ్చని, ఆవిషయంలో ఎలాంటి అడ్డంకులు ఉండవని చెప్పారు. రైతుల అభీష్టం మేరకు పత్తి కొనుగోళ్లు జరుగుతాయని, సౌకర్యాలు, తూకంలో, ధరలో దగా వంటివి లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. దీనికితోడు కొనుగోళ్లను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తారు. మార్కెట్ కొనుగోళ్లలో పారదర్శకత కోసం వీటిని ఏర్పాటు చేస్తున్నారు. అలాగే రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా స్వయంగా పర్యవేక్షించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. రైతులకు రూ.5కే భోజనంతో పాటు ఉచితంగా తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. వ్యాపారులు తేమను సాకుగా చూపుతూ యార్డులో ఒకశాతం, జిన్నింగులో మరో రకం తేమ శాతం నమోదు చేస్తూ ధరలో భారీగా కోతవిధిస్తున్నారని రైతులు వాపోయారు. యార్డుల్లోనూ సమయపాలన పాటించక పోవడంతో రైతులకు అదనపు భారం పడుతోందని, నిరంతరంగా సమయంతో సంబంధం లేకుండా యార్డుకు వచ్చిన వాహనాలను తూకం చేసి ధర నిర్ణయించాలని పేర్కొన్నారు. ప్రధానంగా వ్యాపారులు వాడే తేమ యంత్రాలపై అనుమానాలు ఉన్నాయని, నిపుణల సమక్షంలో యంత్రాలను పరిశీలించి మార్కెట్‌యార్డు వారు సరఫరా చేసినవే వాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. సహజంగా వచ్చే తేమను పత్తి కొనుగోళ్లప్పుడు నిబంధనల సాకుతూ కొనుగోళ్లకు నిరాకరించడం తగదని పేర్కొన్నారు. పత్తిని నేరుగా విక్రయించేవారికి దళారులతో సంబంధం లేకుండా చూడాలన్నారు. ఆన్‌లైన్ విధాన కొనుగోళ్లపై రైతులకు అవగాహన కల్పించాలని, ఈ విధానంలో రైతులకు నష్టం జరగకుండా తగుచర్యలు తీసుకోవాలని కోరారు. కొనుగోళ్లలో మోసాలు జరగకుండా రైతులతో కూడిన కమిటీని వేయాలన్నారు. తేమ నిబంధనలు గతంలాగే ఉంటాయని రైతులు గమనించాలని అధికారులు సూచించారు. పత్తిని నేరుగా విక్రయించే రైతులకు దళారుల బెడద లేకుండా చూడాలని, వారి నరకును ఖరీదుదారులకు విక్రయించి డబ్బులు ఇప్పించాలని ఆదేశించారు. ఈ విషయంలో మార్కెటింగ్ అధికారులు సహకరించకపోతే ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు. తేమ యంత్రాలను నిపుణుల

చేత పరిశీలన జరిపించాకే పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు.

# గోదావరిలో బోటు వెలికితీత పనులు నిలిపివేత

### ప్రతికూల వాతావరణంతో నిలిచిపోయిన పనులు

రాజమండ్రి,అక్టోబర్4 (ఆర్ఎన్ఎ): తూర్పుగోదావరి జిల్లా కచ్చులూరు దగ్గర గోదావరిలో మునిగిపోయిన రాయల్ విశిష్ట బోటు వెలికితీత ప్రశ్నార్థకంగా మారింది. ప్రతికూల వాతావరణంతో బోటు వెలికితీత పనులు నిలిచిపోయాయి. భారీ వర్షం కారణంగా గోదావరిలో వరద ప్రవాహం పెరగడంతో బోటు వెలికితీత చర్యలకు ఆటంకమేర్పడింది. మరోవైపు నాలుగు రోజులుగా బోటును వెలికితీసేందుకు చేసిన ప్రయత్నాల్లో ఎటువంటి పురోగతి కనిపించలేదు. గాలింపు బృందం ఇప్పటి వరకు బోటు ఆచూకిని కనిపెట్టలేకపోయింది.

ధర్మాడి సత్యం ఆధ్వర్యంలో 25 మంది గజఈతగాళ్ల బృందం బోటును బయటకు తీసేందుకు ప్రయత్నించింది. ఇందులో భాగంగా రెండో రోజు రెండు లంగర్లు వేశారు. బోటును లాగే క్రమంలో లంగరు కొక్కెం తెగిపోయింది. బోటు చిక్కినట్టే చిక్కి జారిపోయింది. బురదలో కూరుకుపోవడం వల్ల బోటు జాడ కనుగొనడం కష్టంగా మారింది. మూడో రోజు కూడా ఫలితం ఇవ్వలేదు. వాతావరణం అనుకూలంగా లేకపోయినా బోటు వెలికితీత పనులు కొనసాగాయి. చివరికి గోదావరిలో ప్రవాహం పెరగడంతో పనులు నిలిపివేయకతప్పలేదు. బోటు వెలికితీత పనులు నామమాత్రంగా చేపట్టాని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. వర్షం కారణంగా నిలిచిపోయిన పనులను.. గోదావరిలో వరద ప్రవాహం తగ్గగానే తిరిగి ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు బోటును బయటకు తీయడం అసాధ్యమని కచ్చులూరు గ్రామస్తులు అంటున్నారు.

# సమస్యలు పరిష్కరించకుండా నిందలా?: డిసిసి

నిజామాబాద్,అక్టోబర్ 4(ఆర్ఎన్ఎ): రైతులకు రుణమాఫీ చేయని కేసీఆర్ మిషన్ భగీరథ, మిషన్ కాకతీయల పథకాలకు కోట్లు ఎలా కుమ్మరిస్తున్నారని డిసిసి చీఫ్ తాహిర్ బిన్ అన్నారు. తెలంగాణలో టిఆర్ఎస్‌కు అధికారం కట్టబెడితే చేసిందేమిటని అన్నారు. పాలించే దమ్ములేక సమాధానం చెప్పుకోలేక పోతున్నారని మండిపడ్డారు. మిషన్ కా కతీయ అవినీతికి అడ్డాగా మారిందటన్నారు. రైతులకు రుణాలు ఇవ్వలేని ముఖ్యమంత్రి కేసీఆర్, బతుకమ్మ పండుగకు మాత్రం నిధులు విడుదల చేసారని ఎద్దేవా చేశారు. పింఛన్లు, రెండు పడక గదుల ఇళ్లు, రైతు రుణమాఫీ అమలును ప్రభుత్వం సక్రమంగా అమలు చేయలేదన్నారు. కుటుంబ సంక్షేమం కోసం పథకాలు పెడుతున్నా రంటూ ఆరోపించారు. కేంద్రం నిధులను సైతం దోచుకు ంటున్నా రంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. తెలంగాణ ప్రజల సంక్షేమం కోరి సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇస్తే.. ప్రస్తుతం ఉద్యోగులకు కూడా సక్రమంగా జీతాలు చెల్లించలేని పరిస్థితి కొనసాగుతోందని అన్నారు.

# నిజాంసాగర్ ఆయకట్టు రైతులకు భరోసా

నిజామాబాద్,అక్టోబర్ 4(ఆర్ఎన్ఎ): నిజాంసాగర్ ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. శ్రీరాంసాగర్ నుంచి నీరు విడుదలతో పంటలకు ఢోకా లేదని అన్నదాతలు అంటున్నారు. సాగర్ నిండితే నిజామాబాద్ వ్యవసాయరంగానికి కళ ఎండితే వెలవెల అన్నానుడి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు.

మంజీర పరివాహక ప్రాంతం జిల్లాలో మొదలయ్యే నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాలు మొదలు నిజాంసాగర్ జలాశయం కింద ఉంటే నిజాంసాగర్, పిట్లం, బిచ్కుంద, బాన్సువాడ, బీర్కూరు, కోటగిరి, బోధన్ మండలాల్లో నదికి రెండు వైపులా ఒడ్డునకు ఆనుకుని 1.5లక్షల ఎకరాల వరకూ ఉంటుంది.

ఈ భూముల్లో రైతులు బోర్లు వేసి పంటలు సాగు చేసుకుంటారు. ప్రస్తుతం నదిలో గణనీయంగా వరద ప్రవాహం నమోదవుతున్న నేపథ్యంలో నీటి కొరత ప్రసక్తే లేకుండా సాగునీరు పంటలకు అందుతుంది. నిజాంసాగర్ జలాశయం అత్యంత స్వల్ప వ్యవధిలో నిండుతుందన్న నమ్మకం మరోసారి నిజమైంది. మంజీర నదిలోకి భారీ పరిమాణంలో నీటిని విడుదల చేసిన దాఖలాలు గతంలో ఉన్నాయి.

# 400 కేజీల గంజాయి స్వాధీనం

ఏలూరు,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): లారీలో అక్రమంగా తరలిస్తున్న 400 కేజీల గంజాయిని కొయ్యలగూడెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతం నుండి హర్యానాలోని ఫరీదాబాద్ కు 15 బస్తాలలో నింపిన 400 కేజీల గంజాయిని లారీలో అక్రమంగా

తరలిస్తుండగా.. కొయ్యలగూడెం పోలీసులు గుర్తించి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. లారీలో ఉన్న ఇద్దరు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు 80 లక్షల రూపాయలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. గంజాయిని స్వాధీనం చేసుకుని లారీని సీజ్ చేశారు. పట్టుబడిన నిందితులు ఇచ్చిన సమాచారంతో మరికొంతమంది స్మగ్లర్ల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## ఏపీ వార్తలు

# ఉల్లి రైతులకు ప్రోత్సాహం లేకనే ధరల మోత

### పంటలకు దూరంగా రైతాంగం

### బ్లాక్ మార్కెట్లపైనా దృష్టి పెట్టాలి

అమరావతి,అక్టోబర్4 (ఆంఎన్ఎ): అక్రమ నిల్వలపై విజిలెన్స్ దాడులను కొనసాగిస్తే తప్ప ఉల్లి ధరలను అడ్డుకోలేమని మార్కెట్ వర్గాలే చెబుతున్నాయి. అదీ నామ్‌కే వాస్తే కొనసాగిస్తున్న కారణంగా బ్లాక్ మార్కెట్‌లో ఉల్లి పేరుకుపోయిందన్న వాదనలు ఉన్నాయి. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడంతో వారు కూడా పంటలను తగ్గించారు. రాష్ట్రంలో ఉల్లి పంట రాయలసీమలో, అదీ కర్నూలు జిల్లాలో అధికంగా సాగవుతోంది. బహిరంగ మార్కెట్‌లో కిలో ఉల్లిపాయల ధర రూ.35-45 ఉన్నప్పుడే, కర్నూలు మార్కెట్‌లో ఉల్లి పండించిన రైతుల నుంచి క్వింటాలును రూ.వెయ్యి, 1,500కు కొనే దిక్కులేదు. ఆ ధరలు తమకు ఎంత మాత్రం గిట్టుబాటు కాదంటూ రైతులు పంటతో సహా రోడ్డెక్కి ఆందోళనలు చేసిన సందర్భాలు గత వారం పది రోజుల క్రితం కూడా చోటు చేసుకున్నాయి. రైతులకు ధరలు తగ్గిపోవడానికి సాగు విస్తీర్ణం ఏమన్నా ఇబ్బడి ముబ్బడిగా పెరిగిందా అంటే అదీ లేదు. కొన్నేళ్ల నుంచి ఉల్లి పంటకు ధరల్లేక సాగు క్రమేణ తగ్గుతోంది. మూడేళ్ల క్రితం సాధారణ సాగు విస్తీర్ణం 30 వేల హెక్టార్లు కాగా ఇప్పుడది 27 వేల హెక్టార్లకు క్షీణించింది. ఈ ఏడాది ఆ మేరకు కూడా సాగు కాలేదు. ఇప్పటికి 16 వేల హెక్టార్లలోనే సాగైంది. పైపెచ్చు ఈ మారు ఖరీఫ్ ప్రారంభంలో రాయలసీమలో తీవ్ర వర్షాభావం నెలకొనడంతో పాటు ఇటీవల కురిసిన వర్షాలకు ఉల్లి పంట దెబ్బతింది. ఆ మేరకు దిగుబడులూ తగ్గాయి. డిమాండ్-సప్లరు సహజ ఆర్థిక సూత్రం ప్రకారం ఉత్పత్తి తగ్గినప్పుడు రైతులకు ధర రావాలి. అది జరక్కపోగా ధరలు మరింత దిగజారాయి. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వ చొరవ నామమాత్రం. రైతులు పంటలు అమ్ముకున్నాక ఇప్పుడు క్వింటాలు రూ.4 వేలు-4,500 పలుకుతోంది. ఇది వ్యాపారులకు తప్ప రైతులకు లాభం చేకూర్చదు. ప్రతి ఏడాదీ సెప్టెంబర్-నవంబర్ మాసాల్లో బహిరంగ మార్కెట్‌లో ఆలూ, టమాటా, ఉల్లి ధరల పెరుగుదల అంశం ఏలికలకు తెలియందేమీ కాదు. ముందస్తు చర్యలు చేపడితే అటు రైతులకు ఇటు వినియోగదారులకు ఉభయతారకంగా ఉంటుంది. వ్యాపారులు, దళారుల పక్షం వహిస్తున్న ప్రభుత్వాలు అందుకు ససేమిరా అంటున్నాయి. దీనికి ఈ ఏడాది విపత్తుల తాకిడి తోడైంది. ఉల్లి అధికంగా సాగయ్యే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్నాటక తదితర రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదల మూలంగా భారీగా పంట దెబ్బతింది. రవాణా, సరఫరా నిలిచిపోయింది. అవకాశం ఎప్పుడు చిక్కుతుందా ఎప్పుడు దోపిడీ చేద్దామా అని కాచుక్కూర్చున్న వ్యాపారులకు, దళారులకు ఈ పరిస్థితి అనుకూలంగా మారింది. కృత్రిమ కొరత సృష్టించి వినియోగదారులకు రేట్లు పెంచేసి రెండు చేతులా పోగేసుకుంటున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన రాష్ట్ర వ్యవసాయ మిషన్ భేటీల్లో ఉల్లి రైతులకు ధర లేమిపై పెద్దగా స్పందించలేదు. ధరల స్థిరీకరణ నిధి ఏమైందో అంతుబట్టదు. వెంటనే మార్కెటింగ్ శాఖను రంగంలోకి దించి రైతుల నుంచి ఉల్లిని నేరుగా కొనుగోలు చేసినట్లయితే రైతులకు ధర దక్కేది. అదే సమయంలో ఆ నిల్వలను బహిరంగ మార్కెట్‌లో విడుదల చేస్తే ప్రజలకు ధరలు అందుబాటులో ఉండేవి. సర్కారు జోక్యంతో వ్యాపారులు దారికొచ్చేవారు.

# శ్రీవారి సేవకు గోదాదేవి మాలలు

### గరుడ సేవలో వినయోగించనున్న పూజారులు

తిరుమల,అక్టోబర్4 (ఆర్ఎన్ఎ): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడసేవలో స్వామివారికి అలంకరించేందుకు తమిళనాడులోని శ్రీవల్లిపుత్తూరు నుండి గోదాదేవి మాలలు గురువారం తిరుమలకు చేరుకున్నాయి. ముందుగా తిరుమలలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద శ్రీ పెద్దజీయంగార్ మఠానికి మాలలను తీసుకొచ్చారు. అక్కడ శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడినుంచి టీటీడీ అదనపు ఈవో ఏవీ ధర్మారెడ్డి ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల నడుమ ఆలయ మాడవీధుల గుండా ఊరేగింపుగా గోదాదేవి మాలలను శ్రీవారి ఆలయంలోకి తీసుకెళ్లారు.

శ్రీవారి ఆలయం ముందు గోదాదేవి మాలలకు టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, సివిఎస్వో గోపినాథ్ జెట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవల్లిపుత్తూరులో గోదాదేవికి అలంకరించిన మాలలను గరుడసేవ రోజు స్వామివారికి అలంకరించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. శ్రీవల్లివ్రుత్తూరులోని శ్రీరంగమన్నార్‌స్వామి వారి ఆలయానికి గోదాదేవి తండ్రి పెరియాళ్వార్ పుష్ప కంకైర్యం చేసేవారనీ, రంగనాథునిపై అత్యంత భక్తి కలిగిన గోదాదేవి పూలమాలలను మొదట తాను ధరించి తరువాత స్వామివారికి పంపేదని పురాణాల ద్వారా తెలుస్తోందన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన పెరియాళ్వార్ తన కుమార్తెను మందలించారని, ఆ తరువాత గోదాదేవి ధరించకుండా పంపిన మాలలను శ్రీరంగనాథుడు తిరస్కరించినట్టు పురాణాలు చెబుతున్నాయని అన్నారు. గోదాదేవి శ్రీవారి దేవేరి అయిన భూదేవి అవతారమని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ హరీంద్రనాథ్, వీఎస్‌వో మనోహర్, గురురాజారావు తదితరులు పాల్గొన్నారు.

# అనంత ఆస్పత్రిని అభివృద్ధి చేయండి

అనంతపురం,అక్టోబర్ 4(ఆంఎన్ఎ): అనంతపురం ఆస్పత్రిలో సదుపాయాలను మెరుగు పర్చాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవలి ఘటనల నేపథ్యంలో ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో 500 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు నిధులు విడుదల చేయాలని అన్నారు. బుధవారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో రోగులు ఇబ్బందులను పరిష్కరించాలని చెప్పారు. తంలో ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి 350 పడకల ఆసుపత్రి నుంచి 500 పడకల ఆసుపత్రిగా పెంచాలని, ఆయా శాఖలకు ఉద్యోగులను నియమిస్తామని ప్రకటించిందన్నారు.ఆయా శాఖల ఆధారంగా ఎంత వేతనాలు ఇవ్వాలో కూడా నిర్ణయిస్తూ జీవో 124ను విడుదల చేశారన్నారు.

# అనంత ఆస్పత్రిని అభివృద్ధి చేయండి

అనంతపురం,అక్టోబర్ 4(ఆర్ఎన్ఎ): అనంతపురం ఆస్పత్రిలో సదుపాయాలను మెరుగు పర్చాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవలి ఘటనల నేపథ్యంలో ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో 500 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు నిధులు విడుదల చేయాలని అన్నారు. బుధవారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో రోగులు ఇబ్బందులను పరిష్కరించాలని చెప్పారు. తంలో ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి 350 పడకల ఆసుపత్రి నుంచి 500 పడకల ఆసుపత్రిగా పెంచాలని, ఆయా శాఖలకు ఉద్యోగులను నియమిస్తామని ప్రకటించిందన్నారు.ఆయా శాఖల ఆధారంగా ఎంత వేతనాలు ఇవ్వాలో కూడా నిర్ణయిస్తూ జీవో 124ను విడుదల చేశారన్నారు.

# కార్మిక సంక్షేమాన్ని విస్మరించారు

గుంటూరు,అక్టోబర్ 4(ఆర్ఎన్ఎ): కార్మికుల హక్కులపై ప్రభుత్వాలకు శ్రద్ధ లేదని సిఐటియు జిల్లా నాయకులు అన్నారు. కార్మిక సంఘాల పోరాటం ఫలితంగా వారి కుటుంబాలకు న్యాయం జరిగిందన్నారు. అనేక ఫ్యాక్టరీల్లో ఇప్పటికీ రోజుకు 12 నుంచి 16 గంటలు పనిచేయిస్తూ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని అన్నారు. కనీస సౌకర్యాల కల్పనకు అన్ని కార్మిక సంఘాలూ ఐక్యంగా పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. కార్మికులను దోచుకోవడమే పనిగా సంస్థలు పనిచేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉపాధి కోసం ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోతున్నారని తెలిపారు. అణచివేతలు, దోపిడీలకు వ్యతిరేకంగా పోరాడుతామని అన్నారు. హక్కులను కాపాడుకునేందుకు ఐక్య ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

# కిల్లి కృపారాణి తనయుడి వివాహం

### దంపతులను ఆశీర్వదించిన సిఎం జగన్

విశాకపట్టణం,అక్టోబర్4 (ఆర్ఎన్ఎ): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్.. కేంద్ర మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు కిల్లి కృపారాణి కుమారుడి వివాహానికి హాజరయ్యారు. విశాఖపట్నంలో వీరి పెళ్లి వేడుక ఘనంగా జరగగా ఆ వేడుకకు హాజరయ్యారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్. పెళ్లి వేడుకకు హాజరైన జగన్ నూతన వధూవరులు క్రాంతికుమార్, అలేఖ్యలను ఆశీర్వదించారు.

ఈ వేడుకకు ముఖ్యమంత్రితో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, దేవాదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ హాజరయ్యారు.అలాగే రోడ్లు, భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాసు, వైఎస్సార్ శ్రీకాకుళం జిల్లా నాయకులు విరియా సాయిరాజ్, పేరాడ తిలక్ వివాహానికి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు.




కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి కుమారుడి వివాహ వేడుకలో దంపతులను ఆశీర్వదించిన సిఎం వైఎస్ జగన్

### ఉపాధి నిధులను విడుదల చేయండి-కేంద్రానికి చంద్రబాబు లేఖ

అమరావతి,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌కి ఏపీ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు లేఖ రాశారు. ఉపాధిహామీ పెండింగ్ బిల్లులు చెల్లింపునకు చొరవ తీసుకోవాలని ఆ లేఖలో పేర్కొన్నారు. 2014-2019 మధ్య ఉపాధి హామీ పథకాన్ని ఏపీ సమర్థంగా నిర్వహించిందన్నారు. కేంద్రం పెండింగ్ బిల్లులు రూ.1845 కోట్లు విడుదల చేసినా...రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా జోడించి ఇంకా విడుదల చేయలేదని విమర్శించారు. ఉపాధి హామీ నిబంధనలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, పెండింగ్ బిల్లులు చెల్లించకుండా నిధులు మళ్లించడం సరికాదని చంద్రబాబు అన్నారు.

# ఉల్లి ఘాటుకు కారణమెవ్వరు?

హైదరాబాద్, అక్టోబర్ 4:ధరల దాడి సామాన్యులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. గతంలో ఎప్పుడూ లేనంతగా కూరగాయలత ధరలతో పాటు నిత్యావసరాల ధరలు మోత మోగిస్తున్నాయి. ప్రధానంగా ఉల్లి ధరల ఘాటుతో సామాన్యుఉల విలవిల్లాడుతున్నారు. సాధారణ మార్కెట్లో దరలు కిలో 60కి అమ్ముతున్నారు. ఇక ఉప్పులు,ప్పులు, నూనెల దరలు చెప్పక్కర్లేదు. ఉల్లి సమీప భవిష్యత్తులో రూ.వందకు చేరినా ఆశ్చర్యం లేదన్న ఆందోళనలు సామాన్యులను బెంబేలెత్తిస్తున్నాయి. దీనికితోడు అల్లం వెల్లుల్లి, కారం,చింతపండు ధరలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. దసరా పండుగకు ముందు ధరల మోత సామాన్యులకు కళ్లు బైర్లు కమ్మేలా చేస్తున్నాయి. ఒక వైపు పంట పండించిన రైతులకు సరైన ధర పడక కన్నీరు పెట్టిస్తుండగా మరో వైపు బహిరంగ మార్కెట్‌లో వినియోగదారులకు రేటు ఘాటెక్కిస్తోంది. ఇటీవలికాలంలో ఇలాంటి వైపరీత్యం తరచూ ఎదురవుతోంది. దేశ వ్యాప్తంగా ఉల్లి ధరలు అమాంతం కొండెక్కాయి. కిలో రూ.50-60కి ఎగబాకింది. ధరలపై తొలుత ఉలుకు పలుకు లేని కేంద్రం, ప్రజల నుంచి రోజురోజుకు పెరుగుతున్న నిరసనల దరిమిలా కొన్ని ఉపశమన చర్యలను ప్రకటించింది. తొలుత ఎగుమతుల ధరను పెంచగా ఏ మాత్రం ఫలితం కనిపించలేదు. దీంతో ఆదివారం నుంచి ఎగుమతులను పూర్తిగా నిలిపేసింది. దేశీయంగా నిల్వలపై ఆంక్షలు విధించింది. ఇటు రాష్ట్ర ప్రభుత్వం సైతం నాలుగైదు రోజుల క్రితం స్పందించింది. కిలో రూ.25 చొప్పున రైతు బజార్లలో అమ్మిస్తామంది.

మచ్చుకు కొన్ని పెద్ద పెద్ద రైతు బజార్లలో అమ్మకాలు మొదలైనప్పటికీ ఒక్కొక్కరికి ఒక్క కిలో మాత్రమే, అదీ కొద్ది పరిమాణంలోనే సరఫరా చేస్తుండటంతో చాలా చోట్ల ప్రజలు కిలో ఉల్లిపాయల కోసం గంటల కొలది క్యూలైన్లలో నిరీక్షించాల్సిన విపత్కర పరిస్థితి ఎదురవుతోంది. రైతుల ఉత్పత్తులను ప్రభుత్వం కొనకుండా నగదు బదిలీ రూపంలో ఎంతోకొంత ఇచ్చి చేతులు దులుపుకునే ధోరణిని పైన మోడీ సర్కారు కింద రాష్ట్ర ప్రభుత్వాలు పాదుకొల్పుతుండటంతో రైతులు, వినియోగదార్లు ఇద్దరూ నష్టపోతున్నారు. వ్యాపారులు, దళారులు జేబులు నింపుకుంటున్నారు. దీంతో ధరలతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. ఉల్లి ధర వందరూపాయలకు చేరుకుంటుందని వ్యాపారులు ప్రజలను హెచ్చరిస్తున్నారు. దీంతో కొనుగోళ్లు పెంచుకుంటున్నారు. ఇది నిజమన్నట్లుగా గత నాలుగైదు రోజులుగా కిలోకు ఐదు రూపాయల చొప్పున పెరుగుతోంది. ఇటీవల 25 రూపాయలు ఉన్న ధరలు ఏకంగా 60కి చేరుకుంది. మార్కెట్‌లోకి వస్తున్న కొద్దిపాటి ఉల్లి ఆయా రాష్ట్రాల అవసరాలకే సరిపోతుండగా మిగతా వాటి కోసం దక్షిణాది రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి. ఫలితంగా డిమాండ్ పెరగడంతో ధరలు కూడా అమాంతం పెరుగుతున్నాయి. 2, 3 రోజుల కిందటి వరకు హైదరాబాద్ మార్కెట్‌లకు క్వింటాల్‌కు రూ. 2 వేల మేర పలికిన ధర ఏకంగా పెరిగింది. గతేడాదితో పోలిస్తే మార్కెట్‌లకు 45 వేల క్వింటాళ్ల మేర సరఫరా తగ్గిపోయింది. మరోవైపు కర్నూలు జిల్లాలో సైతం మార్కెట్‌లోకి ఉల్లి అంతగా రావడం లేదు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఉల్లి సాగు అనుకున్నంత జరగకపోవడంతో అవసరమైన సరఫరా లేక ధర పెరుగుతోంది. హైదరాబాద్ బహిరంగ మార్కెట్‌లో పది రోజుల కింద కిలో ఉల్లి రూ. 30 మేర ఉండగా ప్రస్తుతం రూ. .60కి చేరింది. ఇది మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెటింగ్ వర్గాలు అంటున్నాయి. పొరుగు రాష్ట్రాల్లో ఇటీవలి వర్షాలు, వరదల కారణంగా దిగుబడి తగ్గడంతో ధర కొండెక్కుతోంది. కేవలం పది రోజుల వ్యవధిలోనే కిలో ఉల్లి ధర రూ. 10 నుంచి రూ. 15 మేర పెరిగింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో రూ. 42 నుంచి రూ. 45 పలుకుతుండగా ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలో ప్రధానంగా ఉల్లి సాగు గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, మెదక్, రంగారెడ్డి, వికారాబాద్, కొంతమేర కామారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో సాగవుతుంది. ఈ ఏడాది ఆలస్యంగా కురిసిన వర్షాలు, భూగర్భ జలాల్లో భారీ తగ్గుదల కారణంగా 5,465 హెక్టార్లలోనే సాగైంది. దీంతో రాష్ట్రం నుంచి వస్తున్న ఉల్లితో పూర్తిస్థాయిలో అవసరాలు తీరే అవకాశం లేకపోవడంతో పొరుగు రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. సాధారణంగా రాష్ట్ర మార్కెట్‌లకు మహారాష్ట్రలోని షోలాపూర్, ఔరంగాబాద్, నాసిక్, కర్ణాటకలోని శివమొగ్గ, రాయచూర్ ప్రాంతాలు, మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నుంచి దిగుమతులు ఉంటాయి. అలాగే ఏపీలోని కర్నూలు నుంచి కూడా ఉల్లి సరఫరా అవుతుంది. అయితే ఈ ఏడాది మహారాష్ట్ర, కర్ణాటకల్లో కురిసిన కుండపోత వర్షాలతో ఉల్లి సాగుకు భారీ నష్టం వాటిల్లింది. దీంతో అక్కడ దిగుబడులు పూర్తిగా తగ్గాయి. ఇటీవలి వరదల కారణంగా ఉల్లి ధరలు పెరుగుతాయన్న సంకేతాల నేపథ్యంలో కేంద్రం ఇప్పటికే 50 వేల టన్నుల ఉల్లిని నాఫెడ్ ద్వారా సేకరించి నిల్వ చేసింది. వచ్చే నెలలో ఉల్లి ధరలు మరింత పెరిగిన పక్షంలో నిల్వచేసిన ఉల్లిని మార్కెట్‌లోకి అందుబాటులోకి తెచ్చి ధరను నియంత్రిస్తామని కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ, వినియోగదారులశాఖ మంత్రి రాంవిలాస్ పాశ్వాన్ ఇప్పటికే ప్రకటించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉల్లి వ్యాపారులు నిల్వలు పెంచకుండా చూడటం, వారిపై నియంత్రణ చర్యలు చేపడితేనే ఉల్లి ధరలకు కళ్లెంపడే అవకాశం ఉంది. లేదంటే ముమ్ముందు వంటింట్లో ఉల్లి ఘాటు తప్పేలా లేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దీనిని అధిగమించేందుకు బఫర్ స్టాక్ విడుదల చేసి, నల్లబజారుపై దాడులు చేయాలని సూచిస్తున్నారు.

## ప్రజావ్యతిరేక పాలనపైనే పోరు: సిపిఐ

జనగామ,అక్టోబర్4 (ఆర్ ఎన్ఎ): సామాజిక తెలంగాణ, సమగ్రాభివృద్దే ధ్యేయంగా పోరాడుతున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి తెలిపారు. హుజూర్‌నగర్‌లో అధి÷-కార టిఆర్ఎస్‌కు సిపిఐ మద్దతును సమర్థించుకున్నారు. రాష్ట్రంలోని ప్రజలను చైతన్యం చేస్తూ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. అలాగే తెలంగాణ ప్రజల్లో ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను చాటుతామని అన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో నియంతృత్వ పాలన కొనసాగుతోందన్నారు. ఎన్నికలు, ఉద్యమ సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని ముఖ్యమంత్రి కేసీఆర్ నేటికీ నెరవేర్చలేదన్నారు. అయితే అంతకు మించి కాంగ్రెస్ తీరు ఉందన్నారు. గత ఎన్నికల్లో సీట్ల విషయంలో కాంగ్రెస్ ఒంటెత్తు పోకడలకు పోయి సిపిఐని అవమానించిన విషయం మరవలేదన్నారు. తెలంగాణలో సామాజిక న్యాయం.. సమగ్రాభివృద్దే లక్ష్యంగా సీపీఐ రాష్ట్ర కమిటీ పోరాటాలు చేస్తోందని అన్నారు. ఇవాళ కాంగ్రెస్ నేతలు పలుకుతూ గతాన్ని విస్మరించిదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, పోరుబాట సాగుతుందన్నారు.

# కాంగ్రెస్ మొసలి కన్నీరు

## హుజూర్ నగర్‌లో వారికి ఓటమితప్పదు: కర్నె

నల్లగొండ,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ హయాంలో 35వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని మరచిన ఆ పార్టీ నేతలు టిఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మండిపడ్డారు. గతంలో వారు చేసిన తప్పులను సరిదిద్దుతూ రైతు సంక్షేమ కార్యక్రమాలను సిఎం కెసిఆర్ పెద్ద ఎత్తున చేపట్టారని అన్నారు. హుజూర్‌నగర్‌లో ఉత్తమ్చెప్తున్ ఆరోపణల్లో పసలేదన్నారు. కాంగ్రెస్ గెలిచి ఒరగబెట్టిందేమిటని అన్నారు. టిఆర్ఎస్ గెలిస్తేనే ఈ ప్రాంతానికి న్యాయం జరగ్గలదన్నారు.

మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, ప్రాజెక్టుల పునర్నిర్మాణం తదితర అంశాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందన్నారు. కాంగ్రెస్ నాయకులు రైతులను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ విమర్శించారు. గజ్వేల్ ప్రాంతంలో మూడో పంటకు నీరిచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. మల్లన్న సాగర్‌తో గోదావరి జలాలను రప్పించే ప్రయత్నం చేస్తే అడ్డుకోవడం వారి దుర్నీతి తప్ప మరోటి కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకుంటోందని అన్నారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంపై ప్రభుత్వం దృష్టిపెట్టిందన్నారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు చూసి ఓర్వలేకే కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలకు గత పదేళ్ళ పాపాలు గుర్తుకు రావడం లేదన్నారు.

## బూటకపు వాగ్దానాలతో మభ్య పెడుతున్న కెసిఆర్

మెదక్,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ బూటకపు వాగ్దానాలు చేస్తూ పాలన సాగిస్తున్నారని బిజెపి నేత, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి విమర్శించారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కడమే గాకుండా గ్రామాల్లో ప్రజాప్రతినిధులను విగ్రహాలుగా మార్చేశారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనలతో అయినా సిఎం కెసిఆర్‌కు కనువిప్పు కావాలన్నారు. తెరాస ప్రభుత్వ నియంతృత్వ చర్యలకు చరమగీతం పాడాల్సి ఉందని హితవు పలికారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ప్రభుత్వాలు ప్రజల కోసం పనిచేసేలా ఉండాలి కాని, ఇబ్బందులకు గురిచేసేవిగా ఉండరాదని అన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో రైతుల సమస్యలు ఏమాత్రం పరిష్కారం కాలేదన్నారు. స్వరాష్ట్రంలోనూ రైతులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం సక్రమంగా సాగలేదని, అంతే కాకుండా అర్హులైన వారికి పట్టాదారు పాసు పుస్తకాలు అందని పరిస్థితి ఉందని అన్నారు. తమ భూములపైనే తమకు హక్కు లేకుండా పోయిందనే ఆందోళనలో రైతులు ఉన్నారని పేర్కొన్నారు. భూములను కాపాడుకునేందుకు రైతులు తరతరాలుగా పోరాటాలు చేస్తూ వస్తున్నారన్నారు. రాజకీయం అంటే ప్రభుత్వాన్ని నడిపి పరిష్కారం చూపడానికే కాని మోసం చేయడానికి కాదన్నారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం కావాలని పేర్కొన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, హక్కుల సాధనకు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. దళితులకు మూడు ఎకరాల భూములు అందిస్తామన్న హామీలను ఇంతవరకు నెరవేర్చలేదన్నారు.

# అన్ని పార్టీలకు ప్రతిష్టగా మారిన హుజూర్ నగర్

### ప్రచారంలో దూసుకుపోతున్న పార్టీలు

### అంతుచిక్కని ఓటరునాడి

సూర్యాపేట,అక్టోబర్4 (ఆంఎన్ఎ): హుజూర్‌నగర్ నియోజకవర్గం ఉప ఎన్నిక ఇప్పుడు అన్ని పార్టీలకు ప్రతిష్టగా మారింది. అధికార టిఆర్ఎస్ దీనినిగెలు÷-చుకోవడం ద్వారా తన ప్రతిష్టను ఇనుమడింపచేసుకోవాలని చూస్తోంది. తమకు తిరుగులేదని చెప్పాలంటే ఇక్కడ గెలుపు ఆ ఆపర్టీకిఅనివార్యంగా మారింది. ఇక ఈ సీటును తిరిగి నిలబెట్టుకోవడం కాంగ్రెస్ పార్టీకి కూడా ప్రతిష్టాత్మకంగామారింది. తిరిగి ఇక్కడ గెలిస్తే కాంగ్రెస్ పట్ల ప్రజల్లో సానుకూలత ఉంటుంది. అలాగే బిజెపి తన ఉనికి నిరూపించు కునేందుకు ఈ ఉప ఎన్నికను ప్రతిష్టగా తీసుకుని ప్రచారం చేస్తోంది. మొత్తంగా ఈ మూడు పార్టీలకు ఇది ప్రతిష్టగా మారగా, కమ్యూనిస్టులు తోకపార్టీగా మారి, టిఆర్ఎస్ వెన్నంటి నడవబోతున్నాయి. ఎన్నికల శంఖారావం ప్రారంభమైనప్పటి నుంచి ఎవరికి వారు గెలుపే లక్ష్యంగా ప్రచారంలోకి దిగారు. అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు గెలిచిన రికార్డు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిదే. ఈ ఉప ఎన్నికలో ప్రధాన పార్టీలు సర్వశక్తులు ఒడ్డుతుండడంతో ఈ సారి నియోజకవర్గ ప్రజలు ఎవరికి పట్టం కట్టకడతారో..? హుజూంనగర్ ఎవరికి దక్కునుం దో.. అన్న ఉత్కంఠ నెలకొంది. 2 నెల 21న ఎన్నికజరు గనుం డగా 24న ఓట్ల లెక్కింపుతో తేలనుంది. 1952 లో తొలిసారి గా ఈ నియోజకవర్గానికి ఎన్నికలు జరిగాయి. 1972 ఎన్నికల తర్వాత ఈ నియోజకవర్గం రద్దయింది. 2009లో నియోజ కవర్గాల పునర్విభజనతో మళ్లీ నియోజకవర్గంగా ఏర్పాటైంది. ఈ నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల్లో మూడుసార్లు పీడీఎఫ్, ఐదుసార్లు కాంగ్రెస్ విజయం సాధిస్తే.. స్వతంత్ర అభ్యర్థి ఒకసారి గెలుపొందారు. 2009 ఎన్నికల నుంచి ఈ నియోజకవర్గంలో టీఆర్ఎస్ పోటీ చేస్తూ వస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనూ అప్పట్లో పీడీఎఫ్ విజయ దుందుభి మోగించింది. ద్విసభ నియోజకవర్గమైన హుజూర్‌నగర్ నుంచి ఈ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులు జయసూర్య, టి.నర్సింహులు విజయం సాధించారు. నియోజకవర్గం ఏర్పాటైన పదేళ్ల తర్వాత హుజూర్‌నగర్‌పై కాంగ్రెస్ జెండా ఎగిరింది. అక్కిరాజు వాసుదేవరావు ఈ నియోజకవర్గ తొలి కాంగ్రెస్ ఎమ్మెల్యే. 1962 ఎన్నికల్లో ఆయన పోటీ చేస్తే 25,394 ఓట్లు రాగా సీపీఐ అభ్యర్థిగా బరిలో నిలిచిన దొడ్డ నర్సయ్యకు 22,561 ఓట్లు పడ్డాయి. పునర్విభజనతో ఈ నియోజకవర్గం నేరేడుచర్ల, గరిడేపల్లి, మఠంపల్లి, హుజూర్ నగర్, మేళ్లచెరువు మండలాలతో ఏర్పాటైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయిన తర్వాత 2016లో నేరేడుచర్ల నుంచి పాలకవీడు, మేళ్లచెరువు నుంచి చింతపాలెం మండలాలను కొత్తగా ఏర్పాటు చేశారు. వీటితో కలిపి నియోజకవర్గంలో ఏడు మండలాలయ్యాయి. పునర్విభజనతో ఏర్పాటయిన ఈ నియోజకవర్గంలో ఇప్పటివంకు జరిగిన మూడు ఎన్నికల్లో హస్తందే ఆధిపత్యం కొనసాగింది. 2009లో జరిగిన ఎన్నికల్లో నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగి టీఆర్ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిపై గెలిచారు. 2014 ఎన్నికల్లోనూ ఉత్తమ్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఉత్తమ్, టీఆర్ఎస్ నుంచి కాసోజు శంకరమ్మ పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో ఉత్తమ్‌కు 69,879 ఓట్లు పడగా శంకరమ్మకు 45,955 ఓట్లు వచ్చాయి. అయితే 2018 ఎన్నికల్లో మాత్రం టీఆర్ఎస్.. కాంగ్రెస్ పార్టీకి గట్టి పోటీనిచ్చింది. ఆపార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన శానంపూడి సైదిరెడ్డి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ఉత్తమ్‌కు 92,966 ఓట్లు రాగా, సైదిరెడ్డికి 85,530 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో ఉత్తమ్ 7,436 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. స్వల్ప ఓట్ల తేడాతో ఉత్తమ్ గ్గటెక్కారు.అయితే ఈసారి విజయం తమదేనని ఇటు టీఆర్ఎస్, అటు కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీలు ధీమాగా చెబుతున్నాయి. మొత్తంగా ప్రజలు ఈ సారి ఎటు ఓటేస్తారా అన్న ఉత్కంఠ నెలకొంది. నాడి పట్టుకోవడం కూడా అంత సులువుగా లేదు.

# ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలకు పెరగని భరోసా

### ఇంకా ప్రైవేట్ ఆస్పత్రులనే నమ్ముతున్న జనాలు

### డాక్టర్ల కొరత కూడా కారణమంటున్న ప్రజలు

హైదరాబాద్,అక్టోబర్4 (ఆర్ఎన్ఎ): ప్రసవాలకు ప్రభుత్వం ఎంతగా ప్రోత్సాహం అందిస్తున్నా ఇంకా చాలామంది ప్రైవేట్ ఆస్పత్రులనే ఆశ్రయిస్తున్నారు. ఇటీవల కెసిఆర్ కిట్ల పంపిణీ జరిగిన తరవాత ప్రభుత్వ అస్పత్రులకు గర్భిణుల రాక సంఖ్యపెరిగినా వైద్యులు,నర్సుల కొరత కారణంగా చాలచోట్ల ప్రసవాలకు సమస్యగా మారుతోంది. దీనికితోడు ప్రైవేట్ ఆస్పత్రుల్లో అనుకున్న సమయానికి సిజేరియన్ చేయించుకోవచ్చన్న ధీమాలో కొందరు ఉన్నారు. సర్కార్ దవాఖానాల్లో వైద్యుల కొరత కూడా దీనికి కారణంగా చెబుత ఎన్నారు. దేశంలోకెల్లా అత్యధికంగా తెలంగాణలో 58 శాతం ప్రసవాలు శస్త్ర చికిత్సలు జరుగుతుండగా తెలంగాణలోనే అత్యధికంగా ఉమ్మడి ప్రైవేటు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలను వేళ్ల మీద లెక్కించవచ్చు. ఆస్పత్రిలో అవసరమైనంత మంది స్త్రీ వైద్య నిపుణులు లేకపోవడం కడుపు కోతలు పెరగడానికి మరో కారణంగా భావిస్తున్నారు. సాధారణ ప్రసవాల కోసం ప్రయత్నించాలంటే నిరంతరాయంగా ప్రసవాల లేబర్ రూమ్‌లో స్త్రీ వైద్య నిపుణులు ఉండాలి. మూడు షిఫ్టుల్లో ముగ్గురు స్త్రీ వైద్య నిపుణులతోపాటు ఒకరు అదనంగా ఉంటేనే ఇది సాధ్యం. శస్త్ర చికిత్సల కోసం, గర్భిణులకు కాన్పుకు ముందు నెలవారీ పరీక్షల కోసం అదనంగా వైద్యులు అవసరం. ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగే ప్రసవాల్లో 70 శాతం మేరకు శస్త్ర చికిత్సలే జరుగుతున్నాయనే విషయం వెల్లడవుతోంది. మొదటి కాన్పు సాధారణ ప్రసవం అయినప్పుడు మాత్రమే దాదాపుగా రెండో, మూడో కాన్పులకు సాధారణ ప్రసవం కోసం వైద్యులు వేచి చూస్తున్నారు మినహా మొదటి కాన్పు అనగానే శస్త్రచికిత్స చేయడానికి ఉపక్రమిస్తున్నారు. గర్భిణి బంధువులే శస్త్ర చికిత్స ప్రసవం కోసం వైద్యులపై ఒత్తిడి తెస్తున్న సంఘటనలు సైతం ఉన్నాయి. మరోవైపు ఫలానా ముహూర్తంలో బిడ్డ పుడితే భవిష్యత్తు బాగుంటుందంటూ శస్త్ర చికిత్సలతో ప్రసవాలు చేయించుకుంటున్న వారు సైతం ఉన్నారు. కాస్త ఓపిక పడితే సాధారణ ప్రసవం జరుగుతుందని వైద్యులు చెబుతుంటే,గర్భిణి నొప్పులతో బాధపడుతున్నా వైద్యులు శస్త్రచికిత్స చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆందోళనలు తరచూ ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొంటున్నాయి. ఈ తలనొప్పులు భరించలేని వారు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఇక్కడ వారికి అనూహ్య పరిణామాలు ఎదురవుతున్నాయి. కొద్ది క్షణాల్లో సాధారణ ప్రసవం జరిగే పరిస్థితులున్నా గర్భిణి బంధువులకు ఏదో ఓ కారణం చెబుతూ వెంటనే శస్త్ర చికిత్సతో ప్రసవం చేయకపోతే కష్టమంటూ బెంబేలెత్తిస్తున్న సంఘటనలున్నాయి. కాన్పు కష్టమవుతోందని..కడుపులో బిడ్డ అడ్డం తిరిగిందని..ఉమ్మనీరు తాగాడని..బిడ్డ బరువు ఎక్కువగా ఉందని భయపెడతారు. దానికి తోడు బీపీ పెరిగిందని..వెంటనే శస్త్రచికిత్స చేయకపోతే చిన్న ప్రాణానికే కాదు పెద్ద ప్రాణానికే ముప్పని అంటారు. నెలలు నిండినా పురిటి నొప్పులు రావడం లేదని కత్తికి పదను పెడతారు.ఒకరిద్దరు ప్రైవేటు వైద్యులు సాధారణ ప్రసవం చేస్తామని చెప్పి చివరి క్షణంలో డబ్బుల కోసం శస్త్రచికిత్స చేశారంటూ ఆస్పత్రుల ముందు ఆందోళనలు నిర్వహించిన సంఘటనలు సైతం ఉన్నాయి.సాధారణ ప్రసవాలు నామమాత్రంగానే సాగుతున్నాయని జాతీయ ఆరోగ్య మిషన్ ఇటీవల చేపట్టిన కుటుంబ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ఆస్పత్రుల్లో సౌకర్యాల కొరత, డాక్టర్ల కొరత వెరసి ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లకు దారితీస్తోంది. సాధారణంగానే రాష్ట్ర వ్యాప్తంగా స్త్రీ వైద్య, మత్తు వైద్య నిపుణుల కొరత ఉండటంతో ఏ ఆస్పత్రికి వెళ్లినా ఆయా పోస్టులు అత్యధికంగా ఖాళీలే కనిపిస్తుంటాయి. ఇక ఇలాంటి పరిస్థితుల్లో సాధారణ ప్రసవం కోసం ప్రయత్నించే సమయం ఎక్కడుంటుంది. అవసరమైన స్త్రీ, మత్తు వైద్య నిపుణులను తాత్కాలిక ప్రాతిపదికన తీసుకోవాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్నా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేసేందుకు వారు ముందుకు రావడం లేదు. శస్త్ర చికిత్స అవసరం లేదని నచ్చజెప్పినా వినకుండా ప్రైవేటుకు వెళుండటంతోపాటు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారంటూ దుష్ప్రచారం చేస్తుంటారు. ప్రసవం తేదీకి ఒకటి రెండు రోజులు ఎక్కువగా కాగానే శస్త్ర చికిత్సకు ఒత్తిడి తెస్తుంటారు. అరుదైన కాన్పులు, హైరిస్క్ కేసుల్లో మాత్రం తప్పనిసరిగా శస్త్ర చికిత్సతో ప్రసవం చేయాల్సిందే. సాధారణ ప్రసవాలపై మొదట గర్భిణులు, వారి బంధువుల్లో సంపూర్ణ అవగాహన పెరగాల్సి ఉందని వైద్యులు అంటున్నారు.

# విచ్చలవిడిగా బోర్ల తవ్వకంతో సమస్యలు

### జలశక్తి అభియాన్ చేపట్టినా కానరాని చైతన్యం

ఖమ్మం,అక్టోబర్4 (ఆర్ఎన్ఎ): విచ్చలవిడిగా బోర్ల తవ్వకం కారణంగా భూగర్భ జలాలు అట్టడుగుకు చేరడం వల్ల ఎండాకాలంలో సమస్యలు వస్తున్నాయి. ప్రజలు వాననీటి సంరక్షణలో ముందుకు రాకపోవడంతో సమస్య మరింత జటిలంగా మారుతోంది. జలసంరోణ అభియాన్ కింద ప్రచారం చేస్తున్నా వాననీటి సంరోణపై పెద్దగా స్పందించడం లేదు. ప్రజల్లో చైతన్యం రానిదే ఏమీ చేయలేమని అన్నారు. విచ్చలవిడిగా నీటి వినియోగం పెరగడంతో జిల్లాలో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. బోర్లు వేసి భూమికి తూట్లు పొడవటంతో గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడింది. పరిస్థితి విషమించకుండా ఉండేందుకు ఇంకుడు గుంతలు దోహదపడతాయి. ఇష్టారాజ్యంగా బోర్లు వేయడమే కాదు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వాననీటిని భూమిలోకి పంపినప్పుడే సమస్య తీవ్రత తగ్గుతుందని అధికారులు సూచించారు. జిల్లాల్లో వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు,గృహ వినియోగ బోరు బావులున్నాయి. నిరంతర విద్యుత్తు సరఫరా చేయడంతో వ్యవసాయ బోర్ల సంఖ్య కూడా పెరిగింది.

నీటి వినియోగం పెరగడంతోపాటు వాననీటి సంరక్షణ చర్యలు లేకపోవడంతో జిల్లాలో భూగర్భ జలాలు పడిపోతున్నాయి. వాల్టా చట్టం అమల్లోకి వచ్చినా బోర్లు తవ్వకోడానికి అనుమతి తీసుకోవడం లేదు.

నిబంధనలు అతిక్రమిస్తే కొత్తగా తవ్వే బావులను మూసివేయడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వ్యవసాయ, గృహావసరాలకు సంబంధించి 2లక్షలకుపైగా గొట్టపు బావులున్నాయి. బావుల తవ్వకాలకు ఎక్కడా నిబంధనలు పాటించడం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ చట్టం అటకెక్కింది. దీనిని పటిష్టంగా అమలు చేస్తే భూగర్భ జలాల వృథాను అరికట్టవచ్చు. అక్రమ బోరుబావుల తవ్వకాన్ని నివారించి నీటి సంరక్షణ చర్యలు తీసుకోవల్సిన అవసరం ఉంది. లేకుంటే గోదావరి పారుతున్నా నీటి ఇబ్బందులు తప్పేలా లేవు.

# సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

### అధికారుల తీరుతో ముందుకు సాగని వైనం

రాజన్న సిరిసిల్ల,అక్టోబర్4 (ఆర్ఎన్ఎ): రాజన్నసిరిసిల్ల జిల్లాలో కార్మికులు, వలసలతో పేదరికంతో సతమతమవుతున్న వారే అధికంగా ఉంటారు. ఇక్కడి ప్రజల జీవనప్రమాణాలు పెంచాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన పలు పథకాలు ప్రజలకు చేరువకావడంలో తీవ్రజాప్యం జరుగుతోంది. మంత్రి కెటిఆర్ పదేపదే హెచ్చరిస్తున్నా, ఆదేశాలు ఇస్తున్నా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. జిల్లాలో ఎస్సీలు1.13లక్షలు, ఎస్టీలు25వేలు, వెనుకబడిన తరగతుల వారు 3.5లక్షల మంది ఉన్నారు. వీరికి ఆయా కార్పొరేషన్ల ద్వారా ఏటా రుణాలు కేటాయిస్తారు. ఉకొత్తరుణాలకోసం దరఖాస్తు చేసుకున్నా పరిశీలించే అధికారులు ఇన్‌ఛార్జులుగా కొనసాగుతుండటంతో జాప్యం జరుగుతోంది. అన్నదాతలకు అధికారుల చేయూత కరవైంది. జిల్లాలో చిన్నసన్నకారు రైతులతోపాటు భూస్వాములు ఉన్నారు. వేలఎకరాల్లో వివిధరకాల పంటలు సాగవుతుంటాయి. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు వ్యవసాయాన్ని ఆధునికతవైపు నడిపించేందుకు అనేకరకాల పథకాలు అమలుచేస్తున్నా జిల్లా రైతులకు అందని ద్రాక్షగానే మిగులుతున్నాయి. మెట్టప్రాంతమైన జిల్లాలో సాగునీటి కొరతను అధిగమించేందుకు రైతులకు బిందు, తుంపర సేద్యం పరికరాలను అందించేందుకు నిధులు కేటాయించారు. లబ్దిదారుల ఎంపిక పరికరాల పంపిణీలో జాప్యం జరుగుతుండటంతో నేటికీ దరఖాస్తు చేసుకున్న రైతులకు పరికరాలు అందలేదు. జిల్లా వ్యవసాయాధికారి నియామకంలో జాప్యం జరుగుతుండటంతో వ్యవసాయం, దాని అనుబంధశాఖల ద్వారా రైతులకు అందాల్సిన రాయితీలు అందడంలో తీవ్రజాప్యం జరుగుతోం ది.రహదారులు భవనాలశాఖ పరిధిలోనూ పనుల్లో తీవ్రజాప్యం జరుగుతోంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మిషన్‌కాకతీయ పనులు జిల్లాలో పురోగతి అంతగా కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఉపాధిహామీ పథకాన్ని ఈ ఏడాది జిల్లాలో పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేదు. దీనికితోడు ఇందిరాక్రాంతిపథం, గ్రామీణాభివృద్ధి శాఖలు విలీనంచేయడంతో అధికారులు ఏశాఖకు పూర్తిస్థాయిలో న్యాయం చేయడంలేదు. వైద్య ఆరోగ్య శాఖలో ఇన్‌ఛార్జుల పాలనతో ప్రజలకు ఆరోగ్యసేవలు అందనిద్రాక్షగా మిగిలాయి. వీటితోపాటు వయోజనవిద్య, గిరిజన సంక్షేమశాఖ, దేవాదాయశాఖ, పర్యాటకం, కార్మికశాఖలు విభజనకు నోచుకోకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా కొనసాగుతోంది.

# ట్యాబ్‌ల వినియోగంతో సత్ఫలితాలు

### క్షేత్రస్థాయిలో సులువుగా మారిన వివరాల సేకరణ

మెదక్,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో తీసుకెళ్లడం కోసం పంపిణీ చేసిన ట్యాబ్‌ల వల్ల సత్ఫలితాలు వస్తున్నాయి. గ్రామంలో నెలకొన్న ఏ సంఘటనైనా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం.. గ్రామ రెవెన్యూ రికార్డులు, లెక్కలను సక్రమంగాసమర్థవంతంగా నిర్వహించడం... భూమిశిస్తు, ఇతర బకాయిలను వసూలు చేయడం గ్రామ రెవెన్యూ అధికారి బాధ్యత. గతంలో ఆయా అంశాలకు సంబంధించి కాగితాల రూపంలో ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చేవారు. ఇప్పుడు ట్యాబ్‌ల పంపిణీతో రోజువారీగా సమస్యలను తెలుసుకునే వీలు కలిగింది. అలాగే వీఆర్వోలకు తప్పించుకునే వీలు లేకుండా పోయింది. ఆయా ప్రభుత్వ శాఖల్లో శాస్త్రసాంకేతికతను వినియోగిస్తూ క్షణాల్లో నివేదికలను తెప్పిస్తుండగా, కీలకమైన రెవెన్యూశాఖలో కాగితం రూపంలో నివేదికలు ఉండేవి. నివేదికలు సిద్ధం కావడానికి గంటల కొద్దీ సమయం పట్టేది. ఇందుకు స్వస్తి పలికి క్షణాల్లో సమాచారం అందజేసేందుకుగాను ప్రభుత్వం వీఆర్వోలకు ట్యాబ్‌లను పంపిణీ చేసింది. సమాచారాన్ని సేకరించి, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చడంలో ట్యాబ్‌ల వల్ల ఇబ్బందులు తొలిగాయి. గ్రామస్థాయిలో ఎండిన పంట, అకాల వర్షాల వల్ల నష్టపోయిన వివరాలు, కరవు వివరాలతో పాటు రెవెన్యూకు సంబంధించి ప్రతి అంశాన్ని సేకరిస్తారు. వాటి నమోదు కోసం తహసీల్దార్ కార్యాలయంలో డేటా కంప్యూటర్ ఆపరేటర్లపై ఆధారపడాల్సి వచ్చేది. ఒకే సారి మండలంలోని వీఆర్వోలు సేకరించిన సమాచారం నమోదు చేసేందుకు అవకాశం ఉండేది కాదు. దీంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురయ్యేవి. అయితే ట్యాబ్‌లో నాలుగు యాప్‌లను పొందుపరిచి వివరాల సేకరణకు సులువు చేశారు. అందులో పట్టాదారు, ఆధార్ సంఖ్య సీడింగ్, ఈ-అజమాయిషీ, మా భూమి, ప్రాథమిక సమాచర నివేదిక యాప్‌లు ఉన్నాయి. ఇందులో పట్టాదారు ఆధార్‌సంఖ్య సీడింగ్ చేయడం వల్ల ఎంత భూమి, ఎక్కడ ఉంది అనే వివరాలు తెలుస్తాయి. ఏ పంట వేశారు.. ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారు వివరాలతోపాటు పంట చిత్రాన్ని వీఆర్వోలు అప్‌లోడ్ చేయాలి. మాభూమిలో భూమి రికార్డుల వివరాలు పహాణీలో చూపించే విధంగా భూముల వివరాలను తెలుసుకోవచ్చు. అలాగే గ్రామంలో ఏ సంఘటన జరిగిన వెంటనే పీఐఎస్‌లో ఛాయచిత్రంతో అప్‌లోడ్ చేసి వివరాలు పొందుపర్చాలి. ఎప్పటికప్పుడు పొందుపరిచిన సమాచారం సీసీఎల్ఏకు వెళ్తుంది.

క్రీడలు

# ఆసియా బాడీ బిల్డింగ్.. ఆర్మీ మేజర్‌కు రజత పతకం




హైదరాబాద్: భారత ఆర్మీ మేజర్ అబ్దుల్ ఖాదిర్ ఖాన్‌కు ఆసియా బాడీ బిల్డింగ్ పోటీల్లో రజత పతకం దక్కింది. ఇండోనేషియాలోని బాటమ్ నగరంలో ఈ వేడుకలు జరిగాయి. 53వ ఆసియా బాడీ బిల్డింగ్ అండ్ ఫిజిక్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో భారత్ తరపున ఆర్మీ మేజర్ అబ్దుల్ ఖాదిర్ ఖాన్ పాల్గొన్నాడు. ఈ ఈవెంట్ అక్టోబర్ 2న జరిగింది.

# పోరాడుతున్న డీకాక్, ఎల్గర్




హైదరాబాద్: దక్షిణాఫ్రికా ప్లేయర్లు క్వింటన్ డికాక్, డీన్ ఎల్గర్‌లు నిలకడగా ఆడుతున్నారు. భారత్‌తో జరుగుతున్న తొలి టెస్టు మూడవ రోజు భోజన విరామ సమయానికి సౌతాఫ్రికా అయిదు వికెట్ల నష్టానికి 292 రన్స్ చేసింది. ఎల్గర్ 133, డీకాక్ 69 రన్స్‌తో క్రీజ్‌లో ఉన్నారు. వైజాగ్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికా మరో 210 పరుగులు వెనకబడి ఉంది. టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 502 రన్స్‌కు డిక్లేర్ చేసిన విషయం తెలిసిందే. మూడవ రోజు ఉదయం డూప్లిసిస్ 55 రన్స్ చేసి ఔటయ్యాడు. ప్రమాదకరంగా కనిపించిన డూప్లిసిస్‌ను స్పిన్నర్ అశ్విన్ ఔటయ్యాడు. అయితే ఆరవ వికెట్‌కు డీకాక్, ఎల్గర్‌లు దూకుడుగా ఆడుతున్నారు.

# ఆర్టీసీ యూనియన్లతో చర్చలు విఫలం

## ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ముందుంచిన ప్రభుత్వం
## ప్రైవేట్ డ్రైవర్లతో బస్సులు నడుపుతామన్న సోమేశ్ కుమార్



హైదరాబాద్,అక్టోబర్4 (ఆర్ ఎన్ఎ): ఆర్టీసీ సమ్మెను తప్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారులతో కూడిన త్రిసభ్య కమిటీ, ఆర్టీసీ కార్మిక సంఘాల మధ్య గురువారం జరిగిన రెండోదఫా చర్చల్లో కూడా ఎలాంటి ఫలితం కానరాలేదు. టీఎస్ ఆర్టీసీ జేఏసీతో త్రిసభ్య కమిటీ రెండోదఫా చర్చలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో ప్రత్యామ్నాయ చర్యలకు ప్రభుత్వం దిగింది. ఒకవేళ కార్మికులు సమ్మెకు దిగితే.. సమ్మెను ఎదుర్కొనేందుకు ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యామ్యాయ చర్యలు చేపట్టేందుకు సిద్ధవ ్వడం కార్మిక సంఘాలకు ఆగ్ర హం తెప్పించింది. ఈ అంశాన్ని లేవనెత్తుతూ గురువారం చర్చల నుంచి కార్మిక సంఘాలు అర్ధంత రంగా వెళ్లిపోయాయి. ఇక, సమ్మె వాయిదా వేసుకోవాలని ఆర్టీసీ జేఏసీకి త్రిసభ్య కమిటీ మరోసారి సూచించింది. పండుగ సందర్భం గా ఉండే రాకపోకలు, రద్దీని దృష్టిలో పెట్టుకొని సమ్మె వాయిదా వేసుకోవాలని కోరింది. అయితే, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, పీఆర్సీ అమలుపై స్పష్టత ఇవ్వాలని ఆర్టీసీ జేఏసీ పట్టుబట్టి ంది. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ ఇస్తేనే.. తమ నిర్ణయం చెబుతామని జేఏసీ నేతలు తేల్చిచెప్పారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె ప్రతిపాదన నేపథ్యంలో ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యా మ్యాయ ఏర్పాట్లు చేస్తోంది. కార్మి కులు సమ్మె చేస్తే.. ఆ ప్రభావం బస్సుల రాకపోకలు, ప్రయాణికులపై పడకుండా రవాణా అధికారులు తీసుకో వాల్సిన చర్యలపై సోమేశ్‌కుమార్ తాజాగా దిశానిర్దేశం చేశారు. ప్రైవేటు సూల్ బస్సుల డ్రైవర్లతో ఆర్టీసీ బస్సులు నడపాలని యాజమా న్యం సూత్రప్రాయంగా నిర్ణయి ంచినట్టు తెలుస్తోంది. ఇందుకుగాను రోజుకు డ్రైవర్‌కు రూ. 1500, కండక్టర్‌కు రూ. వెయ్యి వేతనంగా ఇవ్వాలని ఆర్టీసీ యాజ మాన్యం నిర్ణయం తీసుకు ంది. కనీసం 18నెలల అనుభవంఉన్న డ్రైవర్లను తీసుకోవాలని సూచించారు.

# రెపోరేట్ తగ్గించిన ఆర్‌బిఐ

## వడ్డీ రేట్లు దిగొస్తాయంటున్న విశ్లేషకులు

ముంబై,అక్టోబర్ 4 (ఆర్ ఎన్ఎ):రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దసరా సందర్భంగా గుడ్ న్యూస్ అందించింది. రెపో రేట్‌ను మరో 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఆర్బీఐ 25 బేసిస్ పాయింట్స్ తగ్గించడంతో రేపో రేట్ 5.15 శాతానికి చేరుకుంది. ద్రవ్యోల్బణ ముప్పు తప్పించుకునేందుకు, వృద్ధి వైపుగా అడుగులు వేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక ఆర్‌బీఐ రెపో రేట్ తగ్గించడంతో వడ్డీ రేట్లు కూడా భారీగా తగ్గనున్నాయి. హోమ్ లోన్, వెహికిల్ లోన్ సులభతరం కానున్నాయి. కొత్తగా ఇళ్లు, వాహనాలు కొనేవాళ్లను కొత్త వడ్డీ రేట్లు ఆకర్షించే అవకాశముంది. ఇదిలావుంటే దేశీయంగా అతి పెద్ద వాణిజ్య బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తన ఖాతాదారులకు షాకిచ్చింది. మైక్రో ఏటీఎం వినియోగంపై పరిమితి విధించింది. నెలకు ఒక్కసారి మాత్రమే ఇతర బ్యాంకుల ఏటీఎంల నుంచి డబ్బు విత్‌డ్రా చేసుకునే సదుపాయం కల్పించింది. ఇప్పటి వరకు ఈ అవకాశం మూడుసార్లు ఉండేది. ఇది ఖాతాదారులకు తీవ్ర నిరాశ కలిగించే అంశం. ప్రభుత్వ డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ స్కీమ్‌లో భాగస్వామ్యం కాని ఖాతాదారులు మాత్రం నెలకు ఐదు లావాదేవీలు నిర్వహించుకో వచ్చును.

# నీటి వృధాపై ప్రజల్లో చైతన్యం

## ప్రజల్లో చైతన్యానికి కసరత్తు

ఆదిలాబాద్,అక్టోబర్4 (ఆంఎన్ఎ): గ్రామాల్లో నీటి ఎద్దడిని నివారించేందుకు చర్యలు చేపడుతున్న అధికార యంత్రాంగం నీటి వృథాపై దృష్టి సారించాల్సిన అవసరముంది. బోరుబావుల్లో చేతిపంపులకు బదులు సింగిల్ ఫేజ్ మోటారు బిగిస్తూ విచ్చలవిడిగా నీటి వృథాకు పూతమిస్తున్నారు. చాలా వరకు చేతిపంపులు తొలగించి సింగిల్ ఫేజ్ మోటార్లు బిగించారు. అధికారిక లెక్కల్లో మాత్రం వాటిని చూపడం లేదు. ప్రజలు శ్రమ పడకుండానే సులువైన పద్ధతులకు అలవాటు పడుతుండటం నీటి వృథాకు కారణమవుతోంది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా అధికారులు నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరముంది. ఇప్పటికైనా సింగిల్ ఫేజ్ మోటార్లకు బదులు చేతిపంపు బిగిస్తే నీటి వృథా అరికట్టడంతో పాటు అన్ని వేళల్లో నీటి సౌకర్యాన్ని కల్పించినవారవుతారు. కొన్నిచోట్ల నీటి ప్రాముఖ్యంపై నిత్యం వివిధ సాధనాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. గత వేసవిలో వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో భూగర్భజలాలు అడుగంటి తీవ్ర నీటి ఎద్దడి నెలకొంటోంది. జలాశయాలు, చెరువులు, వాగులు, వంకలు వట్టిపోయాయి. భారీ వర్షాలు, వరదలు వచ్చినప్పటికీ భూగర్భజలాలు పెరగలేదు. నీరంతా వృథాగా పోయింది. పలుచోట్ల రక్షిత మంచినీటి పథకాలకు నీటిని సరఫరా చేసే బోరుబావులు అడుగంటి పోయాయి. ఇదంతా ఒకెత్తయితే ఉన్న నీటిని పొదుపు చేసి ప్రజలందరికీ ఉపయోగపడేలా చర్యలు చేపట్టకపోవడం మరో ఎత్తు. నీటి ఎద్దడితో అవస్థలు పడుతున్న ప్రజలు కొద్దిపాటి అవగాహనతో నీటిని పొదుపు చేయొచ్చు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో చాలా గ్రామాల్లో నీరు వృథా అవుతుంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో మరింత ముప్పు పొంచి ఉంది. ప్రభుత్వ యంత్రాంగానికి ఇప్పటికైనా కనువిప్పు కలగకపోతే నీటి ఎద్దడి తీవ్రతరం కానుంది. అన్ని గ్రామాల్లో అధికారులు, సిబ్బంది నీటి పథకాలు, వాటి పనితీరు నివేదికలను రూపొందించారు. చేతిపంపులకు బదులు పంపుసెట్లను బిగించిన గ్రామాల్లో నీటి లభ్యత, నిల్వ సామర్థ్యం మేరకు తగినన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. చేతిపంపులు బిగించడమో లేదా గ్రామస్థులకు అవగాహన కల్పించి నీటిని పొదుపు చేసేలా కృషి చేస్తామని చెప్పారు.

# అన్నదాతకు అండగా సహకార రుణాలు

## రైతుల అవసరాలకు అనగుణంగా ప్రణాళిక

సంగారెడ్డి,అక్టోబర్4 (నేటనిజం ప్రతినిధి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను బలోపేతం చేస్తూనే వాటి ద్వారా రైతులకు లబ్ధి దక్కేలా చూడనున్నారు. పీఏసీఎస్‌లో సభ్యుడిగా ఉన్న జిల్లాలోని ప్రతి సభ్యుడికి కనీసం రూ.5 వేలు రుణం అందించేందుకు ప్రణాళిక సిద్ధమైంది.పంట సాగు చేసే సమయంలో ఎరువులు, విత్తనాల కోసం అన్నదాతలు వ్యాపారులను ఆశ్రయిస్తుంటారు. వీరి అవసరాన్ని అవకాశంగా చేసుకుని వాటిని అందించి పంట చేతికొచ్చాక అధిక వడ్డీలతో అసలు మొత్తాన్ని వసూలు చేస్తారు. దీనివల్ల చాలామంది అన్నదాతలు అష్టకష్టాలు పడుతుంటారు. ఈ సమస్యను గుర్తించిన జిల్లా యంత్రాంగం వారికి అండగా నిలిచేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. జిల్లాలో ప్రస్తుతం 52 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. డీసీసీబీ ఆధ్వర్యంలో పనిచేసే 33 సంఘాల్లో ఉన్న సభ్యులకు ప్రతి ఒక్కరూ రుణ సదుపాయం పొందేలా చూడనున్నారు. చాలామంది అన్నదాతలు సంఘాల్లో సభ్యులుగా ఉంటున్నప్పటికీ వారు మాత్రం వడ్డీ వ్యాపారుల వద్ద, ఇతరత్రా బ్యాంకుల్లో రుణాలు తీసుకుంటున్నారు. పీఏసీఎస్‌లలో ఎలాంటి లావాదేవీలు నిర్వహించడం లేదు. ఇలాంటి వారిని గుర్తించి ప్రతి సభ్యుడూ కచ్చితంగా ప్రయోజనం పొందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇలాంటి సభ్యులందరికీ రూ.5 వేలు రుణ సదుపాయం కల్పించనున్నారు. నగదును రైతుకు నేరుగా ఇతరత్రా ఖర్చుల కోసం ఉపయోగించుకునేందుకు ఇవ్వరు. పీఏసీఎస్‌కు వెళ్లి రూ.5 వేల వరకు విలువైన ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసే అవకాశాన్ని ఇస్తారు. ఆ మొత్తాన్ని ఆయన ఖాతాలో అప్పుగా చూపుతారు. తిరిగి పంట పండిన తర్వాత అప్పును రూ.5 వేలతోపాటు రూ.300 చెల్లిస్తే సరిపోతుంది. దీనివల్ల పెట్టుబడుల కోసం రైతులు పడే ఇబ్బందులను తగ్గించవచ్చనే కోణంలో అధికారులు ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక బయట వ్యాపారులతో పోల్చితే ఎరువులు తక్కువ ధరకే పీఏసీఎస్‌లలో అందుబాటులో ఉంటాయి. ఇలా రుణం పొందడానికి ముందుకొచ్చే వారి వివరాలను ఎప్పటికప్పుడు ఈ వివరాలను డీసీసీబీకి అందించి వారికి సాయం అందించేలా చూస్తామని సహకార శాఖ అధికారులు వివరిస్తున్నారు. వాస్తవానికి బయట వ్యాపారులతో పోల్చితే ఎరువులు ఇక్కడే తక్కువ ధరకు వస్తాయి. ఈ విషయాలనూ అన్నదాతలకు వివరించి సంఘాలనూ బలోపేతం చేసేందుకు వీరి సేవలను వాడుకోనున్నారు. ఇలా ఈ వానాకాలంలో రైతన్నకు అండగా నిలిచేలా వ్యవసాయ, సహకార శాఖలు సంయుక్తంగా కార్యకలాపాలు చేపట్టనున్నాయి.

# గురుకుల విద్యపై హార్వర్డ్ అధ్యయనం

## త్వరలో రానున్న ప్రత్యేక బృందం

హైదరాబాద్,అక్టోబర్4 (ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం నిర్వహిసున్న గురుకుల వ్యవస్థను అధ్యయనం చేసేందుకు ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్శిటీ బృందం రాష్ట్రానికి రానుంది. సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాలు బడుగు బలీన వర్గాల పిల్లల కోసం నాణ్యమైన విద్యను అందిస్తూ, దేశంలోనే అన్ని ఉన్నత వర్గాల పిల్లలు అందుకునే విద్యను పేద పిల్లలకు కూడా అందించాలన్న లక్ష్యంతో గురుకులాల వ్యవస్థ పనిచేస్తోంది. గత ఆరేళ్లలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ దేశ విద్యావ్యవస్థ మీద తనదైన ముద్రు వేస్తోంది. గురుకుల విద్యావ్యవస్థ పనితీరు, సాధిస్తున్న విజయాలతో పాటు గురుకులాల గురించి తెలుసుకోవడానికి హార్వర్డ్ యూనివర్శిటీ బృందం రాష్ట్రానికి వస్తోంది. వివిధ నైపుణ్యాలను ఎలాంటి మార్పులతో అందిస్తున్నారన్న విషయం పై అధ్యయనం చేసేందుకు యూనివర్శిటీ బృందం వస్తున్నట్టు ఆ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ ఫెర్నాండో రీమర్స్‌గురుకులాలకార్యదర్శికి ఈమెయిల్ ద్వారా సమాచారం అందించారు. రాష్ట్ర విద్యాచరిత్రలో ఇది ఎంతో అరుదైన విషయమేకాకుండా గురుకులాలలకు ఇస్తున్న గౌరవంగా భావించవచ్చు. హార్వర్డ్ యూనివర్శిటీ ప్రొఫెసర్లు, విద్యార్థులు ప్రత్యేకంగా రావడం దేశ చరిత్రలో ఇది మొదటిసారని అధికారులు తెలిపారు. ఉపాధ్యాయుల వృత్తి విద్యానైపుణ్యాలను, పిల్లలు నాయకులుగా ఎదుగుతున్న క్రమాన్ని వాళ్లు అధ్యయనం చేస్తారు. రాబోయే కాలానికి కావల్సిన అన్ని నైపుణ్యాలను ఎలా అందిపుచ్చు కుంటున్నారో తెలుసుకునేందుకు హార్వర్డ్‌యూనివర్శిటీ బృందం గురుకుల కార్యాలయాన్ని, పాఠశాలలను సందర్శించి అధ్యయనం చేస్తారు. ప్రపంచస్థాయి విద్యావిధానాన్ని అవలంబిస్తూ పేద పిల్లల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్న ఉపాధ్యాయులను, అవకాశాలను అందుకుని విజయాలు సాధిస్తున్న విద్యార్థులను కూడా ఆయన అభినందించారు.

# సింగరేణిలో అధికారుల కొరత?

ఖమ్మం,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): సింగరేణిలో కార్యనిర్వహణ సంచాలకుల స్థానాలు కూడా ఖాళీ అవుతున్నాయి. కొత్త గనులు, పర్యావరణ అనుమతులు, బొగ్గు ఉత్పత్తి పర్యవేక్షణకు సంబంధించి ఒక్కో డివిజన్‌పై పూర్తి స్థాయిలో దృష్టి సారించి అధికారులను అప్రమత్తం చేయడంలో రెండు పదవులు కీలకం. ఖాళీ స్థానాలను భర్తీ చేయడంలో యాజమాన్యానికి అనేక చిక్కులు ఎదురవుతున్నాయి. ఆర్జీ-1, 2, శ్రీరాంపూర్, మందమర్రి, భూపాలపల్లి ప్రాంతాలను పర్యవేక్షించే అధికారి కరవయ్యారు. కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, ఆర్జీ-3, బెల్లంపల్లి డివిజన్‌లలో బొగ్గు ఉత్పత్తి, రవాణాలపై పర్యవేక్షణ లోపించనుంది. రెండు సంచాలకుల స్థానాలు ఖాళీ ఉండటం వల్ల కొత్త గనుల ఏర్పాటుకు సంబంధించి పురోగతి, పర్యవేక్షణ లోపించనుంది. బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకున్న సింగరేణి దాన్ని అధిగమించాలంటే ఆర్థిక సంవత్సరం మొదటి నుంచే పర్యవేక్షణ ఉండాలి. బాధ్యులైన సంచాలకులు లేకపోవడంతో పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తనున్నాయి.

# బోధనారుసుముల చెల్లింపులో ఆలస్యం

## సకాలంలో ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు

నిజామాబాద్,అక్టోబర్4 (ఆర్ఎన్ఎ): ఉన్నత విద్యను అభ్యసించే పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు సకాలంలో అందకపోవడంతో వారు అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం బోధనా రుసుంలను చెల్లిస్తుండటంతో అనేకులు ప్రైవేటు సంస్థల్లో వృత్తి విద్య కోర్సుల్లో చేరేందుకు ముందుకొస్తున్నారు. అయితే... నిధుల మంజూరులో జాప్యం కారణంగా విద్యార్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు. కొత్త సంవత్సరం మొదలయినా బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమకాకపోటంతో అవస్థలు పడుతున్నారు. బోధనా రుసుంల బకాయిలు కూడా రాకపోవడంతో కలవరపడుతున్నారు. ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారిలో అత్యధికంగా బీసీ విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు, బోధనా రుసుంలకు సంబంధించి బకాయిలు విడుదలచేయాల్సి ఉంది. ఉపకార వేతనాల కోసం దరఖాసుదారులకు ఆధార్ తప్పని చేశారు. విద్యార్థులు కొత్తగా ఆధార్ కోసం నమోదు చేసుకున్న సమయంలో చిన్న వయసుల్లో ఉండటం, ఇప్పుడు పెద్దవారు కావటంతో చాలామందివి వేలి ముద్రలు మారాయి. ప్రస్తుతం వేలిముద్రతో వారి ఆధార్‌కు అనుసంధానం కావడంలేదు. ఫలితంగా చాలామంది దరఖాస్తులు అనువతి పొందని పరిస్థితి నెలకొంది.

# మిషన్ భగీరథతో సకాలంలో నీరు

## కోటి రూపాయల విద్యుత్తు బిల్లు ఆదా

మహబూబ్‌నగర్,అక్టోబర్4 (ఆర్ఎన్ఎ): మిషన్ భగీరథ పథకం అమలుతో పాలమూరు పురపాలక సంఘానికి నెలకు కోటి మేర విద్యుత్తు బిల్లులు ఆదా అవుతాయి. ప్రస్తుతం పట్టణానికి రామన్‌పాడ్, కోయిలసాగర్ పథకాల ద్వారా నీళ్లు సరఫరా అవుతున్నాయి.

పట్టణానికి 65 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామన్‌పాడు నుంచి నాలుగు జలాశయాల గుండా నీళ్లు సరఫరా చేస్తుండడంతో నెలకు రూ.35 లక్షల నుంచి రూ.45 లక్షల వరకు బిల్లులు వస్తున్నాయి. అలాగే 30 కిలోమీటర్ల దూరం నుంచి రెండు రిజర్వాయర్ల ద్వారా కోయిల్‌సాగర్ నీరు సరఫరా అవుతుండడంతోనూ రూ.40 లక్షల మేర నెలకు విద్యుత్తు బిల్లులు వస్తున్నాయి. మిషన్ భగీరథ అమలుతో ఈ విద్యుత్ బిల్లుల భారం నుంచి పురపాలిక గట్టెక్కుతుంది. అలాగే ఎన్నో ఏళ్ల తాగునీటి ఇబ్బందులు మిషన్ భగీరథతో తొలుగుతాయి. పట్టణంలో నీటి సరఫరా వ్యవస్థ మొత్తంగా ఆధునీకీకరిస్తారు. 14 ట్యాంకులు నిర్మించి వాటికి 300 కిలోమీటర్ల పొడవునా పైపులైన్లు అనుసంధానం చేస్తాం. త్వరలో పనులు మొదలవుతాయి.

మిషన్ భగీరథతో పురపాలికకు రామన్‌పాడ్, కోయిల్‌సాగర్ నీటి సరఫరా పథకాల ద్వారా నెలకు వచ్చే విద్యుత్ బిల్లుల భారం పూర్తిగా తగ్గుతుంది. గ్రామీణ నీటి సరఫరాలశాఖ పర్యవేక్షణలో ఇక నుంచి నీటి సరఫరా జరుగుతుంది. మొత్తంగా పాలమూరు పురపాలికలో తాగునీటి కష్టాలు త్వరలోనే తీరనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాతో అమృత్ పథకం కింద పాలమూరు పురపాలక సంఘానికి మంజూరు చేసిన రూ.160 కోట్లతో అమలు చేయబోతున్న మిషన్ భగీరథ నీటి సరఫరా పనుల టెండరు ఎట్టకేలకు పూర్తయింది. ఈ పనులను మెగా కంపెనీ గుత్తేదారులు సొంతం చేసుకున్నారు. దీంతో పట్టణంలో తాగునీటి పైపులైన్ల విస్తరణ, జలాశయాల నిర్మాణం వంటి పనులు చేపట్టబోతున్నారు. ఏడాది కాలంలో ఈ పనులు పూర్తి చేసి ప్రజలకు శుద్ధజలం సరఫరా చేసేందుకు పనులను త్వరగా పూర్తి చేయనున్నారు. సకాలంలో పనులు పూర్తి చేస్తే ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు పాలమూరు పట్టణ ప్రజలకు రోజూ నల్లానీరు అందే అవకాశం ఏర్పడుతుంది. పాలమూరు పట్టణంలో మిషన్ భగీరథ ద్వారా తాగునీటి పథకాన్ని ఆధునికీకరించడంతోపాటు పట్టణ జనాభాకు అనుగుణంగా మరో 20 ఏళ్ల పాటు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పైపులైన్లు విస్తరించి రిజర్వాయర్లు నిర్మిస్తారు. మిషన్ భగీరథ ద్వారా పట్టణానికి అప్పన్నపల్లి వైపు నుంచి వచ్చే ప్రధాన పైపులైన్ నుంచి అయ్యప్పకొండపై నిర్మించే బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా రోజూ 20 ఎమ్మెల్డీలు, అలాగే భూత్పూర్ వైపు నుంచి వచ్చే ప్రధాన పైపులైన్ నుంచి మన్యంకొండపై నిర్మిస్తున్న బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా రాంరెడ్డిగూడెం ఫిల్టర్‌బెడ్‌తో అనుసంధానం చేస్తూ నీరు సరఫరా చేస్తారు.

# తమన్నాకి సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చిన ఉపాసన



గాంధీ జయంతి శుభాకాంక్షలతో అక్టోబర్ 2న విడుదలైన సైరా చిత్రం బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్ళు రాబడుతున్న సంగతి తెలిసిందే.

అన్ని చోట్ల ఈ చిత్రానికి మంచి ఆదరణ లబిస్తుంది. తన తనయుడు రామ్ చరణ్ నిర్మించిన చారిత్రాత్మక చిత్రం ఇంత మంచి విజయం సాధించడంతో మెగాస్టార్ చిరంజీవి చాలా హ్యాపీగా ఉన్నారు. చిత్రబృందం కూడా విజయాన్ని బాగా ఎంజాయ్ చేస్తుంది. ఇక సైరా చిత్ర నిర్మాత చరణ్ భార్య ఉపాసన కూడా సైరా విజయాన్ని ఆస్వాదిస్తూ చిత్రంలో లక్ష్మీ నరసింహారెడ్డి పాత్ర పోషించిన తమన్నాకి సర్‌ప్రైజింగ్ గిఫ్ట్ ఇచ్చింది. ఖరీదైన ఉంగరాన్ని తమన్నాకి బహుమతిగా ఇచ్చిన ఉపాసన తన ట్విట్టర్‌లో ఉంగరంతో తమన్నా దిగిన ఫోటోని షేర్ చేస్తూ .. 'నిర్మాత భార్య నుంచి సూపర్ తమన్నాకు ఓ బహుమతి. నిన్ను మిస్ అవుతున్నాను. త్వరలో కలుద్దాం' అంటూ ఉపాసన ట్వీట్ చేశారు.

నర్సింహారెడ్డి ప్రియురాలిగా, నర్తకిగా తమన్నా తన పాత్రలో జీవించింది. ఆమె పాత్రపై ప్రశంసల వర్షం కురుస్తుంది.

## వైరల్‌గా మారిన స్నేహ సీమంతం వేడుక ఫోటోలు

తెలుగింటి సీతమ్మగా అందరి మనసులలో చెరగని ముద్ర వేసుకున్న స్నేహ పెళ్ళి తర్వాత కొన్నాళ్ళు సినిమాలకు దూరమైంది. అచ్చముండు..అచ్చముండు సినిమాలో స్నేహ, తమిళ నటుడు ప్రసన్న మధ్య ఏర్పడ్డ స్నేహం ప్రేమగా మారింది. 2012లో వీరి వివాహం జరిగింది. 2015లో స్నేహకి కుమారుడు జన్మించగా, ఆయనకి విహాన్ అనే పేరు పెట్టారు. ప్రస్తుతం స్నేహ గర్భవతి కాగా, ఆమె సీమంతం వేడుకని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బంధువులు, స్నేహితులు హాజరయ్యారు. స్నేహ.. తన సీమంతం వేడుక ఫోటోలని సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్‌గా మారాయి. స్నేహాకి పలువురు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు. స్నేహ చివరిగా రామ్ చరణ్ నటించిన వినయ విధేయ రామ చిత్రంతో పాటు తమిళంలో శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కిన వెలైక్కారన్ అనే చిత్రంలో ముఖ్య పాత్ర పోషించింది. ఆమె నటించిన పట్టాస్, వాన్ చిత్రాలు త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.

# దర్బార్ షూటింగ్ పూర్తి.. సంక్రాంతికి విడుదల



సూపర్ స్టార్ రజనీకాంత్ ప్రధాన పాత్రలో మురుగదాస్ తెరకెక్కిస్తున్న చిత్రం దర్బార్. ఇందులో రజనీ డ్యూయర్ రోల్ పోషిస్తుండగా, ఒక పాత్రలో పోలీసు అధికారిగా, మరో పాత్రలో ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుగా కనిపించనున్నారు. ముంబై నేపథ్యంలో సాగే చిత్రం దర్బార్ కాగా, ఎక్కువ భాగం చిత్రీకరణ ముంబైలోనే జరిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులలోను చిత్ర షూటింగ్ జరిపడం విశేషం. నేటితో చిత్ర షూటింగ్ పూర్తైందని మేకర్స్ తెలియజేశారు. సంక్రాంతికి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నారు.

దర్బార్ చిత్రంలో నయనతార కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు ప్రతీక్ బబ్బర్‌తో పాటు చెన్నై భామ నివేదా థామస్ , మలయాళ నటుడు చెంబన్ వినోద్ జోస్ దర్బార్ చిత్రంలో ముఖ్య పాత్రలు పోషించారు. చిత్రంలో యువరాజ్ తండ్రి యోగ్ రాజ్ సింగ్ , విజయ్ సేతుపతి ధర్మదొరైలో నటించిన జీవా అనే ట్రాన్స్‌జెండర్ కీలక పాత్రలు పోషిస్తున్నారట. బాలీవుడ్ నటుడు సునీల్ శెట్టి ఇందులో ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్న సంగతి తెలిసిందే.

# వైభవంగా భద్రకాళి శరన్నవరాత్రి ఉత్సవాలు

## అమ్మవారిని దర్శించుకున్న మంత్రులు



వరంగల్,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా ఆరో రోజు శుక్రవారం భవానిమాతగా వరంగల్ భద్రకాళీ దేవి దర్శనమిచ్చారు. అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అలంకరణలో ఉదయం పల్లకిసేవ రాత్రి శేష వాహన సేవతో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. ఇకపోతే దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ భాస్కర్ శుక్రవారం భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు మంత్రులకు, చీఫ్ విప్ కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దేవి నవరాత్రుల సందర్భంగా వారు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం వారికి ఆలయ పూజారులు అమ్మవారి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని వేడుకున్నట్టు పేర్కొన్నారు. మంత్రులకు స్వాగతం పలికిన వారిలో ఆలయ అధికారులు, వేద పండితులు, పాలకవర్గ సభ్యులున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. భారీగా ప్రజలు హాజరై అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# కాంగ్రెస్ వారతస్వ రాజకీయాలు చెల్లవు: కిషన్ రెడ్డి

హైదరాబాద్,అక్టోబర్4 (ఆంఎన్ఎ): కాంగ్రెస్ వారసత్వ రాజకీయాలు చేస్తుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. గాంధీ సంకల్ప యాత్రలో భాగంగా యూసుఫ్ గూడలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గతంలో పాలకులు గాంధీని మరిచిపోయారన్నారు. సోనియాకు పీవీ, గాంధీ గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. నెహ్రూ కుటుంబానికి దేశ ప్రజలు బుద్ధి చెబుతున్నారన్నారు. స్వచ్ఛ భారత్ లక్ష్యంగా తాను పాదయాత్ర చేపట్టానని అన్నారు. మోడీ ఆదేశాలతో తాను ఈ యాత్రకు సిద్ధం అయ్యానని అన్నారు. ప్రజల సంక్షేమం, దేశాభివృద్ధి లక్ష్యంగా మోడీ పాలన సాగుతోందన్నారు. మోడీ తీరుతో ప్రపంచంలో భారత్ ప్రతిష్ట పెరిగిందన్నారు. తన యాత్రకు నగర ప్రజలు ఆదరణ చూపడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

# అదుపుతప్పి బోల్తా పడ్డ కారు



రంగారెడ్డి,అక్టోబర్4 (ఆంఎన్ఎ): షాబాద్ మండలంలోని కుర్వగూడ గేట్ సమీపంలో శుక్రవారం ఉదయం రోడ్డుప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. ఇదిలావుంటే మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని బుద్వేల్ వద్ద కారులో మంటలు చెలరేగాయి. ఆకస్మాత్తుగా మంటలు ఎగిసిపడడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు అప్రమత్తమై కారు నుంచి దిగి సురక్షితంగా బయట పడ్డారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇకపోతే అంబర్‌పేటలో ఓ ఆర్టీసీ బస్సు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ క్రమం లో ఆటోను కూడా బస్సు ఢీకొనడంతో ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదం నుంచి ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆటో డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు వరంగల్ జిల్లాకు చెందినదిగా పోలీసులు గుర్తించారు.

## మరో ఘటనలో కారులో మంటలు

# తనిఖీల్లో 1.20 కోట్లు పట్టివేత



సూర్యాపేట,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): ఉప ఎన్నిక సందర్భంగా జరిగిన తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడింది. జిల్లాలోని నేరెడుచర్ల మండలం చిల్లేపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఓ కారులో తరలిస్తున్న రూ.1.20 కోట్ల నగదును పోలీసులు గుర్తించారు. నగదును మేళ్లచెరువు మండలం ఆసరా పెన్షన్ల సొమ్ముగా కారులోని వ్యక్తులు తెలిపారు. ఈ నగదును మిర్యాలగూడ పోస్టాఫీసు తెచ్చినట్లు వారు వెల్లడించారు. కారును, నగదును నేరెడుచర్ల పోలీసు స్టేషన్‌కు తరలించి పోలీసులు విచారణ చేపట్టారు. హుజుర్‌నగర్ ఉప ఎన్నిక నేపథ్యంలో సూర్యాపేట జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. దీంతో తనిఖీలుచేపట్టారు.

# సల్మాన్‌ను బెదిరించిన వ్యక్తుల అరెస్ట్

ముంబై,అక్టోబర్4(ఆర్ఎన్ఎ): గత వారం ప్రారంభంలో ఇద్దరు వ్యక్తులు బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌ని సోషల్ మీడియాలో బెదిరించిన సంగతి తెలిసిందే. పబ్లిసిటీ కోసం సెప్టెంబర్ 6న వారు సల్మాన్‌ని బెదిరించారు. తాజాగా వారిద్దరు దొంగతనం, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసులో పోలీసులకి దొరికారు. వారి పేర్లు జాకీ బిష్ణోయ్ అలియాస్ లారెన్స్ బాబల్, జగదీష్. అయితే జోధ్‌పూర్‌లోని లారెన్స్ ముఠాతో తనకి సంబంధం ఉన్నట్టు అందరు నమ్మాలని జాకీ తన పేరుకి ముందు లారెన్స్ తగిలించి లారెన్స్ జాకీ అని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. విలాసవంతమైన కారులో వెళుతున్న సమయంలో పోలీసులు వారిని పట్టుకొని విచారించగా దొంగతనం,మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడినట్లు పోలీసులు కనుగొన్నారు.

# జర్మనీలో ఘనంగా బతుకమ్మ సంబురాలు



హైదరాబాద్, అక్టోబర్ 4ఎ:బతుకమ్మ ఉత్సవాలు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా ఖండాంతరాల్లో కూడా అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలను నిర్వహిస్తున్నారు. జర్మనీలోని మ్యూనిక్ నగరంలో నాలుగోవసారి తెలంగాణా సంస్కృతికి ప్రతిబింబమైన సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో 200లకు పైగా ఎన్నారై మహిళలు పాల్గొన్నారు.బతుకమ్మ ఆటపాటలతో ఆ పరిసరాలు మార్మోగాయి. ఆడపడుచులు రంగురంగుల పూలతో బతుకమ్మలను తీర్చిదిద్ది ఉయ్యాల పాటలు పాడారు. పసందైన వంటకాలతో వేదిక గుమగుమలాడింది. చిన్న పిల్లలు సైతం తమ ప్రాంత సంస్కృతిని చూసి చాలా ఆనందించారు. తెలంగాణలో జరుపుకున్న విధంగానే జర్మనీలోనూ బతుకమ్మ సంబురాలను నాల్గవ సంవత్సరం కూడా ఘనంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, తెలంగాణ వ్యాప్తంగానే కాకుండా ఇతర దేశాల్లో స్థిరపడిన తెలంగాణ, తెలుగు వాసులు కూడా బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించుకోవాలని సుష్మ, శ్రీలత, మానస, కీర్తన, పుష్ప, మంజుల, సృజన, సంగీత, శైలజ, శిరీష పిలుపు నిచ్చారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.